సాహిత్య
# ప్రస్థానం
సెప్టెంబరు 2016
వెల రూ. 10



ఒక వీరుడు మరణిస్తే
వేలకొలది ప్రభవింతురు!
ఒక నెత్తుటి బొట్టులోనె
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు!




ఆవంత్స సోమసుందర్
19.11.1924 - 12.08.2016

సాహితీస్రవంతి

సాహిత్య

# ప్రస్థానం

అక్టోబర్-నవంబర్ 2016

## స్వేచ్ఛాస్వరం ప్రత్యేక సంచిక



మానవ చైతన్య వికాసంలో సాహిత్యం మహత్తర పాత్ర నిర్వహించింది. మూఢత్వాన్ని ఆధిపత్యాన్ని ,పీడనలూ దోపిళ్లను ప్రశ్నించడానికి అక్షరాలా ఆలంబనగా నిలిచింది. ఆశయాలకు వూపిరులూదింది. సంఘ సంస్కరణలోనూ స్వాతంత్ర పోరాటాలలోనూ , విప్లవ విజయాలలోనూ ప్రేరణగా నిలిచింది. ఈ కారణంగానే దేశ దేశాల్లో సాహిత్యకారులు రచయితలు కవులు అనేక నిర్బంధాలనూ నిషేధాలను ఎదుర్కోవలసి వచ్చింది. మన దేశంలోనూ ఇటీవలి చర్చకు వచ్చిన అనేక పరిణామాల నేపథ్యంలో ఉజ్వలమైన ఉత్తేజకరమైన ఈ చరిత్ర మననం చేసుకోవడం అవసరమని భావిస్తున్నాం. ఆలోచనాత్మకమైన ఆచరణకు మార్గదర్శకమైన అక్షర సంపదలు అందించాలనే సంకల్పమే ఈ స్వేచ్ఛాస్వరం. గతంలోని మా ప్రత్యేక సంచికలను మించి ప్రతిష్ఠాత్మక రచయితలు మేధావుల రచనల సమాహారంగా వెలువడనున్నది. భావప్రకటనా స్వేచ్ఛ అంశంపై విలువైన రచనలకు ఆహ్వానం.


**ప్రకటన కర్తలకు విజ్ఞప్తి**

సాహిత్య ప్రస్థానం ప్రత్యేక సంచికకు ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించవలసిందిగా ప్రకటనకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ ప్రత్యేక సంచిక ద్వారా మీ ప్రకటన విభిన్న ప్రజానీకాన్ని, విలువైన పాఠకుల్నీ చేరుకుంటుంది. మీ ప్రయోజనం నెరవేరటమే కాదు, ప్రస్థానంలో ప్రకటన ద్వారా తెలుగు భాషా, సాహిత్యాల్ని సుసంపన్నం చేయడంలో మీరూ భాగం పంచుకున్నట్టే. చిరకాలం దాచి వుంచుకోదగిన స్థాయిలో వెలువడుతున్న ఈ ప్రత్యేక సంచికకు మీ నుంచి అదే విధమైన ప్రత్యేకాదరణ లభిస్తుందని ఆశిస్తున్నాం.

- సాహిత్య ప్రస్థానం

*Account Details:*
A/c Name: **PRASTHANAM**
A/c No. 52001500585
**SBH**, Governorpet, Vijayawada
IFSC : SBHY0020343

***Note:*** Please issue cheque/DD's in favour of **PRASTHANAM**


Add Size: 16.5 cm x 21.5 cm



***సంప్రదించండి:***
27-30-4, యం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు
ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-520 002.
ఫోన్: 0866-2577248, 9490099059

**www.prasthanam.com, e-mail: ssprasthanam@gmail.com**

సాహిత్య ప్రస్థానం
సెప్టెంబరు 2016
సంపుటి : 15 సంచిక : 9



నివాళి

# అవిశ్రాంత అక్షర వజ్రాయుధ యోధుడు

వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ అస్తమయంతో తెలుగు సాహిత్యం మాత్రమే గాక భారత దేశ ప్రగతిశీల సాంస్కృతిక రంగం కాకలు తీరిన ఒక సాహిత్య శిఖరాన్ని కోల్పోయింది. ఆయనకు బిరుదులూ పదవులూ ఏమున్నా లేకపోయినా డెబ్బై ఎనభై ఏళ్లపాటు ప్రజల విముక్తికి కలాన్ని అంకితం చేసిన ఘనత వుంది. అభ్యుదయ రచయితల ఉద్యమ వ్యవస్థాపక నాయక బృందంలో అందరికన్నా అత్యధిక కాలం మనమధ్యన గడిపిన ప్రత్యేకత కూడా ఆయనదే. ఇప్పుడాయన కన్నుమూతతో బహుశా ఆ తరం వారెవరూ మిగలలేదని చెప్పొచ్చు. శ్రీశ్రీ మహాప్రస్థానం లాగే తెలుగు వారికి చిరస్థాయిగా నిలిచిన కావ్యం సోమసుందర్ వజ్రాయుధం. తెలుగు వారు అమితంగా ఉటంకించే పంక్తులు ఒకవీరుదు మరణిస్తే ప్రభవింతురు వేలమంది..ఒక నెత్తుటి బొట్టులోనె ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు.. ఆశయాలకోసం సాగే మహాప్రస్థానం ఆగేది కాదన్న సందేశం ఇందులో అంతర్లీనం.

సోసు సాహిత్య జీవితం సుదీర్ఘమైంది. సుసంపన్నమైంది. వైవిధ్య భరితమైంది. నిష్కర్షతో సాగిన నిబద్ధ నిర్మాణాత్మక జీవితం ఆయనది. ఆయన జీవితంలో గాని సాహిత్యంలో గాని శషభిషలుండవు. కాళ్లుతడబడడం, నీళ్లు నమలడం వుండవు. చెప్పదల్చుకుంది చెప్పడమే. అనదల్చుకున్నది అనడమే. అయితే ఆ చెప్పిందాంట్లోనూ అన్నదాంట్లోనూ అభ్యుదయం తప్ప అన్యం వుండదు. అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ ఆఖరి క్షణం వరకూ కృషి అక్షరజీవిగా ఆయనతో పోల్చదగిన వారు చాలా తక్కువ. ఆయన జీవిత గమనం కూడా అంత విలక్షణమైంది.

తూర్పుగోదావరి జిల్లా శంఖవరం గ్రామంలో 1924 నవంబరు 18న ఆయన పుట్టారు. తల్లి వెంకాయమ్మ వ్యాధి గ్రస్తురాలుగా మరణించకముందే తనను చెల్లెలికి దత్తత ఇవ్వడంతో పిఠాపురం చేరారు. తండ్రి కాళ్లూరి సూర్యప్రకాశరావు స్వయాన స్వతంత్ర యోధుడు. ఆ దంపతులకు ఏడో కుమారుడుగా పుట్టిన సోసు దత్తత కారణంగా ఆవంత్స అయ్యారు. అలాగే గొప్ప ఆస్తికి వారసుడూ అయ్యారు. పెంపుడు తల్లి అప్పటికే వితంతువు.. ఆమె భర్త వెంకటరావు ఇంగ్లీషు టీచరు మాత్రమే గాక సాహిత్యాభిలాషి కావడంతో ఇంట్లొ కావలసినన్ని పుస్తకాలు పోగేసి పోయాడు.అయిదో ఏటనుంచే సోసు పురాణాలు భాషా వ్యాకరణాలు నేర్చుకోవడం మొదలెట్టారు. పద్యాలు పాడడమే గాక రాయడమూ పట్టుకున్నాడు. పిఠాపురం మంచి సాంస్కృతిక కేంద్రం. స్థానిక రాజు సూర్యరాయల పేరిటే పండితులు నిఘంటువు వెలవరించారు. ఆయన పేరిటనే సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం కూడా వుంటే బాగా చదువుకున్నాడు. ఆ గ్రంథాయలాధికారి రంగనాయకులు రోజూ అంతసేపు కూచుంటున్న ఈ కుర్రాడు నిజంగా తెలివైనవాడని పరీక్షించి తెలుసుకుని తదుపరి అధ్యయనానికి నిర్దేశం చేశాడు. రవీంద్రనాథ టాగూరు తమ వూరు మీదుగా వెళ్తున్నారని తెలిసి స్టేషన్‌కు వెళ్లి చూశాడు. విశ్వనాథ సత్యనారాయణ ఒక సభకు వచ్చి పండిత ప్రసంగం చేస్తే పట్టుపట్టి మరీ కిన్నెర సాని పాటలే పాడించుకున్నాడు.

ఇదంతా 1940ల నాటి మాట. సాహిత్యాసక్తితో పాటు రాజకీయ చైతన్యం కూడా పెంచుకుంటున్న సోసు 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించి పోలీసు నిర్బంధం చవిచూశాడు.అప్పుడే కవిత్వం

రాయడం ప్రారంభించారు. 1943లో కాకినాడ పిఆర్ కాలేజీలో చేరారు.

భావకవితా పితామహుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి అక్కడ అధ్యాపకులు. అప్పటికే సోసుకు ఆయనకు ఆరాధ్యుడు. అయితే భావకవిత్వం కొడిగట్టి పోతున్నది.. కృష్ణశాస్త్రి సాయింత్రం వేళ దర్బారు తీరి సాహిత్య చర్చలు సాగించేవారు. సోసు తన కుటుంబ నేపథ్యంతో అక్కడ పాగా వేయగలిగాడు. అప్పుడే ఆయన నిర్వహించిన అభ్యుదయోత్సవాల సందర్భంగా దేవరకొండ బాలగంగాధర తిలక్, సంపత్ రాఘవాచార్య అనే నూతన కవుల పరిచయం కలిగింది. ఉద్యమ కార్యకర్త ఆర్.బి. పెండ్యాల తనకు ప్రజాశక్తిలో వచ్చిన శ్రీశ్రీ గేయం పతితులార భ్రష్టులార ఇచ్చి చదవమన్నాడు. ఇలాటివి రాయగలవా అని ప్రేరేపించాడు. ఆ కవిత్వ ప్రభంజనంతో ప్రకంపనాలకు గురవుతుండగానే కలకత్తాలో విద్యార్థి ఫెడరేషన్ మహాసభలకు వెళ్లాడు. భయంకరమైన బెంగాల్ కరువు కళ్లారా చూశాడు. మౌనఘోష పేర మరో మానవీయ కవిత రాశాడు. ఆ సభల ప్రభావంతో తిరిగిరాగానే కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. పిఠాపురంలో కమ్యూనిస్టుపార్టీ ఆఫీసు నిర్వహణ వ్యయం తనపైన వేసుకున్నాడు. మార్క్సిజాన్ని అధ్యయనం చేస్తూనే మరోవైపున క్రిస్టొఫర్ కాడ్వెల్ తదితరుల రచనలు చదివాడు. అప్పుడు అంటే 1944-48 మధ్య రాసిన గీతాలే వజ్రాయుధంలో చేరి చరిత్రగా మారాయి.




శ్రీశ్రీ తెలుగు కవిత్వపు దిశను మార్చిన తర్వాత వచ్చిన ఒకే ఒక కవితా సంకలనం నయాగరా. గుంటూరు జిల్లా నర్సరావు పేట నుంచి ఏల్చూరి సుబ్రహ్మణ్యం. బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు అనే యువకవి త్రయం దాన్ని ప్రచురించారు. అలాటిది మరొకటి రావల్సిన అవసరం వుందని సోసు మిత్రుడు అధ్యయన శీలి రాంషా ఎడిటింగ్‌తో 'వజ్రాయుధం' ప్రచురించారు. అచ్చును బట్టి చూస్తే తెలుగులో అది మొదటి అభ్యుదయ కావ్యం. 1945 మార్చి5న వెలువడింది. ఇక మరో ప్రముఖుడు ఆరుద్ర కూడా తన కవితలు వేసుకోలేక తంటాలు పడుతుంటే సోసునే ఆర్థిక సహాయం చేసి త్వమేవాహం తీసుకొచ్చారు. ఈ రెండూ రాజమండ్రి అవంతీ ప్రెస్‌లో అచ్చయ్యాయి. అప్పటికి శ్రీశ్రీకి తన పుస్తకం ఎలా ప్రచురించాలనే దానిపై చాలా వూహాలుండేవి కనుకే ఆలస్యమైంది. ఈ రెండూ వచ్చాక ఆయన కూడా నళినీకుమార్ సహాయంతో మచిలీపట్నం నుంచి మహాప్రస్థానం ప్రచురించారు. చారిత్రికంగా చూస్తే మహాప్రస్థానం ఒక విశాల విశ్వజనీన కవిత్వం. మిగిలిన రెండూ నిర్దిష్టంగా నాటి పరిస్థితులకు తెలంగాణ సాయుధ పోరాటాన్ని చిత్రించిన రచనలు.

తన చరిత్ర తనె పఠించి ఫక్కున నవ్వింది ధరణి, తన గాథను తనె స్మరించి భోరున ఏడ్చింది ధరణి అంటూ చరిత్రలో వైరుధ్యాలను చెప్పిన సోసు 'భువి యొక విప్లవ మూర్తై నిలువుకాళ్ల నిలుస్తోంది.. అరుణారుణ పతాకమై ఆకాశం మెరుస్తోంది అంటూ సమరసందేశం ఇస్తాడు. ఇందులో ఫ్యాక్టరీ అనే గేయం పెట్టుబడిదారీ వ్యవస్థ నిజస్వరూపాన్ని కళ్లకు కడుతుంది. కార్మికులపై అలాటి గీతం అప్పటికి కొత్త. ఇందులో ఇంకా చాలా కవితలున్నా చరిత్రాత్మకమైంది చరిత్రలో నిలిచింది తెలంగాణ పోరాట శంఖాలై మార్మోగిన బానిసల దండయాత్ర కవితలే. కదలండి కదలండి అంటూ రాసిన కవితలో ఖబడ్దార్‌ఖబడ్దార్ అంటూ దండయాత్రను గడీలపైకి నడిపించాడు.

ఖబడ్దార్ ఖబడ్దార్ / నిజాం పాదుషాహే/ బానిసత్వ విముక్తికై/ రాక్షసత్వ నాశముకై/ హిందూ ముస్లిం పీడి/శ్రమ జీవులు ఏకమైరి/ తమపై స్వారీ చేసే/ దేశముఖుల ప్రతిఘటించి/ ప్రజాకోటి పోరుతుంది/ఖబడ్దార్ ఖబడ్దార్/ కోట్ల కోట్ల బానిసలను/పీల్చికూల్చి నిర్మించిన/ నీ రాక్షస సింహాసన/మదిగదిగో కదుల్తోంది' ఈ గేయంలోనే చివరగా ఒకవీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు అన్న శాశ్వత సత్యం చెప్పారు.. విప్లవ ప్రస్థానంలో విస్తృతార్థంలో ఇది అక్షర సత్యం. కనుకనే

ప్రపంచంలో ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా ప్రజా ప్రస్థానం సాగుతూనే వుంది. వజ్రాయుధం ప్రచురణ తర్వాత సోసు, రాంషాలపై కేసు పెట్టారు. దాన్ని నిషేదించారు. ప్రచురించిన ప్రెస్‌పైన దాడి చేసి ప్రతులు పట్టుకుపోయారు. అయితే అప్పటికే అందులోని గేయాలు సాహిత్యకారులకు ఉద్యమ కారులకు కూడా పరిచితమై పోయాయి.. ఈ ఘటన తర్వాత గొప్ప అధ్యయన శీలి రాంషా మార్గం మార్చుకుని అభిసారిక అనే పత్రిక సంపాదకుడైనారు. సోసు 1950లలో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం మానుకుని అభిమానిగా ఆశయాల బాటలో కొనసాగారు. కళాకేళి అనే పత్రిక నడుపుతూ శ్రీశ్రీ, ఆరుద్ర, కాళోజీ, తిలక్, చాసో, వరవరరావు, అద్దేపల్లి తదితర పెద్దలతో సహా చాలా మంది యువకవులు, రచయితల రచనలు ప్రచురించారు. ఆనాటి సైద్ధాంతిక విభేదాలలో సిపిఐకి దగ్గరగా వుంటూ అభ్యుదయ రచయితల ఉద్యమానికి పెద్ద దిక్కుగా కొనసాగారు. ఆ వాదనలు గట్టిగానే వినిపించారు. విరసం ఆవిర్భావ సమయంలో హోరాహోరిగా వాదనలు సాగించి అరసం పునర్నిర్మాణానికి కూడా దోహదం చేశారు. అప్పట్లోనే శ్రీశ్రీ గురజాడలపై సోసు చేసిన వ్యాఖ్యలకు సివి బలమైన సమాధానం రాశారు. విరసం రచనల్లోనూ సోసును తరచూ అపహాస్యం చేయడం జరిగేది. అయితే రాజకీయాభిప్రాయాలతో నిమిత్తం



లేకుండా ఆయన నిరంతరం అభ్యుదయ భావాలకు వామపక్ష ఉద్యమానికి కట్టుబడి వున్న మాట నిజం. ఒక దశలో శృంగార కవిత్వం (సోమర సుందర కాండ, మిణుగురులు) ప్రయత్నమో ప్రయోగమో చేసినా త్వరలోనే దాన్నుంచి బయటకు వచ్చేశారు.

మిగిలిన చాలమంది సాహిత్యకారులకు లేని ఒక గొప్ప లక్షణం సోసులో నిరంతరాయత. ఆయన సృజనాత్మక రచనలే గాక సాహిత్య చరిత్ర అధ్యయనం కవిత్వ విశ్లేషణ కవుల పరిచయం వంటివి పుంఖానుపుంఖంగా వెలువరించారు. శతాధిక సాహిత్య గ్రంధాలు ఆయన పేరిట వచ్చాయి. మరీ ముఖ్యంగా ఇతర కవులను పరిచయం చేసిన సహృదయత సాహిత్య ఆసక్తి ఆయన స్వంతం. ఆ విధంగా కృష్ణశాస్త్రి కవితాత్మ, అమళ్ళత వర్షిణి (తిలక్‌పై) శేషేంద్రజాలం, రుధిరజ్యోతిర్దర్శనం(నారాయణబాబుపై) పురిపండా పులిపంజా, గురజాడ, బుద్దదేవ్‌బోస్, ఆంగ్లసీమలో ఆమనినిజాలు, తదితర రచనలు చేశారు. కవిత్వం కాలాతీత కాంతిరేఖ పేరిట కవితా గుణ విమర్శ చేశారు. ఒక సభలో నారాయణరెడ్డి ఇందుకు సోసును సమకాలీన కవులు ఎంతగానో అభినందించేవారు. బానిసల దేశం, మందీ మనిషి, కాహళి, గోదావరి జల ప్రళయం, రక్తాక్షి, మేఘ రంజని, కళాకేళి సంపుటం, అనల కిరీటం, వెన్నెల్లో కోనసీమ, మా వూరు మారింది, తురాయిపూలు, సోమసుందర్ కథలు వంటివి ఆయన ఇతర రచనలు. ఆగతానికి శుభారంభం పేరిట రాసిన వ్యాస సంపుటిలో ఆయన గురజాడనూ భావ కవులను గొప్పగా విశ్లేషిస్తారు. సాహిత్యంలో సంశయ కల్లోలం అన్నది ఎనభైల నాటి పరిస్తితిపై వ్యాఖ్యానం. కాడ్వెల్ ప్రసిద్ధ రచనను భ్రాంతి వాస్తవం పేరిట, జార్జి ధాంప్సన్ రచనను కవిత్వం సమాజం పేరిట అనువాదం చేశారు. ఈ విధంగా చెబుతూ పోతే సోసు రచనల జాబితా చాలా పెద్దది.

వామపక్ష పత్రికలలో సోసు నిరంతరం రాస్తుండేవారు. విశాలాంధ్రలో అనేక శీర్షికలు రాశారు. ప్రజాశక్తి సాహిత్య పేజీలో విదేశీ రచయితలను భారతీయ భాషల రచయితలను దాదాపు రెండేళ్లపాటు పరిచయం చేశారు. ఇదేగాక ఏ సమస్య వచ్చినా తన అభిప్రాయం చెబుతూ స్పష్టంగా లేఖలు రాయడం ఆయనకు అలవాటు. ఈ రచయితకు అలా రాసినవి చాలా వున్నాయి. ప్రస్థానం కూడా తన రచనలు సమీక్షలు ప్రచురించడం పాఠకులకు తెలుసు.

సోసు మంచి వక్త కూడా. కొన్ని దశాబ్దాల పాటు తెలుగు నాట ప్రధానమైన పట్టణాలన్నిటా సాహిత్య సభలకు ఆయన

హాజరైనారు. ఢిల్లీలోనూ జాతీయ సమ్మేళనాలలో పాల్గొన్నారు. నాటి సోవియట్ యూనియన్‌లోనూ, ఆరుద్రతోకలసి లండన్‌లోనూ పర్యటించారు. సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డును, రాజాలక్ష్మి ఫౌండేషన్ పురస్కారాన్ని ఇంకా చాలా గౌరవాలను పొందారు. తనే స్వయంగా రెండు పురస్కారాలు నెలకొల్పి ఆఖరి వరకూ కవులు రచయితలను సత్కరిస్తూ వచ్చారు. తర్వాత ఆయన బాటను మరికొందరు అనుసరించారు గాని ఆయనలా ఇతర కవులపై నిరంతరం పరిశీలనలు వెలువరించిన సీనియర్లు చాలా తక్కువ. 'అట్ట హాసాలు' లేకుండా తన పుస్తకాలు తనే వేసుకుంటూ వచ్చిన ప్రత్యేకత కూడా ఆయనకే దక్కింది. ఆర్థిక స్తోమత కన్నా ఆశయనిబద్ధతే అందుకు కారణమై వుండాలి.

ప్రత్యేకించి గత పాతికేళ్లలోనూ మతోన్మాద రాజకీయాలపై సోసు వ్యాసాలు కవితలూ రాస్తూనే వచ్చారు. పిఠాపురంలో ఆయనతో ప్రత్యక్ష సంబంధం వల్ల ప్రేరణ పొందిన వారెందరో వున్నారు. ఆ విధంగా ఆయన సంపూర్ణ సాహిత్య సామాజిక చైతన్య శీలి. అనారోగ్యం వెన్నాడుతున్నా డిక్టేట్ చేస్తూనే వందల పేజీలు రాశారు. కొంతమందిలాగా ప్రతికూల పరిస్థితులను చూసి ప్రజా ఉద్యమాలకు దూరం కాలేదు. చాందసాన్ని వ్యక్తిగత ధోరణులను నెత్తినపెట్టుకోలేదు. వజ్రాయుధ కవిగానే మిగిలిపోయారు.

సాహితీ స్రవంతి ఇతర ప్రగతిశీల శక్తులు సోమసుందర్ మహత్తర కృషిని వారసత్వాన్ని ఎప్పుడూ గౌరవిస్తూవచ్చాయి. సాహిత్య శాలల్లో ఆయనను సత్కరించాలన్న సంకల్పం ఆయన అనారోగ్యం వల్ల సాధ్యపడలేదు. అందుకే 2015 జులైలో తెలకపల్లి రవి, వొరప్రసాద్, లక్ష్మయ్య, తదితర సాహిత్య మిత్రులతో పాటు కమ్యూనిస్టు నాయకులు, సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి.మధు తదితరులు ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా సత్కరించడం ఆయనకూ మాకూ కూడా ఉత్సాహం ఉత్తేజం నింపింది. పట్టణంలోని కార్మికులూ కార్యకర్తలూ కూడా రావడంతో మరింత సంతోషించారు. ఆ సమయంలోనూ సోసు ఎంత చురుగ్గా వున్నారో తల్చుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

సోసు సుదీర్ఘ జీవితాన్ని ఒక్క చోట చెప్పుకోవడం సాధ్యం కాకపోయినా ఆయన విశిష్టతను మాత్రం స్మరించుకోవాలి. మత మార్కెట్ తత్వాలు మారణశక్తులూ మానవాళిని ప్రత్యేకంగా భారత దేశాన్ని కూడా విషవలయంలోకీడ్చిన నేటి సన్నివేశంలో ఆంక్షలు ఆధిపత్యాలపై చాందసత్వాలపై ధనాధిపత్యాలపై అక్షరం పోరాడవలసిన సమయంలో సోమసుందర్ సార్థక సాహిత్యజీవితం ఒక ప్రేరణగా నిలిచిపోతుంది. ఆయనకివే మా అక్షర నివాళులు. అరుణారుణ వందనాలు.

**- తెలకపల్లి రవి**

కవర్ డిజైన్ : గిరిధర్

బొమ్మలు : తుంబలి శివాజి, గంగాధర్, మీరా

# ఈ సంచికలో ...


కవిత ........................................ 7
మేలుకొలుపు (కథ)........................... 8
కవిత ........................................ 12
కొన్ని సుందర సందర్భాలు ........ ............. 13
కవిత ........................................ 16
తెలుగు భాష – జాషువా మక్కువ ............... 17
మెటిల్డా కథ ఒక వివరణ......................... 21
ధర్మాల ఘర్షణ మహాభారతం..................... 24
కవిత ........................................ 28
తెలుగు నేలపై కన్నడ శాసనాలు . ............... 29
కవిత ........................................ 33
ప్రత్యుపకారం (కథ)............................. 34
అభివృద్ధి పేరుతో కల్లోలం................ ......... 37
మాతంగుడి శపథం (కథ)........................ 39
కవిత ........................................ 42
వినూత్నమైన జుగల్ బందీ 'దూళి చెట్టు.............. 43
దాగిన చరిత్రకు ప్రతిబింబం – చరితార్థులు ....... 45
స్వీకారం...................................... 47
డైరీ.......................................... 49



సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** *(ప్రధాన సంపాదకుడు)*

**వొరప్రసాద్** *(వర్కింగ్ ఎడిటర్)*

*కె. సత్యరంజన్ • చీకటి దివాకర్*
*గనారా • శమంతకమణి*
*• కెంగార మోహన్*

**కె.లక్ష్మయ్య, మేనేజర్**



మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం,
డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ - 520 002,
సెల్: 9490099059

హైదరాబాద్ చిరునామా
ఎం.హెచ్‌భవన్, ఫ్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్‌టిసి
కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ - 500 020

ఇ–మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com



# ఎదురు చూపుల తర్వాత..

- ఎస్.ఆర్.భల్లం
9885442642

ఎంత పొర్లినా
విరామం చాలినట్టు ఉండదు

చిక్క బడుతున్న చీకటికి
తడిరెక్కలు తొడిగినట్లు
వెగటుతనం దాచే వెలుతురు లాంటి పలకరింపు

మౌనాన్ని స్వప్నిస్తూ
మరికొన్ని నీడల్ని మిగుల్చుకుంటూ
రహస్యమంత సున్నితంగా
ఒకరి బతుకు ముడి మరొకరం విప్పలేం

తల్లి గర్భం వెతుకుతున్న
కాందిశీకపు కావలి కన్నులా
అనేక మెలకువలకు జన్మనివ్వడం కోసం
పెళుసు బారిన జీవితాన్ని
చిగురించుకుంటూ పక్షిలా ఎగిరిపోవాలి
వలస సముద్రం కేసి
ఎడారి కెరటమై ఎగురుతోన్న
పల్లెలంత చల్లదనంలోకి ప్రవహించాలి
ఎండుటాకుల మొదళ్లలో
చిగురాకుల అడుగుల చప్పుడుకోసం
పొలిమేరపై మౌనంగా రోదించే పచ్చిగాయం
అసంఖ్యాక సందర్భాలకి
తనకో రంగు మిగుల్చుకోని నీడలా
ప్రక్రియ ఏదో ప్రారంభమవుతుంది

మట్టితో మమేకమైన గుర్తులేవో మిగిలేందుకు
ఎడారి అవుతున్న నేలమీద
గుప్పెడు కన్నీళ్లు చల్లుకున్నా
ధాన్యం బొట్టివ్వని గిడసబారిన మెట్ట

ఆకాశం మెడలో
ఏడు రంగుల కండువా ఇంద్రధనస్సు చూసి
లోపల గడ్డ కట్టిన దేదో ఏడుపుగా కరుగుతోంది

ఎదురు చూడని ప్రపంచాన్ని ఎత్తి చూపిస్తున్నట్టు
పీల్చిపీల్చి పిప్పిచేసేలా
వసూలు దారుడి వారసత్వపు నాటకం
ఇంకా ప్రదర్శింప బడుతూనే వుంది
ఎదలో దాగిన ముల్లు
ఎవరిని గాయపరుస్తోందో
కొన్ని మరణాలు సామూహికమే
లోలోపలి వ్యాకులాలన్నీ
అసలేమీ కాకుండా మిగిలినప్పుడు
ఎడారుల్ని కావలి కాస్తున్న వెన్నెల దిగులు

---




## ఆగస్టు నెల పురస్కారాలు

| వల | జ్వలిస్తూనేవుంటాం...! |
| --- | --- |
| కథకు: రూ.700/- | కవితకు : రూ .500/- |
| రచయిత : చందనపల్లి గోపాలరావు | రచయిత : ఇల్ల ప్రసన్నలక్ష్మి |




***సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి***

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

**- ఎడిటర్**

కథ



# మేలుకొలుపు

మీనాక్షీ శ్రీనివాస్
9492837332

"నేను మేడంతో మాట్లాడాలి"

వారం రోజులుగా ఆ భవనం ముందు నిలబడి 'ఆమె' దినచర్య, అంటే ఎపుడు ఇంట్లో వుంటుంది, ఎప్పుడు షూటింగుకి వెడుతుంది, ఇంట్లో ఎవరెవరు వుంటున్నారు, ఏ టైములో ఐతే ఆమె ఒంటరిగా ఖాళీగా దొరుకుతుంది లాంటి వివరాలు ఎంతో కష్టపడి సేకరించిన అతని పేరు ప్రణీత్, వృత్తి జర్నలిజం.

ఆమె ప్రస్తుతం మొదటిస్థానంలో వున్న సినీతార శ్రీరంజని . ఒక జర్నలిస్టుగా ఆమె అప్పాయింట్మెంట్ అతనికి అంత పెద్ద పనేం కాదు కాని అతను ఆమెని ఒక జర్నలిస్టుగా కలవదలుచుకోలేదు ... అందుకే ఇంత కష్టపడటం!

"ప్లీజ్ నేను మేడమ్‌తో మాట్లాడాలి. ఆమెను అర్జెంటుగా కలవాలి . ఒక్కసారి లోపలికి పంపు...పోనీ...మీ అభిమాని మీతో మాట్లాడాలి అంటున్నాడని, కనీసం ఆమెతో చెప్పు, అప్పటికీ రమ్మనకపోతే, నేవెళ్లిపోతాను ప్లీజ్ " బ్రతిమలాడాడు.

" అరె , కుదరదంటే వినవేంటయ్యా, ఇలా వచ్చిన వాళ్ళనందరినీ లోనికి పంపితే నా ఉద్యోగం ఊడిపోతుంది. వెళ్ళు వెళ్ళు"

"రాంసింగ్! అతనిని లోపలికిపంపు"

గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ భాగోతం, పట్టువిడవని భట్టివిక్రమార్కుడిలా అతని ప్రయత్నం చూస్తున్న ఆమె కనికరించి అసలు అతను ఎవరో, ఎందుకు తనని కలవాలనుకుంటున్నాడో తెలుసుకోవాలని అతనిని లోనికి పిలిపించింది.

"నక్కని తొక్కివచ్చినావ్పో అమ్మగారు పిలుస్తున్నారు" గేటు తెరిచి లోనికి పంపాడు రాంసింగ్.

"నమస్తే మేడం నాపేరు ప్రణీత్ ... మీరు నాకు కొంచెం టైం స్పేర్ చేస్తే, నేను మీతో మాట్లాడాలని వచ్చాను... దయచేసి అవకాశం ఇవ్వండి ప్లీజ్" చాలా పొలైట్గా అడిగిన అతని తీరు ఆమెకు బాగా నచ్చింది .

"ఏం మాట్లాడాలి నాతో మీరు ..... ఒక అభిమానిగానా లేక" అర్థోక్తిగా ఆగింది ...

" మేడమ్నేను మీ అభిమానినే కాని అలా అని మీగురించి అంతా పాజిటివ్‌గానే మాట్లాడే గుడ్డి అభిమానిని మాత్రంకాను , బైదవే నేను ఇప్పుడు మాట్లాడబోయే దానిపై మీరు పాజిటివ్‌గా స్పందించి ఆలోచించే విజ్ఞత మీకు ఉందనే నమ్మకంతోనే నేనీధైర్యం చేస్తున్నాను .... ఇది కేవలం సమాజం పట్ల, మానవత్వం పట్ల వున్న బాధ్యత , అభిమానంతోటే కానీ మిమ్మల్నో , లేక ఈ గ్లామర్ ప్రపంచంలోని ఇంకెవరినైనా కానీ హర్ట్ చెయ్యడానికో, అవమానించడానికో మాత్రం కాదు

…. ముందుగా మీరు నన్ను అర్ధం చేసుకోవాలని ప్రయత్నిస్తే, నా మాటలు మిమ్మల్ని మార్చలేకపోయినా కనీసం బాధపెట్టవు. అలా అని మాట ఇవ్వండి!" మనిషి ఎంత అందంగా ఉన్నాడో, మాటతీరు అంత అందంగా, మృదువుగా , అతను ఏంచెప్పినా కాదనలేని విధంగా, కోపం రాని విధంగా వుంది.



"వెల్ … ముందరి కాళ్ళకి బంధం వెయ్యడం అంటే ఇదే కాబోలు … క్వైట్ ఇంటరెస్టింగ్ … సరే ముందు మీరు కూర్చోండి … ఉపోద్ఘాతమే ఇంత బరువుగా వుందంటే, మేటర్ ఇంకెంత బరువుగా వుంటుందో, సో ముందు మనం ఒక స్ట్రాంగ్ కాఫీ తాగి మొదలు పెడదాం …. లక్ష్మీ త్వరగా రెండు మంచి కాఫీపట్రా….క్విక్ .." పనిపిల్లని పిలచి చెప్పింది .

" ఊ, చెప్పండి, మీపేరు..ప్రణీత్ కదూ,.నైస్‌నేమ్, ఏం జాబ్ చేస్తూ వుంటారు." అతనినే పరిశీలనగా చూస్తూ అడిగింది…

ఆమె చూపులకు ఇబ్బందిగా కదులుతూ, నేనోచిరుద్యోగిని, నాగురించి పెద్దగా చెప్పుకునేందుకు ఏమీలేదు … క్రీగంట చూస్తూ చెప్పాడు. ఎటువంటి మేకప్లేకుండా సాదాసీదా నైట్ డ్రెస్‌లో సింపుల్గా వుంది. జుట్టు పోనీ వేసి నీట్గావుంది.

"కాఫీ తీసుకోండి …." పనమ్మాయి తెచ్చిన కాఫీ … ఆఫర్చేస్తూ అంది….

"థాంక్యూ మేడమ్…. "

" చెప్పండి … మళ్ళీ … నేను బయటకు వెళ్ళే పనుంది …." మృదువుగా అడిగింది .

"మేడం … ఇప్పుడు… ప్రస్తుతం మన సమాజం గురించి మీరెలా ఫీల్ అవుతున్నారు? " చటుక్కున అడిగాడు.

'' ఇదేమిటీ, ఏదో ఇంటర్వ్యూ చేస్తున్నట్లు అడుగుతున్నారు.. కొంపదీసి మీడియాకాదు కదా …." సందేహంగా అంది.

" అదేమిటి మేడం. మీడియా వాళ్ళతో మాట్లాడితే కొంపకూలినంత ఎక్స్ప్రెషన్ ఇచ్చారు …మీకు మీడియా అంటే పడదా…. మీకు లిఫ్ట్ ఇచ్చేదే వాళ్ళు కదా….. " నవ్వుతూ అన్నాడు , కొంత రిలాక్స్ అవుతూ.

"ఛ …అదేం కాదు ..ఒకమాటకి వెయ్యిఅర్ధాలు, రంగులూ అద్ది గాసిప్స్ రాస్తారు. అదేభయం . ఇంతకూ నేనెలా ఫీల్ అవుతున్నదీ మీకెందుకు, నా బిజీ నాది, దేని గురించీ ఆలోచించే తీరిక, ఓపికా ఎక్కడున్నాయ్ ? " అంది నవ్వుతూ.

" మేడమ్ …. మరి ఏ ఇతర రంగానికీ, వ్యక్తులకీ లేనంత ఇమేజ్ , ఫాలోయింగ్ ఉన్న రంగం మీది. అవునంటారా.., ఇది ఒక రంగుల, గ్లామర్ ప్రపంచం. ఒక అరుంధతి భట్టాచార్య, ఒక చందాకొచ్చార్, ఒక లక్ష్మీరాయ్,ఒక కిరణ్‌బేడి యిలా తెలివి, ప్రతిభా, సామర్థ్యం, ధైర్యం, మంచి అకడమిక్ ప్రొఫైల్ ఉన్న ఎంతమంది స్త్రీలు, నిజానికి స్త్రీలే కాదు మగవాళ్ళైనా సరే ఎంతమందికి వీళ్ళు తెలుసు, ఎంతమందికి వాళ్ళ ప్రతిభ తెలుసు. అదే సినిమా స్టార్లయితే… బొడ్డూడని పసివాళ్ళకి కూడా హీరో-హీరోయిన్లు, కమెడియన్స్ ఆఖరికి ఐటెం సాంగ్ డాన్సర్‌తో సహా అందరూ తెలుసు. అంత ప్రాముఖ్యత ఉన్నఫీల్డ్ . అంత ఫాలోయింగ్ వున్న ఫీల్డ్, అంత అనుకరణ, ఆకర్షణ వున్న ఫీల్డ్. ఎవరికైనా, ఎవరినైనా సులభంగా ఆకట్టుకోగల ఫీల్డ్, లేని అందాలని తెప్పించి సులువుగా అందలాలు ఎక్కించగల ఫీల్డ్, మంచినైనా, చెడునైనా సులభంగా వ్యాపించేటట్లు చెయ్యగల ఫీల్డ్, ఎవరికైనా చెడు ఎక్కినంత త్వరగా, సులువుగా మంచి ఎక్కదు… అది సత్యం. అలాంటిది … అసలు మంచి అన్నదే లేకుండా ఉంటే … ఇంక పరిస్థితి ఎలా వుంటుంది మేడమ్? ఆలోచించండి …"

"ఇది మరీ బాగుంది …. ఇది మా ప్రొఫెషన్" అతను చెప్పేమాటల్లో వున్న నిజాన్ని కాదనలేని ఆమె తెలివిగా విషయం దాటవేయబోయింది.

అన్ని ప్రొఫెషన్‌ల లాంటిదే సినిమా కూడా అనుకుంటే, సినిమాలు మొదలైన నాటినుంచీ వున్న నటీనటులకు గుర్తింపు లేదా? కేవలం నటనతో వాళ్ళు ఖ్యాతి, ధనం ఆర్జించలేదా? ఈనాటికీ వాళ్ళ స్థానాలు పదిలంగా లేవా, గ్లామరు పేరుతో విచ్చల విడితనాన్ని, డాన్సుల పేరుతో అంగాంగ విన్యాసాలనీ, కథకు ఏమాత్రం సంబంధంలేని విధంగా కట్టుబొట్టునీ, హీరోయిజం పేరిట హింసాత్మకమైన ఫైట్స్, ఇంక ప్రకటనలయితే పూర్తిగా అర్ధరహితంగా, షేవింగ్ క్రీమ్స్, బికినీలతో అమ్మాయి బొమ్మలకి ఏమిటి సంబంధం? పెర్ఫ్యూమ్స్, అర్ధనగ్న ఆడపిల్లల ఫోజులకీ ఏమిటి సంబంధం? గ్లామర్ ప్రపంచం మీది మోజుతోనో, లేకపోతే, ఈజీమనీ

మీద క్రేజుతోనో తమ విలువలని తామే దిగజార్చుకుని వలువలని, విలువలని గాలికొదిలేసి ధనార్జనే పరమావధిగా సాగిపోతున్న నేటి, వేటి వారికి అనిపించడంలేదా సభ్యసమాజం మీద ఆ ప్రభావం పడుతుందని, తద్వారా మన సంస్కృతీ, సంప్రదాయాల ప్రాభవం భూస్థాపితం అవుతోందని...

ప్లీజ్ .... మీకొక్కరికే అంతశక్తి వుంది.... అసభ్యకరమైన వస్త్రధారణ, సన్నివేశాలు, ద్వంద్వార్థ డైలాగ్స్ , వెకిలిహాస్యం వున్నవాటిలో మేము నటించము .... అని మీరంతా ఒక్కమాట మీద ...ఒక్కతాటి మీద నిలబడిననాడు ...ఖచ్చితంగా మనసమాజంలో మంచిమార్పు వచ్చి తీరుతుంది. అప్పుడు .... అదుపు తప్పుతున్న ఈ మృగాల ఆలోచన, ప్రవర్తనలూ చక్కబడే అవకాశం ఉందనే చిరు ఆశ ..... మిమ్మల్ని యిలా అడిగిస్తోంది... మేడం... అడిగిస్తోంది...

నా చిన్నారి చెల్లి అవంతి .... తిరిగిరాకపోయినా ... దానికి న్యాయం జరగకపోయినా, కనీసం ఇంక ఏ చిన్నారికీ అలాంటి దుర్దశ పట్టకూడదనే మిమ్మల్ని ఇంత ప్రాధేయపడటానికి కారణం...." అంతవరకూ ఎంతో ఆవేశంతో పలికిన అతని గొంతు దు:ఖంతో జీరబోయింది ఆ చివరి మాటలకి.

అతని ఆవేశాన్ని చూస్తూ, ఆ మాటలలో నిజాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్న రంజని ఒక్కమాటుగా ఉలిక్కిపడింది చివరిమాటలతో, ప్రాణప్రదమైన చెల్లెలిని కోల్పోయిన అతని వేదన అర్థమయి ఆర్ద్రమైంది ఆమె మనసు.

"చూడండి మీరు చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం. నేటి మన సమాజ దుస్థితికి దిగ జారిపోయిన నైతిక విలువలే కారణం. దానిలో మేమూ ప్రధాన భూమిక వహిస్తున్నదీ నిజమే కావచ్చు. కానీ ఏ ఒక్కరో మారడం వలన అలాంటి పాత్రలో, ప్రకటనలో చెయ్యకపోవడం వలన పెద్దగా మార్పు వుండదు, నేను కాకపోతే ఇంకొకరు, ఆ ఇంకొకరు కాకపోతే మరొకరు. నా వంతుగా నేను యిక అలాంటి వాటిలో నటించను.అంతేకాదు. సాధ్యమైనంతవరకూ సాధ్యమైనంత మందిని మార్చడానికే ప్రయత్నిస్తా. అసలు ఈ థీమ్‌తో నేనే ఒక ఫిలిం తీస్తా ఇంతవరకూ సంపాదనే ధ్యేయంగా బ్రతికిన నాకు , మీరిచ్చిన స్ఫూర్తితో కుళ్ళిపోతున్న ఈ సమాజాన్ని రక్షించడానికి నావంతు కృషి నేను చేస్తాను. ఇలాంటి ఆపదల



నుంచి ఆత్మరక్షణ చేసుకునేందుకు అవసరమైన శిక్షణ తరగతులు, మెలుకువలు నేర్పిస్తూ నేను ఒక సి.డి రిలీజ్ చేస్తాను...సాధ్యమైనంత ప్రచారం చేస్తాను...ఐమీన్ ఇట్,. ఐ ప్రామిస్ .." ఉద్వేగంగా అంది రంజని.

"థాంక్యూ మేడం, థాంక్స్ ఎలాట్, మీ వంటివారు మనస్ఫూర్తిగా తలుచుకుంటే ఖచ్చితంగా సాధించగలరు. నేను మిమ్మల్ని ఏమైనా బాధపెట్టి వుంటే, క్షమించండి.. అలాగే మరొకందుకు కూడా మీరు నన్ను క్షమించండి .నేను ...నేను.."

"మీరు' నేటిభారతం' వార్తాపత్రికలో జర్నలిస్ట్, మిమ్మల్ని ఎక్కడ చూసానా అని మీరు వచ్చినప్పటి నుండీ ఆలోచిస్తున్నా. ఇందాకా మీరు అవంతి సంఘటన చెప్పాకా గుర్తుకొచ్చింది . అప్పుడు ఆ సంఘటన గురించి, దోషులని పట్టుకోవడం, ఆధారాలు లేవని వదిలెయ్యడం, అదంతా రెగ్యులర్గా ఫాలో అయ్యేదాన్ని. అప్పుడే మీ ఫోటో , మీ పేరు చూసా. మీరు ఎంతకష్టపడి దోషులను పట్టుకున్నా, ఆ దౌర్భాగ్యులు రాజకీయం చేసి తప్పించుకున్నారు ... ప్చ్ ఏమిటో ఈ దేశం. కానీ .మీరెందుకు మీ విషయాలు చెప్పలేదు? అదీ నిజమేలెండి. మీరు జర్నలిస్టుగా వచ్చివుంటే, అసలు ఇంతసేపు ఇక్కడ వుండరు... నాకు ఈ మేలుకొలుపూ వుండేది కాదు...... గుడ్లక్ .... అప్పుడప్పుడు వస్తూ ఉండండి".

"మీ మంచి మనసుకి, ఔన్నత్యానికి జోహారు, మీ సంకల్పం సిద్ధించాలనీ, మనకూ, మనసమాజానికీ మంచిరోజులు రావాలనీ మనసారా ఆకాంక్షిస్తూ, సెలవామరి? నమస్తే..." చేతులు జోడించి లేచివెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు ప్రణీత్ .


తనలో కలిగిన ఈ మేలుకొలుపు తప్పక ఈ సమాజంలో అందరికి కలగాలని, త్వరలోనే చక్కటి, ఆరోగ్యవంతమైన సమాజం మనందరకీ లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, కార్యాచరణ ఎలాగా? అనే ఆలోచనలో పడింది శ్రీరంజని.

ప్రఖ్యాత సినీతార శ్రీరంజని ప్రెస్‌మీట్ అరెంజ్ చేసిందని తెలిసిన వెంటనే సినీపరిశ్రమ గగ్గోలెత్తి పోయింది. కారణం ఏమిటి?.. వివాహం చేసుకోబోతోందని కొందరూ, లేదులేదు ప్రఖ్యాత నటుడితో వున్న అఫైర్ చెప్పడానికని కొందరూ, అదేం కాదు తను నంబర్ ఒన్గా వుందని ఏడుస్తున్న కొందరి

## కవిత

# హెచ్చరిక

- మొయిద శ్రీనివాసరావు
9908256267



అంతవరకు ...
కరవాకపై కూర్చొని
పొడిబారిన మనసుటిసకపై
తడితడి జ్ఞాపకాల చేపలను
దళారి కాకుల నోటికి చిక్కకుండా
ఎండబెట్టిన ముసల్ది
ఎత్తిన చేతితో నెత్తిన బుట్ట పట్టుకొని
గుడిసె వైపుకు వడివడిగా అడుగులేస్తుంది.
ఆటుపోటుల జీవనయానంలో
అప్పుల సొర నోటికి చిక్కి
చిరిగిన 'ఇరగల' వలను
'నూలు కర్ర' తో సరిచేసిన ముసలాడు
వలను భుజంపై వేసుకొని
వేటకు బయలుదేరాడు.
నడిసంద్రంలో నడిచిన బతుకు పడవ
అవసరాల అలల ఒడిలో తూలుతూ
బొక్క బోర్లా పడటానికి సిద్ధమవుతుంటే
నడివయసు వారు నలుగురూ ఒక్కటై
తెడ్లు సాయంతో పడవను
ఒడుపుగా ఒడ్డుకు చేర్చే పనిలో వున్నారు.
రోజు రోజుకు తీరం దూరమవుతూ
ఊరు ఊరంతా బతుకు తెరువుకు
వలస చేపల్లా పట్టణానికి కదిలిపోతుంటే
ఆశ చావక
ఆకలి తట్టలను చేతపట్టుకొని
నాలుగు పరిగిల్లకై నిల్చున్నారు
పోలమ్మ, సామాలమ్మ .
ఉరకలెత్తే గుర్రమై
ఎంతగా విదిలించి కొడుతున్నా
కెరటపు కళ్లాన్ని చేతబట్టి
సముద్రాన్ని స్వారీ చేయాలనీ
చూస్తున్నాడో పిల్లాడు.
అక్కడెక్కడో గాలిలో లీలగా
అణువంత....
తుపాను హెచ్చరిక వినబడుతుంటే
వారంతా పనిలో పడినా . . .
ఓ కంట కనిపెడుతునే వున్నారు
ఏ క్షణంలోనైనా . . .
తుపాను తీరం దాటవచ్చు
ఎదుర్కోడానికి సామూహికంగా
మనమూ సిద్ధం కావాలి ! !

❋

సహతారలని దుమ్మెత్తి పోయడానికని ఇంకొందరూ ఎవరికితోచిన విధంగా వాళ్ళు ఎడాపెడా రాసేసుకున్నారు ఈ లోగానే. ప్రెస్‌మీట్ ఆమె ఇంట్లోనే. తన కుటుంబ సభ్యులకి కూడా కారణం తెలియక, ఎక్కడ ఆమె సినిమాలు చెయ్యడం మానేస్తుందో.... తద్వారా వచ్చే ఆమె సంపాదనా, విలాసాలు తమకి ఎక్కడ కరువైపోతాయో అన్న ఆందోళన వాళ్ళలో కూడా కనిపించిందామెకు...

అందరి ముందూ తన అభిప్రాయం– అదే, ఏమాత్రం అశ్లీలం, అసభ్యత, వెకిలితనం లేని సెలక్టెడ్ సినిమాలు మాత్రమే చెయ్యబోతున్నాననీ, అర్థంపర్థం లేని యాడ్స్, ఆడతనాన్ని అంగడిసరుకు చేసేవి, అగౌరవపరచేవి చెయ్యబోననీ, తమ ప్రభావం సమజంలో అందరి మీదా కాకున్నా, చాలామంది మీద ముఖ్యంగా యువత మీద వుంటోందన్న సత్యాన్నిగ్రహించి ఈ నిర్ణయం తీసుకున్నాననీ .... పరిశ్రమలో మిగతా వారుకూడా ఈ పరంగా ఆలోచించి సమాజశ్రేయస్సు కోరి మంచిని మాత్రమే పంచడానికీ, పెంచడానికి ముందుకు రావలసినదనీ, తనలో ఈ కనువిప్పు కలిగించిన ఒక అజ్ఞాతవ్యక్తికి తను ఆజన్మాంతం రుణపడి వుంటాననీ చెప్పిన ఆమె మాటలకు, అక్కడే వున్న ప్రణీత్ ఆనందానికి అవధులులేవు.

"మేడం, టాప్పొజిషన్లో వున్న మీరు ఇలాంటినిర్ణయం తీసుకోవడం వలన మీకెరీర్ నష్టపోరా? రేసులో వెనకబడి పోరా?" అన్న ఒకవిలేఖరి ప్రశ్నకు....

"లేదు. వెనకబడటం., దూసుకెళ్ళడం పక్కన పెడితే.. ఇకనుంచి అసలైన నటనతో నా అభిమానులనీ, సగటు ప్రేక్షకులనీ మెప్పించడానికి కృషిచేస్తా... మరో సావిత్రినో, జముననో కాలేకపోయినా, అవడానికి ప్రయత్నిస్తా, అలాగే నేటియువతకి నేచెప్పే ఒకే ఒకమాట. మన సంస్కృతికి, సౌశీల్యానికీ మచ్చతెచ్చే విధంగా నడచుకోకండి. ఏ రంగంలో అయినా కానీయండి..మీ మీ శక్తిసామర్థ్యాలతో ,ప్రతిభతో ముందుకెళ్ళండి... అలాగే మీ సహవిద్యార్థినులతో... సహోద్యోగినులతో ... ఎవరితో ఐనా...స్త్రీలను సాటిమనిషిగా అర్థం చేసుకుని గౌరవించండి... అంతేకాని వాళ్ళ జీవితాలతో ఆడుకుని...మీ విలువలు మీరే తగ్గించుకోకండి. మేలుకోండి..... సుసంపన్నమైన సమాజాన్ని ఏలుకోండి.... సెలవ్.... నమస్తే.... "

రంజని ఇచ్చిన ఇంటర్వ్యూ , ఆమె ఆవేదనా యువతలో నిద్రాణమై వున్న సామాజిక స్పృహను జాగృతం చేయగలిగితే.... మేలుకొలపగలిగితే సమాజానికి ఎంతైనా మేలు కలుగుతుందనేది అక్షర సత్యం.

❋

## కవిత

# జైలు

డా॥ ఎన్. గోపి



నిద్రకు
బయటా లోపలా అంటూ వుండదు
మెలుకువే ఒక బంధిఖానా,
కిరణాలు కొంచెం కొంచెం
ప్రపంచాన్ని మోసుకొస్తాయి,
అది చాలదు
అపారమైన నిశ్శబ్ద తిమిరంలో
అక్కడక్కడా ఒంటరి శబ్దాలు రాలుతుంటాయి
అతని ఊపిరే ప్రశ్నలకు జవాబు చెప్తున్నట్టుంది
అతని కనుబొమలు
చూపుల్ని ఎక్కుపెడతాయి
అవి గోడలను చీల్చుకొని
బయటకి వెళ్ళక తప్పదు.
కుటుంబం గుర్తుకు రాదు
ప్రియురాలి వాగ్దానాలూ గుర్తుకు రావు
అంగుష్ఠ మాత్రులైన
వ్యక్తులపై బుస కొట్టదు.
ఒక విరాట్ వ్యవస్థను
ధిక్కరించడమంటే అర్థం
అతనికి మాత్రమే తెలుసు!
దర్శనం అనేది చిన్నమాట
తృణీకరించినవాడి నిఘంటువులో
ఘనీభవించడం ఉండదు
ధిక్కారమే
అతడు లోకానికి చేసే ఉపకారం,
కటకటాల్లోంచి చూస్తే
లోకమే బయట బంధీ అయినట్టు
దాన్ని విడిపించడమే
అతని ధ్యేయమైనట్టు
ఇట్లాంటి మహానుభావులు
పరిచిన మంచాలపైనే
భద్రంగా
నిద్రపోతున్నాం మనం. ❋

# ఒక సాయంత్రం నీడలోకి........

- బి. కళాగోపాల్
9441631029



ఒక పుస్తకం తెరిచాను.
అనంత అక్షరశక్తి ఏదో నా నరనరంలోకి ప్రవహిస్తున్నట్లు
ఒక రసోద్వేగ ఉన్మీలన చర్య ఏదో మెదడు పొరల్లో..
జ్ఞాపకాల సంపుటిగా ఆవిష్కృతమయ్యే పరిశోధక హేల!
ఒక ప్రాచీన చిత్తరువును అదే పనిగా గమనిస్తున్నాను.
కన్నుల ఆనకట్టల్లో ప్రతిఫలిస్తున్న రంగుల మిలమిలలు!
ఊహల కాన్వాస్ పై కలలకుంచె గుమ్మరిస్తున్న
ఆలోచనల జలతారు పొరలు!
ఒక ఊదాపూల దారెమ్మట ఉరకలెత్తే వాగు నీటి గలగలలు!
పశ్చిమాకాశాన అరుణిమలో ప్రకాశిస్తున్న
ఒంటరి నక్షత్రం నీడలో...నావికుడొకడు పాడుకుంటున్న
తాత్విక గీతంలో మార్మికతను శోధిస్తున్న నామనోగగనసీమ!
కొండగాలి శిఖరపు అంచున,
రాలుతున్న ఆకుల సవ్వడిలో ఎక్కడో ఒక చిగురింత
పులకరించి, తన తొలకరిజల్లులను నా దోసిలిలో
ప్రతిబింబాలై గుమ్మరించింది!
ఒక సంజెవెలుగు దీపపుఛాయలో
స్వచ్ఛ మంద్రగాలి కుశల ప్రశ్నలు వేస్తూ,
నా మేనంతా అలా నిమిరి వెళ్లిపోయింది!
కొన్ని సాయంత్రాలపూట ఒక దృశ్యమేదో ...
అలా రంగుల వర్ణపటంలో రాలిపడ్డ పూలరేకుల పుప్పొడిలా
..
జీవనాన్ని సారవంతం చేసి వెళ్తుంది!
మౌనంగా గమనిస్తూ సాగుతున్న అడవి దారెమ్మట అవి
తమ ప్రాచీన ప్రాకృతిక సంగీతాన్నేదో విన్పిస్తుంటాయి!
ఊహల నదిలో అరవెన్నెల ఆకాశం!
కొన్ని అలలు – కొంత నురగ!
ఒడ్డున కట్టిన పిట్టగూడును చేరుకోలేక వెనక్కి మళ్లుతుంటాయి!
కొన్ని ఆలోచనలు – ఒక ఊహ అంతే!
లాంతరు నీడన నైరూప్యచ్ఛాయ చిత్రాల శకలాల్లోకి
వంగిపోతూ,
అటువైపు వత్తిగిల్లి పడుకుంటాను!
ఊగుతున్న కలల యాత్రా జగత్తులో ..
పునరపి ప్రయాణిస్తూ... ఒక సాయంత్రం నీడలోకి
నన్ను నేను ప్రవహింపజేసుకుంటాను !!! ❋

# కొన్ని సుందర సందర్భాలు

- అవధానుల మణిబాబు
9948179437



ఆవంత్స సోమసుందర్‌తో వ్యాస రచయిత అవధానుల మణిబాబు

***సో**మసుందర్ గారిని మొదటిసారి కలిసినపుడు, కాసేపు పలకరింపులయ్యాక, "మీ రచనలేమైనా వినిపించండి" అన్నారు, సౌమ్యంగా. కూర్చున్న చోటునుండి వారికి కాస్త దగ్గరగా జరిగానేగానీ ఎందుకో చాలాసేపు మౌనంగానే ఉండిపోయాను. తొంభై ఏళ్ల కవితో సాహిత్యం గురించి మాట్లాడడం నాకు ఊహకు అందని విషయం, కొంచెం భయంగా ఉంది సార్, అన్నాను నెమ్మదిగా. "ముప్పైఏళ్ళ వాడితో సాహిత్యం గురించి మాట్లాడి నాకూ చాలాకాలమైంది, నేనేమైనా భయపడుతున్నానా? మరేం ఫర్వాలేదులెండి" అన్నారు చమత్కారంగా. అలా మొదలైన పరిచయం నెలకోసారి, రెండుసార్లు, చివరకు వారానికోసారైనా కలవడమైంది. నాలుగేళ్ళలో ఓ నలభైగంటల సంభాషణ ఇపుడు మీతో ఈ నాలుగుమాటలూ పంచుకోడానికి అవకాశమిచ్చింది.*

వెళ్ళగానే చేయందుకుని, కళ్ళువిప్పార్చి ముఖంలోకి చూసి కొండంత ఆనందాన్ని ప్రకటిస్తూ, "వచ్చారా!" అనేవారు ప్రతిసారీ. గత వారానికి, ఈ వారానికి మనలో మనం గమనించని ఏదో మార్పుచెప్పేవారు. కాస్త నల్లబడ్డారనో, చిక్కారనో, లావెక్కారనో, ముఖ్యంగా జుట్టు గురించి. నేను బైక్ పై వెళ్ళడంతో చెమటకు, హెల్మెట్ బరువుకు పిఠాపురం వెళ్ళేసరికి జుట్టు బాగా అణిగి ఉండేది. ఆయనకు జుట్టు ఎక్కువగా ఉండి విలాసంగా ఎగురుతూ ఉండడం ఇష్టం. ఓ సారి గుండు చేయించుకున్నపుడు, ఎన్ని చివాట్లో. వ్యక్తులకే కాదు పుస్తకాల విషయంలోనూ అప్పియరెన్స్ కి ఎంతో ప్రాధ్యాన్యత నిచ్చేవారు. ముఖచిత్రం, శీర్షిక నచ్చకపోతే ముఖంమీదే ఖచ్చితంగా చెప్పేసేవారు.

సాహిత్య రంగంలో వివిధ ప్రక్రియలలో బహుముఖంగా కృషిచేయాలి. కొన్నాళ్ళు గడిచాక ఏ ప్రక్రియలో మనకు పట్టులభించిందో అందులో నిరంతర అధ్యయనంతో విస్తృతంగా వ్రాయాలి. "మిగిలినవన్నీ కాకపోయినా, కవిత్వం, విమర్శ సమాంతరంగా కొనసాగించండి. అపుడు రెండూ ఒకదానివలన మరొకటి మరింత పదునుదేరతాయి. అయితే ఇవన్నీ ఎందుకోసం అనే ప్రశ్న రానివ్వకండి, సాహిత్యం ఒక నిష్కామ కర్మ" – ఇదీ వారి మార్గదర్శనంలోని ముఖ్యాంశం.

ఓ వ్యక్తిని అంచనావేసేటప్పుడు అతడి సాహిత్యం, సాహిత్య మూల్యాంకనంలో కవి తాలూకు వ్యక్తిత్వం ఆయనకు అవరోధం అయ్యేవికావు. రెండు విభాగాలనూ అమిశ్రితంగా చూడగలగడం వారి గొప్పదనం. పత్రికలలోను, ప్రత్యక్షంగానూ తనతో వాదోపవాదాలు జరిపిన వ్యక్తులకు సైతం "సోమసుందర్ పురస్కారం" అందజేసి గౌరవించారు. తనకెంతో ఆత్మీయులైన వారిని స్నేహితులుగా అభిమానించారు కానీ కవిత్వం సంతృప్తికరంగా లేకపోతే నిర్మొహ మాటంగా చెప్పేసేవారు. ఇలా పూర్వానుభవాలు దృష్టిలోకి రాకుండా, రాగ ద్వేషాల కతీతంగా సాహిత్య సమీక్షకు సిద్ధం కావడం అరుదైన, ఆదర్శప్రాయమైన, ఆవశ్యకమైన లక్షణం.

మిత్రులెవరైనా వారిని కలిసేందుకు పిఠాపురం వస్తున్నారని తెలిస్తే, అవతలి వ్యక్తి ఏ సాహిత్యప్రక్రియలో కృషి చేస్తున్నారో ఆ ప్రక్రియలో తాను వ్రాసిన పుస్తకాలన్నిటినీ వెతికి బయటకు తీయించి ఆప్యాయంగా అందజేసేవారు. అనువాద సాహిత్యంలో కృషి చేస్తున్న బొల్లోజుబాబాకు "పాబ్లో నెరుడా కవిత్వమూ– జీవితమూ", పద్య ప్రియులైన కొరుప్రోలు గౌరినాయుడుకి "చైతన్య

భారతి", కథా రచయిత గ.నా.రా.కు 'సోమసుందర్ కథలు' శుభాకాంక్షలతో సంతకం చేసి ఇవ్వడం నాకు తెలిసిన ఉదాహరణలు.

అలాగే, ఇతర ప్రాంతాలలో జరిగే సాహిత్యసభలకు మిత్రులెవరైనా వెళుతున్నామని చెబితే ఆ సభలో ప్రసంగాంశాలపై తను చేసిన రచనలుంటే ఇచ్చి, ఉపన్యాసకులకు అందజేయమనేవారు. ఇటీవల బుక్ ఫెస్టివల్ లో డా. ఆర్.ఎన్. వెంకటేశ్వరరావుగారు కృష్ణశాస్త్రిపై ప్రసంగిస్తున్నపుడు "కృష్ణ శాస్త్రి కవితాత్మ'', సాత్యకి కాకినాడ వచ్చినపుడు " శేషేంద్రజాలం" అలా ప్రత్యేకంగా పంపారు.

సాహిత్యసభలకు కేవలం వినడానికి కాకుండా, వెళ్ళేముందు ఆ సందర్భానికి సంబంధించి కొంతైనా చదివితే ప్రసంగాలను, వక్తల అభిప్రాయాలను పూర్తిగా అవగాహన చేసుకోగల సంసిద్ధత కలుగుతుందని సూచించేవారు.

వేరే పనులతో వీలుపడక తరచుగా కలిసే మిత్రులు ఓ రెండు ఆదివారాలు వెళ్ళకపోతే సోమవారం ఉదయమే ఫోన్. "ఏవండీ నిన్నంతా ఎదురుచూసాను, ఇలా మరచిపోవడమేనా" అని. ఆ పిలుపు ఎంత ఆత్మీయంగా ఉండేదంటే ఒక్కోసారి వర్కింగ్ డేస్ లో ఉదయాన్నే వెళ్ళి ఓ గంట కూర్చుని మళ్ళీ పరుగు పరుగున ఆఫీస్ కి వచ్చేవాణ్ణి, ఎందుకంటే మనరాకను అంతగా కోరుకునే మహనీయుల సాన్నిహిత్యం మళ్ళీ లభిస్తుందని ఆశించలేం. కొన్ని సౌభాగ్యాల కాలపరిమితి స్వల్పంగానే ఉంటుంది కదా!

సో.సు. లో అబ్బురపరిచే అంశాలలో వారి జ్ఞాపకశక్తి ఒకటి. మాటలమధ్యలో ఎపుడైనా కవిపేరో, పుస్తకంపేరో వారికి గుర్తురాకపోతే చాలా బాధపడేవారు. అది జ్ఞప్తికి వచ్చేవరకూ స్థిమితపడేవారు కాదు. ఈ మధ్య మెమరీ పోయిందండీ అనేవారు చాలా బాధగా. "మెమరీ పోయిందనే విషయం గుర్తుంది కదా! అంటే జ్ఞాపకశక్తి ఉన్నట్టే" అనేవాణ్ణి సరదాగా. ఇక వారి గ్రంథాలపై వ్యాసాలు వ్రాస్తున్నపుడు ముఖ్యమైనవన్నీ గుర్తుచేసుకుని చెప్పి, వాటిపై వ్రాయమన్నారు. ఆయా గ్రంథాల నేపథ్యాన్ని, సంఘటనలను, నెలలు, తేదీలు, ప్రదేశాలతో సహా చెప్పారు.

పారిస్ లో ""నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజెస్ అండ్ సివిలైజేషన్"" విశ్వ విద్యాలయం లో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న శ్రీ డేనియల్ నెజర్స్ మన జానపద కళా రూపాలపై పరిశోధన చేసారు. వారు పెద్దాపురం, యానాం ప్రాంతాలకు తరచుగా వస్తుంటారు. వీరు చక్కని తెలుగు మాట్లాడడమే కాకుండా మన పద్యాలను ఫ్రెంచిలోనికి అనువదించారు. ఓసారి వారి పర్యటనలో భాగంగా సో.సు.ని కలిసేందుకు పిఠాపురం వచ్చారు. వారిని సో.సు.కి పరిచయంచేసిన వ్యక్తి "విదేశీయుడు" అని ప్రత్యేకించి చెప్పలేదు. పదం, పదం పట్టిపట్టి విడివిడిగా మాట్లాడుతున్న వారిని "ఏవిటా మాట్లాడడం, ఫ్యాషన్ అనుకొంటున్నావా?" అని కోప్పడ్డారు సో.సు. అక్కడున్నవాళ్ళం ఆయన ఫ్రెంచ్ దేశీయులని చెప్పాం. వెంటనే, ఎటువంటి భేషజాలూ లేకుండా వారి చేతులు పట్టుకుని 'క్షమించండి తొందర పడ్డాను' అని, ప్రక్కన కూర్చోబెట్టుకొని, పరిశోధనా విషయాలు అన్నీ అడిగి తెలుసుకొన్నారు. అంత పెద్ద వ్యక్తి అలా పొరపాటును సులువుగా అంగీకరించడం అంత చిన్న విషయం కాదేమో!

సో.సు లఘుకవితా సంపుటి "చంద్రభాగ" సమీక్షలో వారి సమకాలీనులైన ఓ సుప్రసిద్ధ కవి వాక్యాన్ని వీరి కవితాపాదం గుర్తుచేస్తోందని వ్రాసాను. "మీ అభిప్రాయాన్ని తప్పుపట్టను కానీ, నేను అతడిని కవిగా అంగీకరించలేను" అన్నారు. అయ్యో, అంగీకరించక పోవడమేమిటి? తెలుగు సాహిత్యంలో వారికో ప్రత్యేక స్థానముంది, పైగా ఆయన్ని అమితంగా ఆరాధించే లక్షలాది పద్యప్రియులలో నేనూ ఒకణ్ణి అన్నాను. "ఆయన కృషి, వారికున్న ప్రసిద్ధి నేను తక్కువ చేయను, వ్యక్తిగా నాకెంతో ఆత్మీయుడు కూడా. సెలయేటిలో నడుస్తూ ఉంటే ఎన్ని గంటలైనా ఉల్లాసంగా శ్రమ తెలియకుండా గడచిపోతాయి. తీరాబయటకు వచ్చిచూస్తే ఇన్ని గంటల ప్రయాణంలోనూ పాదాలుతప్ప మోకాళ్ళుకూడా తడవలేదని తెలుస్తుంది. శరీరమంటే కేవలం పాదాలవరకే కాదు. లోతు లేని ప్రయత్నాన్ని నేను ప్రశంసించలేను. ఈ మాటలు నేరుగా వారితోనే చెప్పాను" అన్నారు. నిజానికి ఈ సంభాషణ తరువాత ఆ కవిపై నా ఆరాధన ఏమాత్రం తగ్గలేదు. కానీ, వారు చెప్పిన కారణం మాత్రం ఆలోచింపదగినదే ననిపించింది.

ఐదేళ్ళు వారికి సేవలందించిన 'మహాలక్ష్మి' వీరి చివరి

***సాహిత్యసభలకు కేవలం వినడానికి కాకుండా, వెళ్ళేముందు ఆ సందర్భానికి సంబంధించి కొంతైనా చదివితే ప్రసంగాలను, వక్తల అభిప్రాయాలను పూర్తిగా అవగాహన చేసుకోగల సంసిద్ధత కలుగుతుందని సూచించేవారు.***

**కవిత**

## అక్షర వజ్రాయుధం

**వల్లభాపురం జనార్దన**
**9440163687**



**ఆ**వంత్స సోమసుందర్
తెలంగాణా పొలానికి
అక్షర సేనాని
తెలంగాణ సాయుధ పోరాటాన్ని
అక్షరంగా మలిచి
కవితా వజ్రాయుధాన్ని
నియంతపై ప్రయోగించిన యోధుడు
అక్షర చెలిమె నుండి అభ్యుదయ
ప్రవాహాన్ని తోడిపోసిన సైనికుడు
ఆవంత్స సోమసుందర్
ఆప్యాయతా సాగరం

ఆలోచన కేదారం
అలసిపోయింది
విశ్రాంతిని కౌగిలించుకుంది
అది మరణం కాదు
భౌతిక శరీరం విడిచి
ప్రకృతి సౌందర్య ప్రపంచమయిందు
కానరాని లోకాల్లో
అభ్యుదయ పాఠాలు చెప్పడం కోసం
పయనమైపోయిండు
ఇప్పటి నుండి ఆయన రూపం మాత్రం
మన కళ్ళ ముందుండదు
ఆయన రూపుదిద్దిన అక్షర ప్రపంచం
ఎప్పటికీ మనముందుంటుంది

మనకే కాదు
మన తరువాతి తరానికి కూడా
వెన్ను తట్టుతుంటది
అప్పుడప్పుడు బుద్ధికి పట్టే
జడత్వాన్ని తొలగిస్తుంటది
మన కలాల్లో సిరాగా పాడుతుంటది
సోమసుందరా
అభ్యుదయ సాహితీలోకంలో
నీ పలకరింపు ఎప్పటికీ ఉంటది
నీ కృషికి జోహార్లు ❋

దశలో ఆమె ఆరోగ్యం బాలేక మానేసినపుడు, ఆ స్థానంలో మరో అబ్బాయి వచ్చినా ఎక్కువకాలం కొనసాగలేదు. ఆ తరువాత వచ్చిన 'నాగులు' మరలా ఆయనకు చేరువ కాగలిగాడు. అలాగే, వ్యక్తిగత సహాయకునిగా, లేఖకునిగా వ్యవహరించిన మన్మథరావు ఉద్యోగంలో చేరతానన్నపుడు వారు అడ్డుచెప్పలేదు. అయితే ఈ రెండు సందర్భాలలోనూ తన మనసెరిగి మసలుకొనే వ్యక్తులు దూరమవుతున్నారని ఆత్మీయులదగ్గర బాధపడ్డా, పైకిమాత్రం నిబ్బరంగానే ఉన్నారు. పిఠాపురంలో వారింటి పరిసరాలు, వచ్చిపోయే సాహితీ మిత్రులతో సందడిగా ఉండే వాతావరణం వారికి విడిచిపెట్టలేనంత ఇష్టం. అయినా, వైద్యం కోసం కాకినాడలో అబ్బాయి ఇంట ఉండవలసివచ్చినపుడు సానుకూలంగానే వ్యవహరించారు. ఇలా పరిస్థితులకు అనుగుణ్యత పొందడం ఆ వయసులో అందరికీ సాధ్యం కాదేమో!

ఓసారి వారి అబ్బాయి శశికాంత్, డా. సీతారామస్వామి, మన్మథరావు, నేను వారితో కూర్చుని మాట్లాడుతున్నాం. అలా అలా విషయం స్వీయ చరిత్రల వైపు మళ్ళింది. శ్రీపాద వారిది, టంగుటూరి ప్రకాశం, తిరుమల రామచంద్ర, సామల సదాశివ ....... ఇలా చాలాసేపు మాట్లాడుకున్నాక వారి స్వీయచరిత్ర వైపు చర్చ తిరిగింది. కాసేపటికి మేమంతా ఎదురుగా సో.సు. ఉన్నారనే విషయాన్ని మరిచిపోయాం. వాస్తవ సంఘటనలే అయినా, కొన్ని విషయాలను గ్రంథంలో ప్రస్తావించకుండా ఉంటే బావుండేదని నేను, శశికాంత్ లేదు అలాగే రాయాలని సీతారామస్వామి గారు కాస్త తటస్థంగా మన్మథరావు గారు ... ఇలా ఓ అరగంట గడిచింది. మా చర్చను ఆపి "సార్ ఇంతకీ మీరేమి చెప్పడం లేదే" అన్నాం. "'చర్చ మొదట్లో ప్రస్తావించిన పుస్తకాలకు నేనూ మీలాగే పాఠకుణ్ణి. అందుకే నా అభిప్రాయాల్ని పంచుకున్నాను. కానీ నా విషయానికి వచ్చేసరికి న్యాయనిర్ణయం చేసే అధికారం నాకులేదు. అయినా ఇన్ని ఏళ్ల తరువాత ఆ విషయాల గురించి మీ నలుగురు అంత లోతుగా మాట్లాడుకుంటున్నారంటే రచయితగా నేను, స్వీయచరిత్రగా నా పుస్తకం విజయవంతమయ్యాయని అర్థం. నాకది చాలు'" – ఇదీ వారి సమాధానం. ఒకనాటి సోమసుందర్ మాత్రమే పరిచయమైన వారికి, ఆయనలో ఇంతటి సంయమనం ఊహకు అందదు.

పూలు–ముళ్ళు, కలలు–కన్నీళ్ళతో జీవితాన్ని పరిపూర్ణం చేసుకున్న సో.సు. మరికొంత కాలం మనతో ఉండుంటే బావుండునేమో అనిపించడం సహజం. కానీ, ఇక ఏమీ మిగలలేదనిపించేలా, ఇక ముందెవ్వరూ రాయలేనంతగా రాసేసారు. అతిశయోక్తి కాదనుకుంటే రాయడం మాట అటుంచి చదవడానికే ఓ జీవితకాలం సరిపోనంతగా రాసేసారు. ఇదంతా పనికట్టుకుని కాదు, బ్రతుకు ఈ పనికోసమే అన్నట్లు రాసారు. సృజన కోసం వెచ్చించని క్షణాలన్నీ విషఘడియలుగానే భావించిన ఆ 'అమృత మూర్తి' తో నాకు లభించిన ఈ పరిచయ భాగ్యం నాకు జీవితకాలపు జ్ఞాపకం. ❋

## కవిత

# నివాళి


- మాల్యశ్రీ
9290070043


ఓ సోమ సుందరా !
ఓ గంధ మాదనా !
వజ్రాయుధము నెత్తి
గర్జించి నావా !
కాహళిని మ్రోగించి
కదము తొక్కావా !
ఓ సోమ సుందరా !
ఓ గంధ మాదనా !
బానిసల దేశమున
చేతమొలికావా !
అనతల్పము మీద
అధివసింశావా !



* గంధమాదనం సోమసుందర్
వచన కవితా కావ్యంలో ఒకటి

ఓ సోమ సుందరా !
ఓ గంధ మాదనా !
రక్కాక్షి నిగిదించి
రణము చేశావా !
ఆమ్రపర్ణీయందు
విశ్రమించావా !
ఓ సోమ సుందరా !
ఓ గంధమాదనా !
అభ్యుదయ సాహితీ
తిలకమైనావా !
ప్రగతి కవి భానుడై

ప్రజ్వరిల్లావా !
ఓ సోమ సుందరా !
ఓ గంధ మాదనా !
సమత నవతల కొరకు
సాగిపోయావా !
కురువృద్ధుడై అంప
శయ్యనొదిగావా !
ఓ సోమ సుందరా !
ఓ గంధమాదనా !

❋

## పాట

# అణుఉద్యమం


దుప్పాడ రామకృష్ణ నాయుడు,
8790408525


కొవ్వాడకు అణుభూతం పంపొద్దు
ఉత్తరాంధ్రను అనుక్షణం చంపొద్దు
ఈ గాలిలోన అణువిషం నింపొద్దు
ఈ నేలతో మా అనుబంధం తెంపొద్దు
రైతన్నల బ్రతుకులలో వెతలెన్నో కల్పిస్తూ
కష్టజీవుల కళ్ళల్లో కన్నీళ్ళు పెట్టిస్తూ
పచ్చనైన పల్లెల్లో కార్చిచ్చు రగిలిస్తూ
మా ప్రజలందరి గుండెలపై ఆరు అణుప్లాంట్లా!
అమెరికా జపాన్‌లకు లక్షల కోట్లు గ్రాంట్లా! ॥కొవ్వాడకు॥

భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో అమెరికాను నిలదీశామా?
చెర్నోబిల్ ఫుకుషిమాల అనుభవాలనపుడే మరిచామా
అట్టి ప్రమాదాలెదురైతే తట్టుకునే స్థాయికెదిగామా?
కాలుష్య పరిశ్రమలన్నిటికీ ఉత్తరాంధ్రపైనే ఎందుకు గురి?
పెద్దవాళ్ళ లాభాలకు మా చిన్నవాళ్ళకెందుకు ఉరి?
॥కొవ్వాడకు॥

ప్రకృతి ఒడిలో పాపలం సంద్రంలో చిన్నారిచేపలం
అణు ప్లాంటులో మీరిచ్చే ఆ కొలువులు మాకొద్దు
అణు గేలాలేసి మా ప్రాణాలు తీయొద్దు
స్వచ్ఛభారతంటూ చీపుర్లు పట్టుకొని నినాదాలా!
అణుధూళితో భారతావనికి అనునిత్యం ప్రమాదాలా!
॥కొవ్వాడకు॥


కేంద్రంలో పెద్దన్నా ! రాష్ట్రంలో చిన్నన్నా!
సాంప్రదాయ వనరులెన్నో సమృద్ధిగ మనకుండగ
ఖరీదయిన అణువిద్యుత్ మనకెందుకు దండగ
అగ్రరాజ్య చెలిమికై ఆరాటం ఎందుకు?
స్వంత ప్రజల కష్టాలు పట్టవు మీకెందుకు? ॥కొవ్వాడకు॥

పంటలేసుకుందామంటే బ్యాంకు వాళ్ళివ్వరు
భూములమ్ముకుందమంటే మీరెవ్వరినీ కొననివ్వరు
అన్యాయమని అంటే అక్రమ నిర్బంధాలు అబద్ధపుకేసులా?
మిమ్ము గెలిపించినందుకు ఇదా మాకు బహుమతి
అడ్డుకొని తీరుతాం అణుప్లాంటుల దిగుమతి ॥కొవ్వాడకు॥

బాధలెన్ని పెట్టినా మా ఫూళ్ళను వదిలెల్లం
ప్రలోభాలకాశపడి మా భూములు మీకివ్వం
ప్రజలలో చైతన్యం కలిగిస్తాం
ప్రజలందరి మద్దత్తు సాధిస్తాం
ఇది అంతం కాదు సుమా ఆరంభం మాత్రమే
॥కొవ్వాడకు॥
మా బతుకుల కోసమై చేసే ఈ యుద్ధంలో
వెనుకడుగే వెయ్యము లేదేమాత్రం మాకుభయం
అవాంతరాలెదురైనా అడ్డం ఎవరొచ్చినా
ఆగదు మా ఉద్యమం
మాదే అంతిమ విజయం
॥కొవ్వాడకు॥

❋

విశ్లేషణ



# తెలుగు భాష : జాషువా మక్కువ

- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
9440222117

*జాషువా తన కవిత్వంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటారు. తెలుగు భాష దుర్గతికి చింతించారు. ఈ రెండు పనులూ ఆయన తెలుగు భాషమీద మక్కువతోనే చేశారు. 1930 నుండి 1957 దాకా ఆయన వివిధ సందర్భాలలో తెలుగు భాషకి చికిత్స చేశారు. జాషువా తెలుగు తనం ఉట్టిపడే కవి. 'మాది కలికి తెలుగు కులము' అని గర్వంగా చాటుకున్నారు.*

*...యే భాషకున్ లేనియొ*
*య్యారంబున్ గులుకున్న దల్గలవు సత్యంబాంధ్ర వాగ్దేవికిన్*
(వ్యాప్తి - ఖండకావ్యము - 3 : పుట 607)

ఏ భాషా రచయితకైనా ఆ భాషా ప్రజల జీవితం పట్లనే గాక, ఆ ప్రజల భాష పట్ల కూడా ఈ మాత్రం మక్కువ అభిజాత్యం ఉంటాయి. సృజనశీలురు గనక కొంత భావవాదులుగా కూడా మాట్లాడతారు సహజంగానే. గుర్రం జాషువ అచ్చమైన తెలుగు కవి. చుట్టూరా ఇంకే భాషా ప్రభావమూ పడని గుంటూరు జిల్లావాసి. ఆయనకు తన మాతృభాష పట్ల ఈ మాత్రం మక్కువ ఉండడం సమర్థనీయమే. రచయితకూ కళాకారులకూ ఆ మాటకొస్తే మేధావులూ, సామాన్యులకు సైతం తమ మాతృభాషపైన ప్రేమ ఉంటుంది. వాళ్ళు ఇతర భాషలు ఎన్ని నేర్చుకున్నా తమ మాతృభాషను తక్కువ చూపు చూడరు. మాతృభాషను ద్వేషించేవాళ్ళ శాతం తక్కువే. అయినా వాళ్ళు చాలా ప్రమాదకారులు, వాళ్ళు తాము చెడిపోవడమేగాక, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా చెడగొడతారు. మాతృభాషల్ని చులకన జేసి పరాయిభాషల్ని కౌగిలించుకుంటారు. ఏ భాషనూ, తక్కువ చెయ్యక్కర్లేదు. మాతృభాషను అసలు తక్కువ చెయ్యరాదు. ఇది కనీసమైన నాగరికత, బాధ్యత.

జాషువా తన కవిత్వంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటారు. తెలుగు భాష దుర్గతికి చింతించారు. ఈ రెండు పనులూ ఆయన తెలుగు భాషమీద మక్కువతోనే చేశారు. 1930 నుండి 1957 దాకా ఆయన వివిధ సందర్భాలలో తెలుగు భాషకి చికిత్స చేశారు. జాషువా తెలుగు తనం ఉట్టిపడే కవి. 'మాది కలికి తెలుగు కులము' అని గర్వంగా చాటుకున్నారు. మా పిల్లలకు ఇంగ్లీషు వస్తే చాలు, తెలుగు ఉంటే మాకేమి, ఊడితే మాకేమి అనడానికి సాహసించే తల్లిదండ్రులు జాషువా మహాకవి మాటలు చదవాలి. తెలుగు భాషను తూలనాడే మేధావులు కూడా జాషువా మాటలు చదవాలి.

1930లో "దీర్ఘ విశ్వాసము" కవితలో జాషువా "తెలుగు భాషకు వన్నెతెచ్చిన జగదీశ్వరుడు (ఖండ కావ్యము- 1 పుట 497) అని శ్రీకృష్ణ దేవరాయల్ని కీర్తించారు. ఇలా అన్నంత మాత్రాన జాషువా విజయనగర రాజుల కాలంనాటి రాచరిక వర్ణ వ్యవస్థను కూడా ఆహ్వానించినట్లు కాదు. జాషువా పోరాటమే వాటిపైన. అయితే భాషా పోషకుడిగా రాయల్ని ఆయన గౌరవించారు. అలాగే ఇవాళ మనం అధికులం మనువాద కవిగా నిర్వచించే నన్నయ్యను జాషువా ఇలా కొనియాడారు.

*తెలుగునుదికారమున్ నమృతీకరించి*

*భారతామ్నాయ జీవములనూది*
*తేజములు డిగిన స్వీయ జాతీయ రక్త*
*నాళములు పుల్కరింపగానంబుజేసె*

(శబ్ద శాసనుడు, ఖండకావ్యము – 1 : పుట 527)

ఈ పద్యం 1935 నాటిది. అప్పటికి నన్నయ్య మీద ఇప్పుడున్నంత విమర్శ లేదు. ఆయనను ఆదికవిగా అందరూ ఆమోదించారు. ఆయన భారతాన్ని ఆది కావ్యంగా గుర్తించారు. నన్నయ్య తెలుగును తన సంస్కృతం ద్వారా కాంతిహీనం చేశారనే వాళ్ళు తర్వాత వచ్చారు. తెలుగు కవిత్వ భాషను నన్నయ్య సంస్కరించడంలో చాలా కృషి చేశారని కూడా జాషువా అభిప్రాయపడ్డారు.

*"శబ్ద సాధుత్వంబు సాధింపభ్రష్ట వాఙ్మయ*
*మహాటవినెంత నవసినాడో"*

(పైడి : పుట 526)

ఇలా అన్నంతమాత్రాన జాషువా నన్నయ్య కీర్తించిన వర్ణ వ్యవస్థను ఆమోదించినట్లు కాదు. జాషువాకు 1926 నాటికే కుల వ్యవస్థపైన విమర్శనాత్మక దృష్టి ఉంది. 'శివాజి' కావ్యంలో ఇది గమనించవచ్చు. జాషువా యుద్ధమే మనువాదం మీదనన్న నిజాన్ని మరచిపోరాదు.

తెలుగు భాష విషయంలో నన్నయ్య కృషిని మాత్రమే జాషువా ఇక్కడ ప్రస్తావించారు. ఈ మార్గంలోనే జాషువా తిక్కన్నను కూడా ప్రస్తుతించారు.

*తెనుగు భాషా పద్మమునకు జాఱని వన్నె*
*పట్టించినది కవి బ్రహ్మ పలుకు*

(పైడి : పుట 527)

*'తిక్కయజ్వ' కవితలో*
*తెనుగు భాషా లోకమును శిరస్సున బూని*
*సడిసన్న కుండలీంద్రుడవునీవు*
*..................*
*దేవభాషకు రవ్వంత తీసిపోని*
*సభ్యతా స్ఫూర్తి తెలుగు భాషకును గూర్చి*
*గణనకెక్కిన మాతృభక్తుడవునీవు*
*ధ్యేయుడవు మాకు చక్కని తిక్కమంతి*

(ఖండ కావ్యము – 3 : పుట 602)

తెలుగు తనానికి తిక్కనను మారుపేరుగా విమర్శకులు గుర్తించారు. తెలుగుతనం అంటే తెలుగు భాషాతనం అని అర్థం. శ్రీశ్రీ తన కవిత్రయంలో తిక్కనను చేర్చడానికి కారణం తిక్కన తెలుగు భాషకు భారతంలో పెద్ద పీట వెయ్యడమే. తిక్కన తన కాలంనాటి ప్రజల వ్యవహారంలో ఉండే పదాలను కవిత్వంలో ఉపయోగించి ప్రజల భాషకు సాహిత్య గౌరవం కల్పించడం ఒక పార్శ్వం. సంస్కృత పదాలకు చాలా వాటికి తిక్కన వ్యవహారంలో ఉన్నవో లేనివో తెలుగు పదాలు కల్పించడం మరో ఎత్తు. అందుకే 'తిక్కన్న శిల్పం పూదెనుగు తోట' అని విశ్వనాథ కొనియాడారు. రాచమర్యాద పొందుతూ ఉండిన సంస్కృత భాషకు తీసిపోనంత గౌరవం తెలుగు భాషకు తిక్కన తెచ్చాడన్న జాషువ మదింపు అనాలోచితం కాదు. వెర్రి ఆవేశమూ కాదు. ఇవాళ ఆంగ్ల పదాలకు మన పత్రికలు తెలుగు పదాలను సృష్టిస్తున్నట్లుగా అప్పట్లో తిక్కన సంస్కృత పదాలకు తెలుగు పదాలు కల్పించాడు. జాషువా దీనిని గుర్తించారు.

జాషువ తెలుగు భాషాభిమానం ఎంతటిదంటే "పిరదౌసి' కావ్యంలో ఆయనొక కల్పన చేశారు. గజనీయ మహ్మద్ పిరదౌసిని తన పూర్వీకుల చరిత్రను, తన యుద్ధ చరిత్రనూ అన్వయించి ఒక కావ్యం రాయమని కోరాడు. పిరదౌసి పారశీక కవి. ఆయనకు తెలుగు భాషతో సంబంధం లేదు. కాని పిరదౌసి షానామా రాయడానికి అనేక భాషల సాహిత్యాలు పరిశోధించారని, అందులో తెలుగు భాషను కూడా కలిపారు.

*తెలుగు కవిత్వ పుంజిగి విదేశపు కైతల చెన్ను...*
*పొసగన్ రచియించుచుండె గేవల రసబంధురం బగు ప్రబంధము*

(పిరదౌసి : పుట 424)

నిజానికి ఇది మోకాలికి బట్టతలకు ముడిపెట్టడమే. కాని ఆయన తెలుగు భాషాభిమానమే ఈ పని చేయించింది. తాజ్ మహల్ నిర్మాణంలో మచిలీపట్నం నుంచి ముగ్గురు శిల్పులు పాల్గొన్నారన్న నిజాన్ని జాషువా వెలికి తీసి కవిత్వీకరించారు. అది ఆయన అభిమానం.

*"తెనుగు గవలికలు లేని దేశము గలదే"*

(ఖండకావ్యం – 3 : పుట 607)

అని ఉప్పొంగుతూనే జాషువా ఆధునిక కాలంలో తెలుగు భాషకు చెడ్డ రోజులు రావటం పట్ల చాలా చింతించారు. ఇవాళ మనం ఆంగ్లభాష ప్రపంచీకరణ ద్వారా తెలుగు భాషను చంపేస్తున్నదని లబోదిబోమంటున్నాం. జాషువా 1931లోనే నెత్తి నోరు బాదుకున్నారు 'సమదృష్టి' కవితలో...

*"........... దేశభా*

*షలు విలపించుచున్నవి విజాత్యభిమానము చెంగలించె"*

(ఖండకావ్యము-1 : పుట 517)

అంటూ తన బిడ్డలను సంస్కరించమని భారతమాతను మొరపెట్టుకున్నారు. మనలాంటి చాదస్తం ఆయనకు తొంభై అయిదేళ్ళ క్రితమే ఉండింది. ఆయన మనకన్నా ముందు మేల్కొన్న వైతాళికుడందామా? మనకన్నా ముందే బాధపడిన చాదస్తుడందామా?

1936లో 'ప్రబోధము కవితలో కూడా జాషువ తెలుగు భాష దుర్దశను తలచుకొని బాధపడ్డారు. అవి స్వాతంత్ర్యోద్యమ రోజులు గనక ఆయన ఆ భాషలో విలపించారు. తెలుగు వారి అనుకరణ బుద్ధిని దెప్పి పొడిచారు.

*అనుకరణంబునందు దెలుగయ్యలు నమ్మలు దొడ్డవారు, కా*
*వున నివసింపసాగిన విపో పెదవారి పసందుపోకడలో,*
*తెనుగుదనంబు రాట్నమున దీసెడు దారముతోడ మూల్గసా*
*గినది. పురాతనాంగనల గేయములన్ శ్రుతిగల్పి పాడుచున్*

(ఖండకావ్యము - 2 : పుట 583)

*ఓ కాఫీతపసీ! తెనుంగునకు వాయుఃప్రాణముల్ గుంగి ది*
*దీనిన్ గల్గును చోటు లేదనుచు వాదింప బ్రయత్నింతువా*
*ఆకర్షించు విదేశవాసనల నిల్లైయున్న నీయింటి యం*
*దీ కాసంతలు రాష్ట్ర భాషలకు లేవే? తావులూహింపగన్*

(పైడి)

వలస పాలకుల ప్రభావం తెలుగువారి మౌలికతపై దాడిచేయడం మీద జాషువా చేసిన వ్యాఖ్యలు ఈ పద్యాలు. రాట్నంలో దారం తీసేటప్పుడు వచ్చే శబ్దంలాగా తెలుగుతనం మూలుగుతున్నది అనేది గొప్ప అధిక్షేపాత్మకభావ చిత్రం. హిందీ భాషకున్న ప్రాముఖ్యం తెలుగు భాషకు లేకపోవడం పట్ల కూడా జాషువ ఆవేదన చెందారు.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రితో గండెపెండేరం తొడిగించుకున్న కవి జాషువ. గండెపెండేరం తొడిగించుకోవడం భూస్వామ్య చర్య కావచ్చుగాని, దానికి దళితులు కూడా తగినవాళ్ళే అని జాషువ రుజువు చేశారు. చెళ్ళపిళ్ళకు ఒకసారి సన్మానం జరిగితే జాషువ పద్యాలు రాశారు.

*"పరభాషా రభసంబునందసిలి, దర్పంబేది, యత్యంతదు*
*ర్భర దీనస్థితి నున్న తెన్గు నుడి"*

(ఖండకావ్యము - 4 : పుట 639)

నిగర్వస్ఫూర్తిగా చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి రూపంలో ఏనుగు నెక్కినాడట. తమిళులను చూసి మాతృభాషాభిమానాన్ని అలవరచుకోమని కూడా జాషువా ప్రబోధిస్తూ "నీయొక్క పద్యంబుతో సరి రావెల్ల కవిత్వముల్ తెలుగు వత్స్యా!" అనగలిగినంత ఆత్మ విశ్వాసముంది జాషువాకు (ఖండకావ్యము-3 : పుట 610). కైలాసానికి పోయి తిరిగి వచ్చిన గబ్బిలంతో సంభాషిస్తూ అరుంధతీ తనయుడు ఏది నివాసయోగ్యమైన చోటో ఒక సీసపద్యంలో చెప్పాడు. అందులో "మాతృభాషల కమర్యాద లొనరించు సర్వకళాశాల సాగుచోటు" అని మొదటి పాదంలోనే చెప్పారు. జాషువా (గబ్బిలం-2 : పుట 898) తర్వాతనే మిగతా లక్షణాలు చెప్పారు. మాతృభాషకు నివాస స్థలానికి గల సంబంధాన్ని గుర్తించిన సామాజిక భాషా శాస్త్రవేత్త గుర్రం జాషువ. ఈ ప్రబోధం మన రాజకీయ వ్యవస్థకు ఇంకా జీర్ణం కావలసి వుంది.

గుర్రం జాషువ 'తెలుగు వెలుగు' అనే కవిత రాశారు. అందులో తెలుగుజాతికి సంబంధించిన అనేకాంశాలు చెబుతూ మధ్యలో తెలుగు భాష నిరాదరణకు గురవు తీరును, మన కర్తవ్యాన్ని గుర్తు చేశారు జాషువ.

*పరువుదూలిన నీయనాదరణ కతన*
*మేటి నీ భాష పొలిమేర దాటలేదు*
*పరుల విజ్ఞానమునకు సంబరము పడక*
*కదగియెత్తుము నీ వీర కాహళంబు*

(ఖండ కావ్యము - 3 : పుట 603)

తెలుగు భాషకన్నా వెనుక పుట్టిన హిందీ భాష అనేక రాష్ట్రాలకు విస్తరించింది. తెలుగు భాషమాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే. తెలుగువాళ్ళకు 'ఇదే బంగళా వాడైతే' 'ఇదే అమెరికా వాడైతే' అనుకోవడం అలవాటు. అది మానుకొని మన భాషా దివిటీని పైకెత్తే ప్రయత్నం చేయమని జాషువ ప్రబోధించారు.

ప్రాచ్యదేశపు ఇటాలియన్ భాషగా ప్రసిద్ధిచెందిన తెలుగు భాషను ఆ భాషలో వచ్చిన సాహిత్యాన్ని సిపి బ్రౌన్ ఉద్ధరించడం ఒక చరిత్ర. దీనిని గుర్తించని తెలుగు వారుండరు. జాషువ కూడా గుర్తించారు. జాషువకు ఎంత కల్పనాశక్తి ఉన్నదంటే..

'ముంతాజ్ మహలు' కావ్యంలోని పద్యం రుజువు చేస్తుంది.

**ఏబదారక్షరంబుల నెసగ మెసగు**

**కవిత**

# వేయితలల విస్పష్ట దృశ్యం

- సిద్దెంకి యాదగిరి
9441244773



భావం
నివురు కప్పిన ఉప్పెన
పలుకుల ప్రవాహం
గుండెలోతుల్లో
అంబాడుతున్న సంభాషణ
సంబరం ఒక సంరంభం
విషాదం
విరిగి పడే ఆకాశం
మనసులోకి ఇంకుతున్న
శబ్దలయల ఇంపు హొయలు
తొణికిసలాడుతున్న ఎద కడలి
మెదడు తరంగాల
మనసు మథనం
ఎతలు తోడిపోస్తుంటే
ఎదుటి మనసు
ఓదార్పయి హత్తుకుంటది
పంచుకున్న పరవశం
బంధాలు తెంచటానికి
ముంపును పసికట్టే ఇంధనం
నిరసనల సరసన చేరి
లబలబ మొత్తుకుంటది

మాట వెనుక మాటును
ఛేధించే అర్థ పరంపర
కసిధీరా కాటేయడానికి
కాచుకునే కాలం
రూపు మారిన హాలాహలం
అలుసు అనర్థం
చూపు ఆనని
అతిశయం వాపు
బలుపుకాదు
బాధల మడుగుని కదిలిస్తే
వెంటాడే తేనెటీగల గుంపు
నైపుణ్యం మురిపిస్తది
ఓర్పు మరిపిస్తది
నేర్పు మెరిపిస్తది
అనవసరం
ఆయువు మీద
విషపు నవ్వై వికసిస్తది
భాష
లాలించే తల్లి

ఓలలాడించే ప్రేయసి
ప్రతీకార ధృతరాష్ట్ర కౌగిలి

సోదరా!
ఉపన్యాసంతో ఊదరకొట్టకు
తప్పులు దొర్లి నీ మీద
పొర్లి పారవచ్చు
అమ్మ భాష
ఉమ్మనీరు తాపొచ్చు
మిక్కిలిగా
శెక్కిల్లుపట్టి శేరు గుద్దనూ
వచ్చు

భాష ఒక మంత్రాంగం
కుతంత్రాలను
ఎదుర్కొనే పోరుతంత్రం
స్వతంత్రాన్ని కోరె భావతంత్రి
ఒడుపు భాసికం
జడుపు పిరికితనం
భాష నిషాచరికాదు
వెలిగే సంచారి
రాక్షసితో రతిక్రీడా
వేయితలల అస్పష్ట దృశ్యం
భాషతో జర భద్రం

❋

---

కలికి భాషకు తెలుగున కలవిగాక
ఆలవియే తాజి లావణ్యమభిను తింప
తరితరంబైన భాషావితానమునకు
(ముంతాజమహలు : పుట 934)

యాభై ఆరు అక్షరాలున్న తెలుగు భాషకే తాజ మహల్ సౌందర్యాన్ని వర్ణించే శక్తి లేకపోతే ఇంకొక భాష ఈ పని సాధ్యం కాదట. జాషువ తెలుగు భాషాభిమానం ఎంత సృజనాత్మకమైనదో ఆశ్చర్యం వేస్తుంది.

ఇవాళ కార్పొరేట్ విద్యాసంస్థలు, ఇతర కార్పొరేట్ కంపెనీలు పాలకులమీద పైచేయి సాధించి తెలుగు భాషను హత్య చేయిస్తున్నాయి. మన వాళ్ళతోనే మన కంటిని పొడిపించేస్తున్నాయి. ఇదొక కన్నీటి కథ.

కాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్ర హృదయంబు గూడ గొంతవసరంబు
(గబ్బిలము – 1 : పుట 855)

అని జాషువ దళిత సమస్య విషయంగా చెప్పారు. తెలుగు భాష కూడా ఇవాళ కన్నీటి కథే. దీనిని అర్థం చేసుకోవాలంటే తెలుగు భాషా హంతకులకు ఆర్ద్ర హృదయం ఉండాలి. ఇప్పుడు లోపిస్తున్నదదే. జాషువ కవికి తెలుగు భాషా జేజేలు...

(ఈ వ్యాసంలోని పుటల సంఖ్యలు మనసు ఫౌండేషన్‌వారి జాషువలోనివి)

***(సెప్టెంబర్ 28 జాషువా జయంతి)***

❋

## విశ్లేషణ

# మెటిల్డా కథ ఒక వివరణ

- కాళిదాసు పురుషోత్తం



***మెటిల్డా ఆంగ్లో ఇండియన్ యువతి కాబోలని అనుకున్నా. ఇంట్లో వంట బ్రాహ్మణుడుండడం, కథ చివర తన భార్య 'అమేషా రామాయణం, భారతం చదువుతున్నట్టుందనీ" మెటిల్డా భర్త అనడం, మెటిల్డా తెలుగులో చీటీ రాసి పంపడం వంటి అంశాలవల్ల ఆమె తెలుగమ్మాయే అని నా బుద్ధికి తట్టింది. మొత్తం మీద ఎందుకో ఈ కథ నాకు పూర్తిగా అర్థంకాలేదని అనిపించింది.***

**డి**గ్రీ చదివే రోజుల్లో (1961–64) మొదటిసారి గురజాడ అప్పారావుగారి కథ 'మెటిల్డా' చదివినప్పుడు నాలో అనేక సందేహాలు కలిగాయి. ఆ సందేహాలు నాలో అలాగే మిగిలిపోయాయి. మెటిల్డా ఆంగ్లో ఇండియన్ యువతి కాబోలని అనుకున్నా. ఇంట్లో వంట బ్రాహ్మణుడుండడం, కథ చివర తన భార్య 'అమేషా రామాయణం, భారతం చదువుతున్నట్టుందనీ" మెటిల్డా భర్త అనడం, మెటిల్డా తెలుగులో చీటీ రాసి పంపడం వంటి అంశాలవల్ల ఆమె తెలుగమ్మాయే అని నా బుద్ధికి తట్టింది. మొత్తం మీద ఎందుకో ఈ కథ నాకు పూర్తిగా అర్థంకాలేదని అనిపించింది.

సాధారణంగా ఒక నవల చదివితే అందులో పాత్రలు మనసులో నిలిచిపోతాయి. మంచి కథ చదివితే చాలాకాలం తర్వాత కూడా ఆ కథలోని సంఘటనలో, పాత్రల మనస్తత్వమో, వ్యక్తిత్వమో మనకు గుర్తుండిపోతాయిగాని పాత్రల పేర్లు జ్ఞాపకం ఉండవు. ఇందుకు అపవాదుగా 'మెటిల్డా' పేరు మనసులో గుర్తుండిపోతుంది. ఈ కథలో మెటిల్డా కాక, ఆమె భర్త, భర్త అప్ప (అక్క), వంట బ్రాహ్మణుడు, రామారావనే విద్యార్థి, అతని మిత్రుడు మాత్రమే పాత్రలు. మైలాపూరులో ఒక అద్దె భవనంలో ఉంటూ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. చదువుతున్న విద్యార్థుల ప్రస్తావన కూడా ఈ కథలో వస్తుంది. ఈ కథలో రామారావనే పాత్ర పేరు ఒకటే గురజాడ కథలో పేర్కొంటారు. మిగతా పాత్రల పేర్లు చెప్పకుండా పాత్రల ఊహకు విడిచిపెట్టారు.

రామారావు స్నేహితుడు మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. విద్యార్థి. కథలో ఇతనే ప్రధాన పాత్ర అయినా, నిగమ శర్మ అక్కకులాగా ఇతనికీ పేరు లేదు. ఈ పేరులేని పాత్ర దృష్టికోణం నుంచే గురజాడ 'మెటిల్డా' కథ చెప్తారు. కథనం ఉత్తమ పురుషలో సాగుతుంది. కథాకాలం ఇరవయ్యో శతాబ్ది తొలి రోజులు.

"నేను వచ్చిన మూడో రోజున రామారావు నన్ను సంజ్ఞ చేసి పిలిచి రహస్యంగా 'మెటిల్డాను చూశావా?' అని అడిగాడు. 'లేద'న్నాను. 'అదిగో చూసీ చూడనట్టు చూడు' అని చూపించాడు.

"చూశాను"

"చాలు యికరా" అన్నాడు. "మరి యెన్నడూ యిటు కన్ను తిప్పకు" అని రెక్క పట్టుకొని గెంటుకు పోయినాడు"

కథ ఎత్తుగడే పఠితల్లో కుతూహలం రేపుతుంది. తర్వాత ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఉత్సుకతను కలిగిస్తుంది. కథకుడు, మొహం తిప్పకుండా అదే ధ్యాసగా మెటిల్డా వంక చూస్తూ "కళ్ళు భగవంతుడు యిచ్చినందుకు యిదే కదా ఫలం" అంటాడు రామారావుతో. "బంగారు ఛాయలు దేరిన మేనిసొంపు, నెమలి పింఛమువలె ఒడలును కమ్మి చెదిరిన తలకట్టూ, బావినుంచి నీరు తోడిన వయ్యారమూ, తోడుతూ వొక్క తరి తలయెత్తి యిటు అటూ చూసిన కన్నుల తళుకూ, మోము అందమూ నా కన్నుల కట్టినట్టు వుండి మరతుమన్న మరుపు రాకపాయెను" అని మెటిల్డా సౌందర్యాన్ని అతను మెచ్చుకుంటాడు.

"మెటిల్డా చరిత్ర అడిగినవారినల్లా, వీరివల్లా, అడక్కుండా

నా నేస్తులవల్లా గ్రహించాను. మెటిల్డా పెనిమిటికి మావాళ్ళు 'పులి, ముసలి పులి' అని పేరు పెట్టారు. అంత ముసలివాడు కాడు. యాభై అయిదు, యాభై ఆరు యీడు వుండవచ్చును..."

"రెండేళ్లాయవచ్చి మా పక్క బంగళాలో బసచేశాడు. యెక్కణ్ణించి వచ్చాడో, యెందుకు వచ్చాడో యెవరూ యెరుగరు... యింటికి చుట్టాలూ రాకపోకలూ యెన్నడూ లేదు. పులి మెట్టిల్డాని యెక్కువకాయిదా పెట్టేవాడు. గుమ్మంలోకి రాకూడదు అని శాసనంట, గాని అప్పుడప్పుడు వచ్చేది. ఆ పిల్ల ముఖాన వొక మోస్తరు విచారం కనబడేది. మొగుడి అప్ప (అక్క) ఒక ముదుసలి, చిలిపి జగడాలు పెట్టేది." వీళ్ళు కాక ఇంట్లో ఒక ముసలి వంట బ్రాహ్మణుడుంటాడు.

> ***ఆయన కథల్లోంచి ఒక్క మాటను కూడా తొలగించడానికి గాని, చేర్చడానికిగాని కుదరదు. మాటల పొదుపు, క్లుప్తత గురజాడ కథానికా శిల్పంలో ప్రధానంగా కన్పిస్తాయి.***

"మెటిల్డా పెనిమిటిని పులి పులి అనడమేగాని అతని పేరేమిటో యెవడూ యెరగడు, పోస్టు బంట్రోతు ఆయన పేర వచ్చిన ఉత్తరములపై విలాసం ఎవరికీ తెలియకుండా నిర్ణయంట." "అది రహస్యం కాపాడడం కోసమై ఉంటుంది" ముసలిపులి ఉదయం సాయంత్రం మొక్కలకి గొప్పు తవ్వేవాడు. మెటిల్డా మొక్కలకి నీరు పోసేది"

కథకుడికి, అతని మిత్రుడు రామారావుకు తెలిసిన భోగట్టా ఇంతమటుకే. ఆ బంగళాలో ఉంటున్న సాటి విద్యార్థులక్కూడా ఈ వివరాలు తెలిసే ఉంటాయి. పొరుగున ఉన్న బంగళాలో రెండేళ్ళుగా ఉంటున్న వ్యక్తి పేరే ఎరుగని విద్యార్థులకు ఆయన భార్యపేరు ఎట్లా తెలుస్తుంది? ఎవరు చెప్తారు? అంతా గోప్యమేనాయె! విద్యార్థులు మాత్రం తమ పొరుగున ఉంటున్న పెద్ద మనిషి పడుచు భార్యను తమకెంతో పరిచయమున్న వ్యక్తిలాగా 'మెటిల్డా, మెటిల్డా' అని వ్యవహరిస్తుంటారు. కథలో మెటిల్డా అన్న పదం 19 పర్యాయాలు వస్తుందని, విద్యార్థులే ఆమెకు మెటిల్డా అనే అందమైన నిక్‌నేమ్ పెట్టుకొని తమలో తాము వ్యవహరిస్తూ ఉండి ఉంటారని శిష్ట్లా శ్రీనివాస్ ప్రతిపాదించారు[1]. మెటిల్డా అనే దివ్యసుందరి ప్రస్తావన డాంటి **(Dante) Devine comedy** లో వస్తుంది. స్వర్గలోకంలో ఒక సెలయేటి ఒడ్డున ఆమె పువ్వులు ఏరుకుంటూ ఉంటుంది. చెట్లక్రింద రాలిన పూలతో ఆమె దారంతో రాగరంజితమై ఉంటుంది. షెల్లీ ఈ భాగాన్ని **Metilda Gathering Flowers** పేరుతో ఒక కావ్యం రాశాడు.

ఆ రోజుల్లో విద్యార్థులకు ఈ కావ్యాలతో, గాథలతో పరిచయం ఉండి ఉంటుంది. గురజాడ బి.ఎ. విద్యార్థుల గ్రీకు, రోమన్ చరిత్రలు బోధించారు కూడా. ఆనాటి విద్యార్థుల ఊహల్లో మెటిల్డా దేవకన్య, గొప్ప సౌందర్యవతి, పొరుగింట్లో ఉంటున్న అందమైన యువతి దేవకన్యలా ఉందని భావించి ఆమెకు విద్యార్థులు మెటిల్డా అని పేరు పెట్టుకొని ఉంటారని శిష్ట్లా శ్రీనివాస్ భావించారు. ఈ ఊహ వాస్తవానికి దగ్గరగా ఉన్నట్లనిపిస్తుంది.

1950 దశకంలో యువకులు రూపవాణి, మోహిని పత్రికలు పిచ్చిగా చదివేవాళ్ళు. నదీరా అనే హిందీ తారంటే తెగ మోజుపడేవాళ్ళు. ఇప్పటి యువతరానికి ఆ పత్రికలను గురించి తెలీదు. నదీరా ఎవరో ఎరుగరు. నదీరా మన జ్ఞాపకాల్లోంచి మాసిపోయినట్లే మెటిల్డా స్మృతులు కూడా చెదిరిపోయి ఉండొచ్చు.

'మెటిల్డా' కథకు కథానికా లక్షణాలను సమగ్రంగా అన్వయించవచ్చు. పాఠకుల్లో కుతూహలాన్ని కలిగిస్తూ కథను ఎంత ఆకస్మికంగా ఆరంభిస్తారో, గురజాడ అంతే ఆకస్మికంగా కథను ముగిస్తారు. నార్ల వారన్నట్లు ఆయన కథల్లోంచి ఒక్క మాటను కూడా తొలగించడానికి గాని, చేర్చడానికిగాని కుదరదు. మాటల పొదుపు, క్లుప్తత గురజాడ కథానికా శిల్పంలో ప్రధానంగా కన్పిస్తాయి. ఈ కథలో ప్రతి పాత్రను ఆయన చాలా సార్థకంగా వాడుకున్నారు. మెటిల్డా కథ ఆరంభంలోనే వంట బ్రాహ్మణుడి ప్రస్తావన వస్తుంది. ఈ వంట బ్రాహ్మణుడే రామారావు నేస్తుకు (కథకుడికి) మెటిల్డా రాసిపంపిన చీటి అందిస్తాడు. మెటిల్డా నీళ్ళు తోడడం, మొక్కలకు నీళ్ళు పోయడం, గవాక్షం వద్ద ఫ్రేములో బిగించిన చిత్రంలాగా, శిల్పంలాగా కన్పించడం వగైరా వర్ణనలు కథను ముందుకు నడిపించేవే.

కథ ముగింపులో మెటిల్డా భర్త 'ముసలి పులి' రామారావు స్నేహితుడితో (కథకుడితో) సంభాషిస్తాడు. 'కథకుడు' లేదా రామారావు స్నేహితుడు 'ముసలి పులి' చాలా మంచి విద్యాంసుడని గ్రహిస్తాడు. ఈ పాండిత్యం, జీవితానుభవం మెటిల్డా భర్త 'ముసలిపులి'తో ఎటువంటి మార్పును తీసుకొని రావు. అనుమాన పిశాచం అతని మనసులో అట్లాగే

## కవిత

# రేపటి మన రూపం..!

- ఎస్.ఎం. సుభాని
9490776184



బిడ్డలుండి.. లేరో
ఉండి... చూడలేనివారో
జట్టురాలి
ముడుతలు పడిన
నుదురుతో
దీనమైన
చూపులతో
నీరసంగా...
గ్రీష్మంలో
ఆకులు రాలి
మోడువారిన ... చెట్టులా
అర్ధనగ్నంగా
ఎండలో డొక్క ఎండి
చిక్కి శల్యమైన
శరీరం..
ఒక్కొక్క రోజు
ఒక్కొక్క చోట
ప్రత్యక్షం..
మనసు.. కరిగి
కరుణతో మనమిచ్చే
ఒక్క రూపాయికై
చేతులు చాచి
ఎదురు చూసే
దయనీయ
రూపం...
చూసినప్పుడల్లా
గుండె తరుక్కుపోయి
మరపురాక
వెంటాడే విషాద
దృశ్యం...
నీకో. . నాకో...
మరింకెవరికో
జన్మనిచ్చి
పెంచి, పోషించి
ద్వేషించినా
హింసించినా
ఈసడించినా
కడుపులో దాచుకుని
ప్రేమించే
జనకుడతను
తెలియనంత మాత్రాన
అపరిచితుడు... కాదు
ఇప్పటికైనా
కళ్ళు తెరిచి చూడు
అదే
రేపటి మన రూపం... ❋

---

ఉండిపోతుంది. రామారావు మిత్రుడు (కథకుడు) అతనివద్ద సెలవు తీసుకొని వెళ్ళేందుకు సిద్ధమవుతున్న సమయంలో సంస్కారహీనంగా 'మరి నువ్వు వెళ్ళిపో' అని అంటాడు. పులి తన చారల్ని మార్చుకోలేదు కదా!

"నాకు నీవూ నీ స్నేహితుడు రామారావూ మరొక గొప్ప ఉపకారం చేశారు" అంటాడు మెటిల్డా భర్త కథకుడితో. అంటే కథకుడి విషయంలో జరిగినట్టే రామారావుకూ మెటిల్డా భర్త నుంచి ఏవో చేదు అనుభవం ఎదురై ఉండాలి. కథ ఆరంభంలోనే రామారావు తన మిత్రుడికి మెటిల్డాను చూపించి, మరెప్పుడూ అటువైపు కన్నెత్తి చూడవద్దని కఠినంగానే చెప్తాడు. గురజాడ ఈ కథలో చెప్పినదానికన్నా పాఠకుల ఊహకు విడిచిపెట్టినదే ఎక్కువ. అసలు మెటిల్డా భర్త దేశంకాని దేశంలో అంత ఏకాంతంగా ఏ కారణంగా ఉండవలసి వచ్చింది? ఇటువంటి ప్రశ్నలెన్నో మెటిల్డా కథ చదివినప్పుడు తల ఎత్తుతాయి.

గురజాడ 1895 ఏప్రిల్ 28వ తేదీన దినచర్యలో రాసుకున్న వంటలక్క చెప్పిన కథ 'మెటిల్డా' కథకు ప్రేరణ కావచ్చని కె.వి.ఆర్. ఊహించారు. 1900 డిసెంబర్ 26వ తేదీ రాత్రి మద్రాసులో విజయనగర సంస్థానం వారి అడ్మిరాలిటి భవనంలో ఉండి, దూరంగా కన్పిస్తున్న, దృశ్యాలను **Scenes** అని శీర్షికపెట్టి దినచర్యలో గుర్తు రాసుకున్నారు.

"There is an inherent (?) such is felt in the unknown to one self. We imagine all niceness, prettiness (...) The same in the case with men. The less known the life of one, the more charm surrounding it over the people. The curiosity to find it. The bright lights in a bunglow - christian english family lives. The charm thus attaches to her. Hindu wife in the mind of the husband is seen long accountable. Her life, her (views), her surroundings of early life & have charm".

ఇరుగు పొరుగున ఉన్న కుటుంబాల గురించి, మరీ తమకు తామే వెలి వేసుకున్నట్లు సమాజంతో సంబంధం లేకుండా కేటాపడి జీవించే వారిని గురించి తెలుసుకోవాలనే కుతూహలం ఎవరికైనా ఉంటుంది. గురజాడ గుర్తుగా రాసుకున్న ఈ వాక్యాలు కూడా మెటిల్డా కథకు స్ఫూర్తి కావచ్చేమో!

"శ్రీ గురు (Sic) జాడ అప్పారావుగారి చిన్న కథలు " పేరుతో "వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్" ప్రచురణ సంస్థ 1950లో గురజాడ అప్పారావుగారి కథలను పుస్తక రూపంలో తెచ్చింది. మొదటిసారి మెటిల్డా, మతము – విమతము కథలు ఈ సంపుటంలోనే అచ్చయ్యాయి. ఇందుకైనా వావిళ్ళ సంస్థకు గురజాడ సాహిత్య ప్రేమికులు కృతజ్ఞులుగా ఉండాలి.

**1. Srinivas sistla, Gurajada Apparao Telugu stories PP 44-51**

***(సెప్టెంబర్ 21 గురజాడ జయంతి)*** ❋

**విశ్లేషణ**

# ధర్మాల ఘర్షణ మహాభారతం


**- ప్రొ॥ఎస్.రాజేశ్వరి**

**9652248978**




***మహాభారతంలోని ఎన్నో సమస్యలకు హేతుబద్ధంగా సమాధానాలు వెదికి 'మిథ్' (పౌరాణికాలు)ను, వాస్తవాన్ని విడదీసి ఆనాటి సామాజిక స్వరూపాన్ని సృజనాత్మకంగా పునర్నిర్మించిన 'పర్వ' నా ఈ వ్యాసానికి మూలం. ప్రాచీన వ్యాస మహాభారతానికి ఆధునిక నవలారూపం 'పర్వ' సుప్రసిద్ధ కన్నడ సాహిత్యకారులు, తత్త్వవేత్త, ఆచార్య ఎస్.ఎల్ భైరప్ప పర్వను రచించారు. కన్నడంలో ఆయన రచించిన 'పర్వ'ను తెలుగులోకి అనువదించిన వారు గంగిశెట్టి లక్ష్మీనారాయణ.***

సనాతన, ఆధునాతన ధర్మాల ఘర్షణే మహాభారత రచనకు మూలం. మూలరచన వ్యాసభారతం వేదసంస్కృతి చివరి దశలోని ఆర్థిక, రాజకీయ, ధార్మిక, సామాజికాది వివిధ ముఖాలను లోతుగా చిత్రించింది. అక్కడి నుండి నేటి వరకు వెలువడిన ఎన్నో భారతాలు ఆయా దేశ, కాల పరిస్థితులను నిక్షిప్తం చేసుకుంటూ భారతజాతి మహోత్తమ వారసత్వంలో భాగంగా నిలిచాయి. భారతీయ సంస్కృతిని అధ్యయనం చేసే వారికి మహాభారతం ఒక సవాలుగా నిలిచింది. ఎన్నో యుగాల సంస్కృతి పరిణామాలను తనలో ఇముడ్చుకొని ప్రతి వర్ధమాన తరానికి అన్వయించేలా ఇలియట్ చెప్పినట్లు Presentness of the past and pastness of the present గా నిలిచింది.

మహాభారతంలోని ఎన్నో సమస్యలకు హేతుబద్ధంగా సమాధానాలు వెదికి 'మిథ్' (పౌరాణికాలు)ను, వాస్తవాన్ని విడదీసి ఆనాటి సామాజిక స్వరూపాన్ని సృజనాత్మకంగా పునర్నిర్మించిన 'పర్వ' నా ఈ వ్యాసానికి మూలం. ప్రాచీన వ్యాస మహాభారతానికి ఆధునిక నవలారూపం 'పర్వ' సుప్రసిద్ధ కన్నడ సాహిత్యకారులు, తత్త్వవేత్త, ఆచార్య ఎస్.ఎల్ భైరప్ప పర్వను రచించారు. కన్నడంలో ఆయన రచించిన 'పర్వ'ను తెలుగులోకి అనువదించిన వారు గంగిశెట్టి లక్ష్మీనారాయణ.

చరిత్ర భూమిక పొరల్లో చిక్కుకుపోయిన నాటి సమాజ స్వరూపాన్ని మనకళ్ళ ముందు ఆవిష్కరించింది పర్వ. పాతివ్రత్య భావజాలం భారతీయ సంస్కృతి పరిణామ క్రమంలో రూపుదిద్దుకోవడాన్ని, సనాతన, ఆధునిక భావజాల సంఘర్షణను, సంక్లిష్టతను స్పష్టంగా చిత్రించింది మహాభారతం, ఈ భావజాల సంఘర్షణే ఈ నా పత్రానికి మూలాధారం. పాతివ్రత్యం, కన్యత్వం స్త్రీ జీవిత ప్రతిపత్తిలో చోటు చేసుకున్న విధానాన్ని ప్రధానంగా తీసుకున్నాను.

ఆనాటి సమాజంలో వివాహానికి పూర్వం స్త్రీ సంతానాన్ని కనడం సహజం. వారిని 'కానీన శిశువు' అనేవారు. కృష్ణద్వైపాయనుడు కానీన శిశువే. పరాశరుడికి కన్యగా ఉన్న సత్యవతికి జన్మించారు. కృష్ణద్వైపాయనుడికి గాంధర్వస్త్రీకి జన్మించిన శుకుడు కూడా కానీన శిశువే. వీరికి ఆనాటి సమాజంలో గౌరవం లభించింది. అపారమైన వేదవిద్యకు ఉత్తరాధికారులు అయ్యారు. కానీన శిశువులు ఉన్న స్త్రీని వివాహం చేసుకున్నప్పుడు ఆ శిశువుల్ని దత్తత స్వీకారం చేసుకునే ఆచారం కూడా ఉండేది. మద్రదేశంలో శల్యుడి పుత్రుడు రుక్మరథుడు వివాహ సమయంలో భార్యతోపాటు ఆమె కానీన పుత్రుడి కోసం యుద్ధం చేయడానికి కూడా సిద్ధపడ్డాడు. శుద్ధ ఆర్యాకుటుంబంలో స్త్రీ గర్భశక్తి మగ పిల్లల్ని కనడం ద్వారా ఆమె స్థానం నిర్ణయించబడేది. ఋతుమతికి

ఋతునష్టం కాకూడదన్న నియమంతో కానీన శిశువుల్ని సమాజం ఆమోదించేది. అయితే తరువాత కాలంలో కానీన శిశువు ఉన్న స్త్రీపై చిన్నచూపు ఏర్పడింది. వివాహానికి కన్యత్వం ప్రధానమయ్యింది. ఇది నాగరికతా చిహ్నంగా భావించారు. అందుకు కుంతీ జీవితం ప్రత్యక్ష సాక్ష్యం. కుంతికి కర్ణుడు కానీన పుత్రుడు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు. 'ఋషులు సనాతనులు – క్షత్రియులు ఆధునికులు' అంటూ క్షత్రియ కన్యలకు యోనిశుద్ధి నియమం ఉండాలి అన్నారు.

> ***పిల్లలు లేని వారు నియోగంతో వంశవృద్ధి చేసుకోవడం ఆనాటి సమాజ సహజ ధర్మం. శాస్త్ర సమ్మతం. పతి అశక్తుడు అయితే పిల్లలు పుట్టకపోతే 'నియోగం' ద్వారా సంతానాన్ని పొందవచ్చు.***

రుక్మరథుడు కూడా తన పుత్రిక హిరణ్యవతిని కన్యగా ఉండాలని కట్టడి చేసాడు. కానీన శిశువు పుడితే ఆమెను వివాహం చేసుకోవడానికి ఉన్నత రాజవంశీయులు రారని భావించాడు. తన పుత్రికకు 'ఓలి'పద్ధతి ద్వారా కాకుండా 'స్వయంవరం' పద్ధతిలో వివాహం జరిపించాలని నిర్ణయించాడు. కన్యగా ఉన్నప్పుడు స్త్రీకి ఉన్న స్వాతంత్ర్యాన్ని నిషేధించి పవిత్రంగా ఉండాలని నిర్ణయించడం ద్వారా సమాజ పరిణామ క్రమం స్పష్టమవుతుంది.

వివాహానికి పూర్వం కన్యత్వం, వివాహానంతరం, పాతివ్రత్యం స్త్రీకి నియమాలయ్యాయి. భారతంలో స్త్రీ పాతివ్రత్యానికి పరాకాష్టగా నిలిచింది గాంధారి. తనకు కురు వంశరాజైన ధృతరాష్ట్రునితో వివాహం నిశ్చయించారని అతను పుట్టు అంధుడని తెలిసిన వెంటనే కళ్ళకు గంతలు కట్టుకుంది. ఆమెను అందరూ 'పతివ్రత' అన్నారు. ఈ పాతివ్రత్య భావన ఎంత దూరం వెళ్ళిందంటే తమ వంశాభివృద్ధికి మూలమైన 'నియోగాన్ని' కించపరిచేంత వరకు వెళ్ళింది. పిల్లలు లేని వారు నియోగంతో వంశవృద్ధి చేసుకోవడం ఆనాటి సమాజ సహజ ధర్మం. శాస్త్ర సమ్మతం. పతి అశక్తుడు అయితే పిల్లలు పుట్టకపోతే 'నియోగం' ద్వారా సంతానాన్ని పొందవచ్చు. నియోగానికి స్వంత పురోహితుడు తగినవాడు. నియోగంలో స్త్రీకి కామవాంఛ కాకుండా పుత్రవాంఛ ఉండాలి. నియోగానంతరం అతనిని పితృ సమానంగా భావించాలి అన్నారు.

బెస్త వనిత సత్యవతికి పుట్టిన సంతానం చిత్రంగదుడు, విచిత్రవీర్యుడు. చిత్రాంగదుని గంధర్వులు చంపారు. విచిత్ర వీర్యుడు జబ్బు మనిషి చిన్నతనంలోనే తనువు చాలించాడు. భీష్ముడు వివాహాన్ని తిరస్కరించడంతో కురువంశం అంతరించే పరిస్థితి ఏర్పడింది. బీజప్రధాతలైన పురుషులు లేకపోవడంతో క్షేత్రమే దిక్కయ్యింది. బీజం ఎవరిదైనా "తమ క్షేత్రంలో పండే పంట తమదే" అన్న నీతి సూత్రంతో కొడుకు లేకపోయినా కోడలికి పుట్టే సంతానమే కురువంశాన్ని నిలబెడుతుందని భావించారు. నియోగంతో వంశాన్ని పెంపొందించడమే ధర్మమార్గమని భీష్ముడు నిర్ణయించాడు. వాని తమ్ముడైన కృష్ణద్వైపాయనుడు అందుకు సరైన వాడని భావించాడు. తల్లి సత్యవతి మాటను కాదనలేక కృష్ణద్వైపాయనుడు నియోగానికి ఒప్పుకున్నాడు. కృష్ణద్వైపాయనుడి ముత్తాత వశిష్టుడు కూడా కల్మషపాద రాజు భార్యకు నియోగం చేశాడు. నియోగం క్షత్రియుల పద్ధతి. తాము నిర్మించిన రాజ్యం తమ వంశం పేరిటనే ఆచంద్రతారార్కరం ఉండాలని ఆశపడేవాళ్లు. అంబిక, అంబాలికలకు ధృతరాష్టుడు, పాండురాజు, వారి దాసీకి విదురుడు జన్మించాడు.

ధృతరాష్టుడు పుట్టంధుడు. పాండురాజు దాంపత్య జీవితానికి అనర్హుడు. విదురుడు దాసీ పుత్రుడు, సమస్య తిరిగి మొదటికి వచ్చింది. పాండురాజుకు కుంతీ, మాద్రిలతో వివాహం జరిగినా సంతానం కలగలేదు. రాజ్యాన్ని త్యజించి భార్యలతో అరణ్యాలకు వెళ్ళిపోయాడు పాండురాజు. అక్కడ పాండురాజు నియోగాన్ని ఆశ్రయించాడు. బుద్ధిమంతుడు, బలవంతుడు, శౌర్యవంతుడు అయిన ముగ్గురు పిల్లలను కుంతీ కన్నది. వారే ధర్మరాజు, భీముడు, అర్జునుడు. మాద్రికి ఆశ్విని దేవతల వలన నకుల, సహదేవులు జన్మించారు. ఈ విధంగా నియోగం కురువంశాభివృద్ధికి మూలకారణం అయ్యింది. 'పాతివ్రత్యభావన' పుట్టిన తర్వాత నియోగం కురువంశ నాశనానికి కారణమయింది. కురుక్షేత్ర యుద్ధానికి దారి తీసింది.

కురుక్షేత్ర యుద్ధానికి అన్నదమ్ముల మధ్య ఏర్పడిన రాజ్యాధికార స్పర్థ ఒకటే కారణం కాదు. ఒక కుటుంబంలోని దాయాదుల హక్కుల పోరాటం కూడా, దుర్యోధనుడు తాను తన తండ్రి ధృతరాష్ట్రుడి బీజానికి జన్మించానని, పాండవులు ఎవ్వరూ పాండురాజు బీజానికి జన్మించలేదని, కాబట్టి రాజ్యానికి వారు వారసులు కారని, తానే రాజ్యానికి నిజమైన వారసుడినని వాదించాడు. ఇది పాండవుల అస్తిత్వాన్ని ప్రశ్నించింది. నియోగం ద్వారా పుట్టిన ధృతరాష్ట్రుడు ఏవిధంగా రాజార్హుడు అయ్యాడో తానుకూడా అదే న్యాయం ప్రకారం రాజార్హుడినని స్పష్టీకరించాడు ధర్మరాజు. ఈ ఇరువురి బీజక్షేత్ర

ప్రధాన ఘర్షణే కురుక్షేత్రానికి కారణమయ్యింది. బీజక్షేత్ర న్యాయంలో క్షేత్ర ప్రాధాన్యం సనాతన ధర్మం. బీజప్రాధాన్యం అధునాతన ధర్మం. ఈ సనాతన – అధునాతన ధర్మాల ఘర్షణే మహాభారతానికి మూలం.

> ***బీజక్షేత్ర న్యాయంలో క్షేత్రప్రాధాన్యం సనాతన ధర్మం. బీజప్రాధాన్యం అధునాతన ధర్మం. ఈ సనాతన – అధునాతన ధర్మాల ఘర్షణే మహాభారతానికి మూలం.***

క్షేత్రం అంటే తల్లి. బీజం అంటే తండ్రి. మాతృసామ్యం నుంచి పితృస్వామ్యానికి సమాజం మారే దశలో ఇద్దరికి సమప్రాధాన్యం ఉండేది. క్రమంగా తల్లికి ప్రాధాన్యం తగ్గి తండ్రికి ప్రాధాన్యం పెరిగింది. అందుకు పాతివ్రత్య మాయాజాలం (మిథ్) బాగా పనిచేసింది. ఆ ప్రకారంగా దుర్యోధనుడు తన తల్లి పాతివ్రత్యం ఆధారంగా తన పుట్టుకను, తన తల్లిదండ్రుల గొప్పతనాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేసాడు.

ఈ పాతివ్రత్య భావన నియోగాన్ని ప్రశ్నించడమే కాకుండా బహుభర్తృత్వాన్ని వేలెత్తి చూపింది. ఐదుగురిని భర్తలుగా పొందిన ద్రౌపదికి నిండుసభలో అవమానం జరిగింది. తల్లి గాంధారి పాతివ్రత్యాన్ని చూసి గర్వపడిన దుర్యోధనుడు పాండువుల తల్లిని, ఇల్లాలిని వేలెత్తిచూపాడు. కురుక్షేత్ర యుద్ధానికి కారణమయ్యాడు. ఒకనాడు భర్త ఆజ్ఞకు లోబడి ఉండటం పాతివ్రత్యం, తర్వాతి కాలంలో సంగమ నిషేధం పాతివ్రత్యంగా మారింది.

ఈ పాతివ్రత్యం భర్త గుడ్డివాడు, కుంటివాడు, అప్రయోజకుడు అయినా పతియే దైవంగా కొలవాలని స్త్రీకి షరతులు విధించింది. గాంధారి కురుక్షేత్ర యుద్ధానంతరం కృష్ణుడికి తన మనోగతాన్ని వివరించింది. గుడ్డివాడికిచ్చి పెళ్ళి చేసి తనను పతివ్రత అని పూజించడంతో ఈ పాతివ్రత్యపు ముసుగులోనే ఉండిపోయానని తెలిపింది. పాతివ్రత్యం తనకు గుడ్డితనాన్ని, నిస్సహాయతను విధించింది. తన స్వేచ్ఛను హరించిందని దు:ఖించింది.

భారతంలో సత్యవతి, కుంతి, హిరణ్యవతుల వివాహత్పూర్వం స్త్రీ జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలకు నిదర్శనంగా, మూడు తరాలకు ప్రతీకలుగా నిలిచారు. మొదటితరానికి చెందిన సత్యవతి వివాహానికి పూర్వం బిడ్డను కనినా, ఆమె శంతన మహారాజుని వివాహం చేసుకోవడానికి, మహారాణికావడానికి ఎలాంటి అడ్డంకులు లేవు. రాచరికం ఆమెను ఆమెబిడ్డను సాదరంగా ఆహ్వానించింది. తరువాత తరానికి చెందిన కుంతికి ఆవిధంగా జరగలేదు. వివాహానికి పూర్వం ఆమెకు బిడ్డ ఉందన్న సంగతిని గోప్యంగా ఉంచారు. అయితే కన్యగా ఆమెకున్న స్వేచ్ఛను తండ్రి అడ్డుకోలేదు. కానీ మూడవ తరానికి చెందిన హిరణ్యవతికి ఆ స్వేచ్ఛ దక్కలేదు. వివాహానికి పూర్వం స్త్రీ అక్షతయోని (కన్య) ఉండాలన్న నియమాన్ని విధించి ఆమె తండ్రి అంత:పురానికి బంధీని చేశాడు. కాలక్రమేణ స్త్రీ తన శరీరంపై ఉన్న హక్కును, స్వేచ్ఛను కోల్పోవడాన్ని, వివాహ వ్యవస్థకు బంధీ కావడాన్ని భారతంలో స్పష్టంగా చిత్రించబడింది. ఇవి వివాహత్పూర్వం స్త్రీ ప్రతిపత్తి (Status) లో చోటుచేసుకున్న పరిణామాలు.

వివాహానికి పూర్వం కన్యగా ఉండాలన్న నియమంతో పాటు వివాహానంతరం పాతివ్రత్యం తప్పనిసరి అయ్యింది. పాతివ్రత్యాన్ని నిర్వహించుకోవడంలో కాలక్రమేణ కొంత మార్పు చోటుచేసుకుంది. పూర్వం పాతివ్రత్యం అంటే పతికి అనుగుణంగా అతని ఇచ్ఛానుసారం నడుచుకోవడం, కుంతీ, మాద్రీలు భర్త కోరిక పై పరాయి పురుషుడి ద్వారా సంతానాన్ని పొందారు. అయితే ఒకనాడు అంబిక, అంబాలికలకు లభించిన గౌరవం కుంతీ, మాద్రీలకు లభించలేదు. అందుకు కారణం కాలపరిణామంలో చోటుచేసుకున్న మార్పులే, ఆ తరువాత దశలో ఈ నియోగ పద్ధతిని పూర్తిగా నిషేధించడం జరిగింది. పాతివ్రత్యం అంటే 1. పరపురుష సాంగత్యం ఉండకూడదు. 2. స్వంత ఆలోచనల వ్యక్తిత్వం లేకుండా భర్త తోడిదే జీవితం గడపాలి అని నిర్వచించడం జరిగింది. ఐదుగురిని భర్తలుగా పొందిన ద్రౌపదిని పాంచాలి అన్నారు, అవమానించారు. భర్తకు ఏ సేవలు చేయకున్నా భర్త తోడిదే జీవితం అన్న గాంధారిని మహాపతివ్రత అన్నారు. స్త్రీలను 'మిథ్' (Myth) లో ఉంచడం గాంధారితో ప్రారంభమయ్యింది. గాంధారి తనను గుడ్డివాడి కిచ్చి వివాహం చేసినందుకు నిరసనగా తన కళ్ళకు గంతలు కట్టుకున్నానని, అందరూ తనని పతివ్రత అంటూ పాదపూజలు చేసేవారికి ఆ కళ్ళగంతలు తీయలేకపోయానని శాంతిపర్వంలో కృష్ణుడితో తన మనోగతాన్ని తెలిపింది. పాతివ్రత్య మాయాజాలం (మిథ్)లో స్త్రీలు పడిపోవడం గాంధారితో మొదలయ్యింది. ఆ తరువాత కౌరవుల భార్యలు భర్తల శవాలతో పాటు తాము కూడా సహగమనం చేయడంతో పాతివ్రత్య భావజాలం పరాకాష్టకు చేరింది.

భారతంలో గంగాదేవి, సత్యవతి, అంబిక, అంబాలిక, కుంతీ, మాద్రీ, గాంధారి, ద్రౌపది,కౌరవుల భార్యలు అందరూ

## కవిత

# సద్దిమూట



- దొడ్డి రామ్మూర్తి
9848975264

**ఊ**ట సెలిమెలతల్లి నా వానసుక్క
ఊరు సద్దిమూట నా వానసుక్క

తీరొక్క దినుసుల తిరునాల నాపల్లె
కరువు కత్తికింద తల్లడిల్లుతుండె
పూల తేరు తీరు బతుకమ్మల సెరువు
బొక్కలా బోడయ్యి నోరుదెర్సింది

సెట్ట సేతుల్లేక గట్లు గంధం గాక
కాలుష్యమై పల్లె పడిగె ఇప్పింది
బత్తియెన్నెల తిత్తి తలము రచ్చబండ
దిక్కులేని పచ్చి దిగులు బొొద్రాయి

ఎసరు పెట్టని పొద్దు పొయ్యెక్కదాయె
దివిటీల దీపాంత సోకాన తేలె
దూపబుడ్డి తలము దూల ఆడలేక
పాడవడ్డ పేర్ల కొట్టమయ్యింది

జాలు తిరిగిన పల్లె సుట్టూర తోటల
నిమ్మ బత్తాయిల తీగ బాసింగము
మారుబేరం దంద దళారి అంగడి
సర్కారు తుమ్మలు కాస్టాల గడ్డలు

సీకటి బాటల యెన్నెల సుక్కవు
సబ్బండ జాతికి నెనరు వౌనరు నీవు
సద్దజొన్న సేల సనుబాలు తాగించి
పెంచు పెద్దమనసు తెలంగాణ తలుసు

మొక్కలేని దిక్కు ఎట్ట సూడాలంట
దిగుట మొగులువయ్యి దీనంగవుండకు
పల్లె పల్లె కదిలె పచ్చల హారము
హారతి తెలంగాణ అవని సందమావ

కంటిపాప మొక్క తుడ్పుకుంటి సుక్క
ఇంటిపాప మొక్క ఇలకు వెలుగుసుక్క
నింగి కరిగి నేల వరద రంగుపొంగి
పచ్చని కలనేత కలల మగ్గం సీర

✵

భారతీయ సమాజంలో స్త్రీ ప్రతిపత్తిలో చోటుచేసుకున్న పరిణామాలకు నిదర్శనంగా నిలిచారు.

గంగ తనపై పురుషాధిపత్యాన్ని సహించలేదు. తన సంతానంపై తనకు గల హక్కును నిలుపుకుంది. ఆమె మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతీక. సత్యవతి కొన్ని షరతులు విధించి తన స్థానాన్ని కాపాడుకుంది. వీరిద్దరూ ఆటవిక జాతి స్త్రీలు, అనార్యులు. అంబిక, అంబాలిక, కుంతి మాద్రి, గాంధారి, ద్రౌపది, తక్కిన స్త్రీలు ఆర్యజాతి స్త్రీలు, రాచరిక వ్యవస్థకు చెందినవారు, వీరు తమ శరీరంపై హక్కును కోల్పోయారు. తమ ఇచ్ఛానుసారం కాక, భర్త, అత్తగారి ఇచ్ఛానుసారం నడుచుకున్నారు. అయితే మొదటి తరం స్త్రీలు వారి వ్యక్తిత్వాన్ని పూర్తిగా కోల్పోలేదు. అంబిక, అంబాలికలు మనసు చంపుకుని జడధారితో శరీరాన్ని పంచుకోలేక మౌనంగానే తమ నిరసనను వ్యక్తం చేశారు. తద్వారా సరైన సంతానం లభించలేదు. కుంతీ ద్రౌపదిలు తమ మీద పెత్తనాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. గాంధారి గుడ్డివాడిని వివాహం చేసుకోవడం పట్ల నిరసనను వ్యక్తం చేసినా 'మిథ్'కు లోనయింది. ఇక తరువాతి తరాల స్త్రీలు తమ శరీరంపై అధికారాన్నే కాక, వ్యక్తిత్వాన్ని కూడా కోల్పోయారు. తమని తాము కోల్పోయారు. ఈ విధంగా స్త్రీ జీవితం మొత్తాన్ని వివాహవ్యవస్థ ఆక్రమించుకుంది. శీలమే ఆమెకు పరమావధి అయ్యింది. వివాహ చట్రంలో స్త్రీలు బంధీలు కావడాన్ని, తమను తాము కోల్పోవడాన్ని, చైతన్యరహితులు కావడాన్ని, స్త్రీ ప్రతిపత్తి (Status) లో మార్పుల్ని భారతంలో స్పష్టంగా చూడవచ్చు.

కన్యత్వం, పాతివ్రత్య భావనలో స్త్రీ ప్రతిపత్తిలో చోటుచేసుకున్న ఎన్నో యుగాల సంస్కృతి పరిణామాన్ని, సంక్లిష్టతను మహాభారతం మన కళ్ళముందు ఉంచింది. ఈ భావాల సంఘర్షణ మహాభారత యుద్ధానికి దారితీసిన విధానాన్ని స్పష్టం చేసింది.

భారత, రామాయణ కాలంనాటికే స్త్రీ తన శరీరంపై హక్కును కోల్పోయింది. ఆమెకు లైంగిక స్వేచ్ఛలేదు. పునరుత్పత్తి హక్కులేదు. తను ఎవరికి పిల్లల్నికనాలో, ఎపుడు కనాలో, ఎవరికి కనాలో నిర్ణయించే హక్కు పురుషుడికే ఉంది. కన్యగా ఉన్నప్పుడు తండ్రికి, వివాహానంతరం భర్త కుటుంబానికి ఆ అధికారం ఉంది. మహాభారతం సమాజంలో స్త్రీ ప్రతిపత్తిలో చోటుచేసుకున్న పరిణామాన్ని స్పష్టం చేసింది.

✵

## కవిత

# వద్యాలయం

- "సూర్య" గరిమెళ్ళ
9491804709



పలక మీద తొలి అక్షరం శ్రీకారాన్ని చుట్టుకు
ఆకారం దిద్దుకొంటోన్నప్పుడే.. సప్త సముద్రాల కవతల
సాఫ్ట్‌వేర్ కొలనులో స్వప్నకమలం రేపటి కలల
రేకులు విప్పుకు విరబూస్తుంది
అమ్మ కళ్ళల్లో ఆశల విమానం ఆకాశానికెగురుతుంది
నాన్న మదినిండా డాలర్లవర్షం.. హర్షాన్ని కోరుతుంది
అభ్యాసం 'కాసు' విద్య అయి పోయిన కాలంలో..
'అ' అంటే అమ్మకం.. 'ఆ' అంటే ఆదాయం అంటూ
వరుస తప్పిన వర్ణమాల వాణిజ్యాన్నే వరిస్తుంది.
సర్కారు సౌకర్యాలు చచ్చుబడ్డాక.. వీధి బడులన్నీ
విసర్జన శాలలుగా మారి.. ఈసురో మంటోన్నప్పుడు
సందుకో కాన్వెంటు చదువుల సరఫరా మొదలెడుతుంది.
ఫీజు కట్టినపుడల్లా ట్వింకిల్ స్టార్స్ కనిపిస్తుంటే
ప్రోగ్రెస్ రిపోర్టు మాత్రం 'టెల్లింగ్ లైస్'తో మురిపిస్తుంది.
హమ్టీ..డమ్టీ లిక చదువుల చెరశాలలో చిరకాలపు ఖైదీలు.
బస్తాలమోత బాల్యాన్ని దాటకముందే.. హాంఫట్ అంటూ
ఎమ్సెట్ మాంత్రికుడు ఎత్తుకుపోయి మాయా గృహంలో
బంధిస్తాడు
బిట్లుబిట్లుగా.. తిట్లతో కలిపి పాఠాన్ని తినిపిస్తూ..
గంటకోసారి పరీక్షలో కక్కించి మెదడుబరువు తూచుతాడు.
దొరికే సీట్లకీ.. ఖర్చయ్యే నోట్లకీ మధ్యన కుదరని కాకిలెక్కల్లో
ర్యాంకుల తాడుపట్టుకు సర్కస్ చేస్తుంది జీవితం
ఏ సూర్యోదయమూ.. ఇక ఆ గదివైపు తొంగి చూడదు
ఒక్క సాయంత్రమూ ఆ మానవ యంత్రాలతో ఆటలాడదు
నిద్రపట్టని నిశిరాత్రి పీడకలలలోనూ
వెంట పడి వేధించేది ఫార్ములాల పిశాచాల నిశాచరులే..!
'మా ఆశలన్నీ నీమీదనే..!' అంటుంది అమ్మ
'నా పరువు నిలిపేది నువ్వే..!' అంటాడు నాన్న
ఆదివారం అందించే ఈ అదనపు భారాన్ని తలకెత్తుకు
పేజీల మధ్య కదలాడే కళ్ళ అలజడి
అంతరంగం లోపల అల్లకల్లోలమౌతుంది.
పట్టుబడని లెక్కలకి రెక్కలతకలేక..
పడిపోయిన ఫిజిక్సుని ఫినిక్స్ లా లేపలేక
కెమిస్ట్రీ మిస్టరీ.. మార్కుల్లోకి మార్చుకోలేక
లోలోపల చితికిపోతూ చతికిల పడిపోతోన్నపుడు
కనిపెట్టి చేయూత నిచ్చేవాడొక్కడూ దొరకడు.
లోపలి శక్తికి, ఆసక్తికి సరిపోయే ద్వారం తెరచి దారైనా
మళ్ళించడు
అన్నిదార్లూ మూసుకుపోయిన అసహనంలో..
అసహజమైన అడ్డదారేదో ఒక అంతిమ యాత్రకి రహదారి
అవుతుంది
కార్పోరేటు చెరశాలలో చిక్కుకు విలవిలలాడుతోన్న మిధ్యల
విద్యకి
విముక్తి కలిగించే.. విక్రమార్కుడొకడు కావాలిప్పుడు.
తలుపులు మూసిన గదులను తప్పించుకు.. జీవితానికి
నిర్వచనం
ఆరు బయట బోధించే బోధిసత్వులయినా.. రావాలిప్పుడు.
చదువెప్పుడూ చావు కోరదని.. మరో కల నేల రాలకముందే
చాటింపు వేద్దాం.. ఛల్ ఛలో..!!

❋



# తెలుగునేలపై కన్నడ శాసనాలు : చిత్తూరు జిల్లా

- ఈమని శివనాగిరెడ్డి
9848598446

తెలుగునేలకు దక్షిణానున్న చిత్తూరుజిల్లా తమిళనాడు, కన్నడ దేశాలకు సరిహద్దుగా ఉండటాన, జిల్లాలో తెలుగు శాసనాలతో పాటు తమిళ, కన్నడ శాసనాలు కూడా దొరికాయి. క్రీ. 8-16 శతాబ్దాల మధ్య జిల్లాను పాలించిన బాణ,వైదుంబ, చోళ, నొలంబ, విజయనగర రాజుల కన్నడ శాసనాలున్నాయి. వీరిలో బాణరాజుల శాసనాలు -10; వైదుంబ రాజుల శాసనాలు-3; విజయనగర శాసనాలు - 27; ఇతరుల శాసనాలు -6; కలిపి మొత్తం 56 కన్నడ శాసనాలున్నాయి. ఈ శాసనాల్లో రాజులపేర్లు, బిరుదులు, శాసనాలను విడుదల చేసిన తేదీలు, యుద్ధాలు, యుద్ధంలో మరణించిన వీరులు, వారికి ఎత్తించిన వీరశిలలు, ఆలయ నిర్మాణం, భూమి, నగదు, దానాలు, పరిపాలనా విభాగాలు, చెలామణిలో ఉన్న నాణేలు మొదలైన చారిత్రక విషయాలెన్నో ఉన్నాయి.

బాణ వంశానికి చెందిన విక్రమాదిత్య జయమేరు, విజయాదిత్య ప్రభుమేరు, చండియన్న, బాణరస మహావలి బాణరస, సెంబియాన్ మహబలి బాణరసల క్రీ.శ. 9-10 శతాబ్దాల నాటి కన్నడ శాసనాలు జిల్లాలో దొరికాయి.

పుంగనూరు తాలూకా లోని ఎంబాడి అనే వూళ్లో గల కన్నడ శాసనంలో, గోగ్రహణంలో పాల్గొన్న ఒక గావుండకు బాణ రాజైన మహావలి బాణరస కొంత భూమిని దానం చేసిన వివరాలున్నాయి. కకుత్తూరులోని క్రీ.శ. 9వ శతాబ్దపు మరో శాసనంలో కాడువెట్టి అనే రాజప్రముఖుడు, కప్పం చెల్లించని కారణంగా, రాష్ట్రకూట రాజైన బల్లాహుడు దాడిచేయగా అపోరులో బాణ తట్టరన్ అనే సైనికుడు గణమూర్తి అనే శతృసైనికుని చంపి, గుర్రం పై తిరిగి వస్తుండగా, యుద్ధంలో తగిలిన గాయాలతో మరణించాడని ఉంది.

అదే గ్రామంలో, చోళ రాజైన మొదటిపరాంతకుని సామంతుడైన సెంబియాను మహాబలి బాణరస కాలంలో పులినాడు-60 ను విక్కియన్న పాలిస్తున్నాడనీ, పల్లవ వధవళు నితో జరిగిన యుద్ధంలో, విక్కియన్న మరణించగా, అతని సోదరుడు, అతని జ్ఞాపకంగా, ఒక స్మారకశిలను ఎత్తించాడని చెప్పబడింది. అదే గ్రామంలోని మరో శాసనంలో మహాబలి బాణరస కొలువులో ఉన్న ఒక్కలన్ అనే సైనికుడు, ఒక యుద్ధంలో మదపు టేనుగును వధించి, తానూ మరణించినట్లు చెప్పబడింది.

చదల అనే గ్రామంలోని క్రీ.శ. 9వ శతాబ్ది శాసనంలో మహాబలి బాణరస, నొలంబ రాచమల్లుని పైకి సొరముడివద్ద దాడి చేసినపుడు, కుంగనూరుకు చెందిన మయిందాడి మాధవరస, అనేక గుర్రాల్ని, మనుషుల్ని చంపి, తాను మరణించగా, రాజు అతని కుటుంబ పోషణ నిమిత్తం మూడు ఖంబాల భూమిని దానం చేశాడనీ, బాణులకు, నొలంబులకు మధ్య జరిగిన సొరముడి యుద్ధం, ఇంకా పొలాన్ని ఖంబాల్లో

కొలిచే వారనీ చెప్పబడింది. పిదుపట్ల అనే ఊరులోని క్రీ.శ 9వ శతాబ్ది శాసనంలో బాణరసపాలనలో నుండగా, అతని సేవకుడు మకర మాసదివస సందర్భంగా మంటల్లో దూకి స్వర్గస్థుడైనాడని చెప్పబడింది. పుణ్యదినాల్లో ఆత్మాహుతి చేసుకొనే ఆచారం ఆ రోజుల్లో ఉండేదని తెలుస్తుంది.

***శిలపై భాగంలో పోరాటంలో ఉన్న యోధుడు కుడిచేతిలో ఒక పెద్ద ఖడ్గాన్నీ ఎడమ చేతిలో శత్రువునీ పట్టుకొని ఉన్నట్లు, రెండు వైపులా ఇద్దరు సురలోక స్త్రీలు వింజామరలు పట్టుకొని స్వర్గానికి ఆహ్వానిస్తున్నట్లు చెక్కబడింది.***

పుంగనూరులోని సోమేశ్వరీస్వామి దేవాలయం లో గల క్రీ.శ. 9వ శతాబ్ది శాసనంలో, బాణ రాజైన విజయాదిత్య ప్రభు మేరు, వడుగావళి-12000 రాజ్యం చేస్తుండగా, కాదువట్టి ముత్తరస కొయటూర్‌పై దాడి చేయగా, వీరోచితంగా పోరాడి, 9మంది దొంగల్ని చంపి, మరణించిన కందనారాయణ కొడుకైన అజ్జవాగర అనే వీరునికి ఒక ఖండుగ నేలను బహూకరించిన విషయం చెప్పబడింది. ఆ రోజుల్లో దొంగలు ముఠాలుగా ఏర్పడి, ఊళ్లను దోచుకుంటుంటే, వీరులు వారిని ధైర్యసాహసాలతో ఎదుర్కొనే వారని తెలుస్తుంది.

బూడిదపల్లి లోని మహాబలి బాణరాజ విక్రమాదిత్య జయమేరు శాసనంలో, శత్రువులు పశువులను తోలుకెళ్లటానికి రాగా, మినిక్కికి చెందిన కేళాముద్దన్ అనే వీరుడు పోరాడి మరణించాడని చెప్పబడింది. రాజుకు, జయమేరు, కందర్ప అనే బిరుదులున్నట్లు తెలుస్తుంది. అంతేకాక ఆ రోజుల్లో పశువులపై దాడిచేసి, వాటిని తోలుకెళ్ళటం సర్వసాధారణమని కూడా తెలుస్తుంది. వైదుంబరాజుల పాలనలో నున్న చిత్తూరుజిల్లాలో గండత్రినేత్ర, మనుజత్రినేత్ర, వైదుంబ మహారాజుల శాసనాలు 6 దొరికాయి. కలకడలోని పోలాల్లో ఉన్న వైదుంబ రాజైన గండత్రినేత్రుని కాలపు వీరగల్లు శాసనంలో, అజ్జల అనే వీరుడు గోగ్రహణ పోరులో మరణించాడని చెప్పబడింది. శిలపై భాగంలో పోరాటంలో ఉన్న యోధుడు కుడిచేతిలో ఒక పెద్ద ఖడ్గాన్నీ ఎడమ చేతిలో శత్రువునీ పట్టుకొని ఉన్నట్లు, రెండు వైపులా ఇద్దరు సురలోక స్త్రీలు వింజామరలు పట్టుకొని స్వర్గానికి ఆహ్వానిస్తున్నట్లు చెక్కబడింది.

బసినికొండలోని వైదుంబ మహారాజు గండత్రినేత్రుని పాలనలో, బాణరాజు సోరముడి కోటపై దాడిచేసి నొలంబరాజులైన నొలంబ, దాడిగ, రాచమల్లు, మయిందాడిలతో పోరాడి అసువులు బాసిని చాలుచ్చేరణి కుమారుడైన రక్కనమనుజర దేవేడు, ఇంకా మరువక, సూరమార్పళి అనే సైనికులు మరణించారని చెప్పబడింది.

వెలగల్లులోని వైదుంబరాజైన గండత్రినేత్ర, రేనాడు- 7000 ను పాలిస్తున్నపుడు వేసిన శాసనంలో రాజు వీరుడైన నొలంబ రాజు సైనికుడు చాంతమాన దాడిని చంపుచుండగా చూచిన కోరదేశిగంబు, గండత్రినేత్రుని దండనాయకులపై పోరాడాడనీ, చాంతమానదాడి బహు పరాక్రమవంతుడనీ, అతను యుద్ధంలో చనిపోగా, అతని కుటుంబ పోషణ నిమిత్తం, కోరదేశిగంబ కొంత ఆదాయాన్ని దానం చేశాడనీ, ఈ శాసనాన్ని శ్రీకంఠదేవాచార్య అనే శిల్పి చెక్కాడనీ చెప్పబడింది.

చిత్తూరు జిల్లా చోళుల పాలనలో కూడా ఉన్నట్లు రాజేంద్ర, పుణ్యకుమార, విజయరాజేంద్రుల శాసనాలను బట్టి తెలుస్తుంది. పుంగనూరు తాలూకా కర్శనపల్లిలోని రాజేంద్ర చోళుని శాసనంలో ముత్తుకూరుకు చెందిన కిత్తియగావుండ కూతురు నడులబ్బె చనిపోయినట్లు చెప్పబడింది.

మదనపల్లి తాలూకా చిప్పిలిలోని క్రీ.శ 8వ శతాబ్దానికి చెందిన శాసనంలో పుర్యోకొమరాన్, చిర్పుళి నుంచి పాలిస్తున్నపుడు, ఇందిరన్‌తో జరిగిన యుద్ధంలో పరశు రామన్ అనే వీరుడు మరణించినట్లు చెప్పబడింది. ఈ శాసనంలో పంపనికి పూర్వపు కన్నడ భాషను కలిగి వుంది. పెద్దతిప్ప సముద్రంలోని యెనుగురతిమడిలోని పాత శివాలయంలో గల క్రీ.శ. 1057-58 నాటి చోళరాజు కొప్పర కేసరి పొన్మర్ విజయరాజేంద్ర చోళ దేవుని శాసనంలో మదంబూరు-12 చెందిన చంపూరుకు చెందిన కోవరమరసుని కొడుకు బమ్మరస, ఒక యుద్ధంలో పెద్దసైన్యాన్ని ఎదుర్కొని మరణించి స్వర్గస్థుడైనాడని చెప్పబడింది.

చిత్తూరు జిల్లాలో నొలంబపల్లవుల శాసనాలు మూడు లభించాయి. వీటిని నొలంబరాజులైన నొలంబాదియరస, రెండో వీరమహేంద్ర, ఇరువనొలంబ ఘటెయంకకర పల్లవాదిత్యుల కాలానికి చెందిన ఒకొక్క శాసనముంది. కలకత్తూరు శాసనంలో గంగవాడి- 6000 ను పాలిస్తున్న నొలంబ పల్లవ రాజైన నొలంబాదియరస,

తలక్కాడు పైకి దాడికి వెళ్లాడని, ఆ సందర్భంగా, గంగరాజైన పెర్మానడి ఆజ్ఞలపై ఒకరాజు పులినాడుపై దాడిచేశాడనీ, కాడువెట్టి, మృదువ అనే వ్యక్తులు పెర్మావి అనే గ్రామాన్ని తగుల బెట్టారనీ, ఇది తెలిసిన వీరచూడామణి అనే బాణరాజు యుద్ధరంగంలోకి దూకి, తేజామణి అనే సైనికుడిని వధించాడనీ, వీరోచితంగా పోరాడిన తేజామణికి గౌరవంగా, ఎలెమండల అనే కల్నాడును అతని కుటుంబానికి దానం చేసినట్లుగా చెప్పబడింది. దీనివల్ల, నొలంబ పల్లవులకు, బాణ రాజులకు, గంగరాజులకు తరచూ యుద్ధాలు జరిగేవని తెలుస్తోంది. కర్ణనపల్లిలోని వీరమహేంద్రుని శాసనం, నొళంబ పల్లవరాజులైన ఇరివనొలంబ, నన్ని నొలంబ, పొలాల్ చోరదేవ, రెండో వీరమహేంద్రుల వంశ వృక్షాన్ని అందిస్తోంది. ఇంకా అందులో, వీరమహేంద్రుడు, చోళనాడు నుంచి నొళంబవాడికి ప్రయాణమై కోళాళలో విడిదిచేసినపుడు, కీర్తిగాముండుని కొడుకు, నొలంబాగావుండకు పులనొట్టకెరెలోని బెలగటూరును దానం చేసినట్లుగా చెప్పబడింది. నేలపల్లిలోని నొలంబరాజైన ఇరివనొళంబ ఘుటెయంకకార పల్లవాదిత్యుని కాలపు శాసనంలో బళెగారుడైన, హరపల్లెయ్య గవరశెట్టి కొడుకు, కరవయ్యకు, ఛత్రము, గుర్రపుస్వారీ లాంఛనాలను ప్రసాదించాడని చెప్పబడింది. ఈ శాసనాన్ని చండిమయ్య అనే శిల్పి చెక్కాడు.

**చిత్తూరు జిల్లాలో శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1512, ఆగస్టు 7వ తేదీ నుంచి క్రీ.శ. 1521, ఫిబ్రవరి 17వ తేదీ మధ్య విడుదల చేసిన 21 కన్నడ శాసనాలు ఉన్నాయి.**


జిల్లాలో విజయనగర ప్రభువులైన రెండో బుక్కరాయలు, మొదటి దేవరాయలు, రెండో (ప్రౌఢ) దేవరాయలు, సాళువ నరసింగరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుత దేవరాయలి కన్నడ శాసనాలు మొత్తం 27 దొరకగా, వాటిలో శ్రీకృష్ణదేవరాయలి శాసనాలు 21 ఉండటం గమనార్హం. క్రీ.శ. 1405 మే, 20వ తేదీ నాటి రెండో బుక్క రాయలి మూగవాడి శాసనంలో, బొమ్మన ఒడెయ ఆజ్ఞలపై, మూగవాడి యపురంలోని నయనార దేవునికి కొంత భూమిని దానం చేసినట్లుగా వుంది. తంబళ్ళపల్లిలోని మొదటి దేవరాయలి క్రీ.శ. 1405, మే 29 వ తేదీ నాటి శాసనంలో, శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవునికి 25 వరహాలను చంద్రగిరిలోని మల్లికార్జున స్వామికి బహూకరించి నట్లుగా ఉంది. ఇంతకు ముందు కంపణఒడెయ, బుక్కనఒడెయ, చిక్కొడెయల కాలంలో ఉన్నట్లుగానే ఈ కానిక క్రీ.శ. 1404, అక్టోబర్ 5 నుంచి అమలులోనే వుందని, దీన్ని ఆలయ స్థానాధిపతులు సమానంగా పంచుకోవాలని ఉంది. తిరుమలలోని క్రీ.శ. 1429, డిసెంబర్ 5వ తేదీ నాటి శాసనములో (ప్రౌఢ) ప్రతాప దేవరాయలు విక్రమాదిత్య మంగళ, యెళమండి, విద్దలె గ్రామం నుంచి వచ్చిన 2200 హన్ను వరాహాలను తిరుమల దేవునికి బహూకరించినట్లు చెప్పబడింది. తిరుపతిలోని గోవిందరాజస్వామి (మధ్య) దేవాలయ ఉత్తర గోడపైనున్న శాసనంలో సాలువ మహామండలేశ్వర నరసింగయ్య మహా అరుసు, గోవిందరాజ పెరుమాల్ దేవాలయంలో, తిరుమలలోని తిరు వెంగళనాధుని ఆలయంలో మాదిరిగానే అర్చనలు జరగాలని గోవిందరాజ సన్నిధిలోని శ్రీవైష్ణవులకు, తాను కట్టిచ్చిన రామానుజ కూటంలోనూ కరిదాళ్ రామారుజయ్య ఆయన శిష్యుల పర్యవేక్షణలో ప్రసాదాల పంపిణీ జరగాలనీ పేర్కొన్నాడు.

చిత్తూరు జిల్లాలో శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1512, ఆగస్టు 7వ తేదీ నుంచి క్రీ.శ. 1521, ఫిబ్రవరి 17వ తేదీ మధ్య విడుదల చేసిన 21 కన్నడ శాసనాలు ఉన్నాయి. క్రీ.శ. 1512, ఆగస్టు 7వ తేదీ నుండి తిరుమల శాసనంలో, కృష్ణదేవరాయల ద్వారపాలకులైన బాగిలి అవసరద నరసయ్య, అవసరద తిమ్మయ్యలు తమ తల్లి బసవమ్మతో కలిసి దేవునికి సాష్టాంగ దండ ప్రామాణాలను అర్పించినట్లు చెప్పబడింది. క్రీ.శ. 1513, ఫిబ్రవరి 10వ తేదీన శ్రీకృష్ణదేవరాయలు, కాళహస్తీశ్వరునికి ముత్యాల హారం, వజ్రాల హారం, రత్న రచిత బంగారు గిన్నె బహూకరించినట్లు చెప్పబడింది. తిరుమలలోని క్రీ.శ. 1513, ఫిబ్రవరి 10వ తేదీన తిరుమలకు మొదటిసారిగా వచ్చిన సందర్భంగా దేవునికి నవరత్న ఖచిత కిరీటాన్ని, మరికొన్ని బహుమతులను అందించినట్లు చెప్పబడింది. ఇదే తేదీన కృష్ణరాయని భార్య తిరుమలదేవి అమ్మ, దేవునికి రాత్రిపూట పాలు సమర్పించటానికి, బంగారుగిన్నె, బంగారు పళ్ళాన్ని బహూకరించింది. అదేరోజు కృష్ణరాయుని భార్య చిన్నాజి అమ్మ దేవునికి ఒక బంగారు గిన్నెను సమర్పించింది. ఈ కానుకకు సంబంధించి, తమిళ, తెలుగు, సంస్కృత, కన్నడ భాషల్లోని 20 శాసనాల్లో చెప్పబడింది. తిరుమలలోని క్రీ.శ. 1513, మే 2వ తేదీన

## కవిత

# విధ్వంసక దృశ్యం...

- నీలం వెంకటేశ్వర్లు
9502411149



రైతుకు భూమంటే ప్రేమ
రైతుకు పంటంటే ప్రేమ
రైతుకు అన్నం పెట్టటమంటే ప్రేమ
కాని చావుకు రైతంటే ప్రేమ
ఆత్మహత్యలు చూస్తున్న పాలకులకు
రైతుల చావంటే ప్రేమ..!?
మట్టితో మమేకమై
ఆ మట్టిలో విత్తిన విత్తనం
రైతు గుండెలో కోటి ఆశలుగా మొలకెత్తితే
సీమపై సీతకన్ను వేసిన వానదేవుడు
రాళ్ళమాటున మొహం చాటేసి
సరాసరి రైతు కళ్ళల్లో పడ్డాడు
అయినా... ఆశ వదలని విక్రమార్కుడు
నరాలన్నీ పైపులుగా కూర్చి
రక్తాన్నంతా డీజల్ గా పోసి
నీరుకట్టి పంట పండిస్తే
మార్కెట్ శక్తుల మాయజాలంతో
సర్వసంపదల సృష్టికర్తకు
అప్పులే దిగుబడులయ్యాయి
అప్పులిచ్చినోళ్ళు నక్షత్రకులై
వెంటాడుతుంటే
రైతుల బతుకులు పొలంలోనే
పొద్దుగూకుతున్నాయి
ఈనాడు... సీమ ప్రాజెక్టులు
మాటల మాంత్రికుల
నీటి మూటలతో నిండిపోయి
రాళ్ళుగా ప్రవహిస్తుంటే
దిగులుపడిన రైతుకేదీ దన్ను?
సీమరైతుల దీనవదనాలు
ఛిద్రమైనబతుకులు
కన్నీటినయనాలు
పాలకులకు పట్టవా?
ప్రకృతి వైపరీత్యాలు కరువులు
కల్తీమందులు కల్తీవిత్తనాలు
బోరుబావులు విద్యుత్ ఘాతాలు
ఇలా ఎన్నాళ్ళు... ఇంకెన్నేళ్ళు
రాయలసీమ రైతు ఇంట
చావుడప్పులు
పాలకులు పన్నిన
వలలో చిక్కిన రైతన్న
జాగ్రత్త!
ఇప్పుడు
రైతంటే ప్రాణాలు తీసుకునే
పిరికివాడు కాక
పోరాడే వీరుడు కావాలి ❋

---

ఒంటరిగా తిరుమల వచ్చిన కృష్ణదేవరాయలు దేవునికి అనేక ఆభరణాలు, ఉత్సవ విగ్రహాలకు 3 కిరీటాలను బహూకరించినట్లు అక్కడే వున్న మరో శాసనంలో చెప్పబడింది. తిరుమలలోని క్రీ.శ. 1514 నాటి శాసనంలో కృష్ణదేవరాయలు, ప్రతాపరుద్ర గణపతిని ఓడించి ఉదయగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకుని తిరువెంగళనాథుని దర్శించినపుడు, అతని భార్య చిన్నాదేవి, ఆలయంలోని బ్రాహ్మణులకు, సత్రంలోని యాత్రికులకు భోజన వసతికోసం, దేవుని కైంకర్యాల కోసం తొండమండలంలోని ముడియారును, కొన్ని ఆభరణాలను బహూకరించింది. క్రీ.శ. 1514, జూలై 6 నాటి మరో తిరుమల శాసనంలో, కృష్ణదేవరాయలు కళింగ దండయాత్ర నుంచి విజయనగరానికి తిరిగి వెళ్తూ తిరుమలలోని శ్రీవారి ఆలయాన్ని సందర్శించి (ఇది నాలుగోసారి), దేవునికి 30,000 ద్వారా వరహారంతో దేవునికి కనకాభిషేకం చేయించినట్లు, దేవుని కైంకర్యాల కోసం, తాళపాక గ్రామాన్ని దానం చేసినట్లు చెప్పబడింది. క్రీ.శ. 1515, అక్టోబర్ 25 నాటి తిరుమల శాసనంలో కృష్ణరాయలు ఐదవసారి తిరుమలలో సందర్శించి దేవునికి నవరత్న ఖచిత ప్రభావళిని సమర్పించినట్లు పేర్కొనబడింది. తిరుమలలోని క్రీ.శ. 1521 ఫిబ్రవరి 17వ తేదీ శాసనాలలో కృష్ణదేవరాయలు 7వ సారి తిరుమల సందర్శించాడని, ఆ సందర్భంగా ఆయన భార్య తిరుమల దేవమ్మ అనేక కానుకలు ఇచ్చినట్లు చెప్పబడింది. తిరుపతిలోని కపిలతీర్థంలోని క్రీ.శ. 1531వ సంవత్సరం జూన్ 25 తేదీ నాటి శాసనంలో అచ్యుతరాయ మహారాయలు, చక్రతీర్థం దగ్గర, మెట్లను, సంధ్యావందన మండపాన్ని, సుదర్శన శాలను కట్టించాడని చెప్పబడింది. చిత్తూరు జిల్లాలోని విజయనగర శాసస్థ విషయాలు అక్కడక్కడా ప్రస్తావించబడినాయి గానీ, బాణ, వైదుంబ, నొలంబ పల్లవుల శాసనాల్లోని విషయాలు మరుగునపడి ఉన్నాయి. ఇప్పటికైనా ఇవి తెలుగు అకాడెమీ పుస్తకాల్లోకి ఎక్కాల్సిన అవసరముంది.

❋

## కవిత

# మాన వస్త్రం

- అశోక్ అవారి
9000576581




మానవత్వం జాడలేని
మరయంత్రాలకు..
మాన వస్త్రం నేసి కప్పుతావు.
అమ్మతనానికేమో..
అగ్గి పెట్టెంత చీర అల్లుతావు.
వృద్ధులకేమో..
తల రుమాలై తళుక్కుమంటావు.
మృత్యువులోనూ..
ముఖ వస్త్రమై తోడు వెళతావు.

తరతరాలుగా కష్టాల తెరలకు
కన్నీళ్ళ చారలకు మాత్రం
పరిష్కార వస్త్రాన్ని నేసుకోలేవు.
రంగులద్దడంలో..
కళా ప్రావీణ్యం కుండపోతగా వున్నా
బతుకు 'కల' తప్పిన కళాకారుడవు.

సాంకేతికానికే సవాలు విసిరే..
అగ్గిపెట్టెంత అనుంగు
చీర నేసిన అమర గిజిగాడివి.
ఇక్కడిప్పుడు..
నైపుణ్యాలకు గుర్తింపు లేదు నేతకాడా!
తమకు తామే దండోరా వేసుకోవాలి
నీ హృదయ ఘర్షణకు..
ఇక లౌఖ్య ఇంధనం వేయడం నేర్చుకో.
ఈ అలల సమాజంలో..
అన్నీ అసమాన శృంగాలూ, ద్రోణులే.
కూసింత గ్లోబలైజేషన్ రంగులు పూసుకో.

ఉరి తాడునూ..
కూరిమితో నేర్పుగా పేనుకుంటున్నావు.
ఉరి కంబాన్నీ..
ఉద్వేగంతో ఉయ్యాల చేసి ఊగుతున్నావు.
బతుకు తాడును..
పేనుకునుడు మర్చి పోయావెందుకో ?
నీవు , నీకళ రెండూ బతకాలి వెతకాడా !

నాయకులకు చేనేత బట్టలు
ఓట్లలా ఎంతో అపురూపమైనవే..
ఎప్పుడో ఒకప్పుడు జరిగే
చేనేత వారోత్సవాలప్పుడూ.
భుజాలపై పార్టీ జెండాలై
ఐదేండ్లకోసారి నేతన్నను
వాగ్దాన ఆకాశంలో విహరింపజేసి...
చేనేత వ్రతాల ప్రసాదాలు పంచుతాయి.
పల్లకీ బోయిలై నేతపాటలు పాడతాయి.

అధికార అహం అందలమెక్కితే..
తాము కూసున్న సీట్ల మీద
మెత్తని 'టర్కీ' టవల్లు మొలుస్తుంటయ్ .
నీవు నేసిన అప్రియ వస్త్రాలు
తుడుపు గుడ్డలా మూలపడుతుంటయ్ .
విదేశీ టూర్లకైతే హంగుల..
సూటు బూట్లు దర్జాగా దిగుమతైపోతయ్ .
దేశమంతా 'నేత'మయం కావాలంటే..
మరో సహాయ నిరాకరణమే అక్కర్లేదు
ప్రతి హృదయంలో..
కాసింత చేనేత సంస్కారముంటే
చాలేమో !

గూగుల్ సెర్చ్ లో రహస్యంగా..
అందాల ఏరోబిక్ భామల
అంగాంగ పరిశోధనకు ఉపక్రమిస్తావు.
పక్కనున్న నేత కార్మికుడు
మాత్రం మన పైత్యానికెప్పుడూ అన్నోన్ సబ్జెక్టే.

యాంత్రీకరణ భూతం కోరలు
నాగరిక జనుల నవ నాడులు
నైలాన్స్, రేయాన్స్, బుష్ కోట్లూ,
పాలిస్టరంటూ పరకాయం చేసినా..
నీ చేతి నైపుణ్యం చక్కదనాన్ని
నీ కర లాలిత్యం చిక్కదనాన్ని
మా 'నవ'శరీరాల పై..
మాన వస్త్రంగా కప్పుకుంటాము.
మాన్య వస్త్రంగా కప్పుతుంటాము.

కథ

# ప్రత్యుపకారం

- పాలకొల్లు రామలింగస్వామి రాజు
9441416049



**"శి**రీ...డబ్బులేవైనా కావాలా?" అనడిగాను మా పాప శిరీషనుద్దేశించి. ప్రశ్ననైతే వేశాను కాని నా ప్రశ్న నాకే హాస్యాస్పదంగా అనిపించింది. ఎందుకంటే పుస్తకాలకనీ, బోధనా రుసుముకని, నిర్వహణ వ్యయాలకనీ, లక్షలాది రూపాయల్ని తల్లిదండ్రుల దగ్గర్నుంచి వసూలు చేసే ఓ కార్పోరేటు సంస్థ వసతి గృహ ప్రాంగణంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోన్న ఒక చురుకైన అమ్మాయిని అడగవలసిన ప్రశ్నేనా యిది..!?

ఆడపిల్లలు పెట్టుకునే బొట్టు బిళ్లల దగ్గర్నుంచి తగిలించుకునే బేగ్‌ల వరకు సమస్తమూ దొరికే ఓ చిన్నసైజు సూపర్ మార్కెట్టే లోపల ఉంటుంది. అలాంటిది శిరీషకు ఏదైనా కొనుక్కోవాలనీ, తినాలనీ ఉండదా? అంచేత నాలిక్కరుచుకుని ఈసారి ప్రశ్న స్వరూపాన్ని మార్చి అడిగాను. "మీకు ఎంత నచ్చితే అంత ఇవ్వండి.. చాలు" అంది శిరీష.

జేబులోని పర్సును తీసి దాన్లోంచి ఐదువందల రూపాయల నోటుని తీసి పాపకిచ్చాను. "నోటు వద్దు డాడీ.. ఇక్కడ మార్చడం కష్టం.." అంది శిరీష.

వెంటనే నాలుగు వందల రూపాయలు విడివిడిగా, ఒక ఏభై, పది రూపాయల నోట్లు ఐదు కలిపి తీసిచ్చాను. శిరీష వాటినందుకుని తన పర్సులో పెట్టుకుంది. కళాశాలలోని మిగతా అమ్మాయిలు తమతమ బంధుగణంతో కలసి ఒక్కొరొక్కరుగా వచ్చి రుసుముల్ని కట్టి తమ గదుల్లోకి లగేజీలతో వచ్చి చేరుతున్నారు.

సాయంత్రం నాలుగవుతోంది.

"నాకు ట్రైన్ టైమవుతోందమ్మా. వస్తాను. ఆరోగ్యం జాగ్రత్త. బాగా చదువమ్మా." శిరీష తలమీద చేయివేస్తూ జాగ్రత్తలెన్నో చెప్పాను. అన్నింటికి బుద్ధిగా తలూపిందామె. పాపకు వీడ్కోలు చెప్పి అక్కడ్నుంచి బయటపడి రోడ్డెక్కాను.

ఫిబ్రవరి నెల మాసాంతం. ముదిరే ఎండలతో వేసవి ప్రవేశిస్తున్న కాలం.. మధురవాడ బస్టాప్‌లో బస్సెక్కి సుమారు నలభై నిమిషాలు ప్రయాణంతో స్టేషనుకు చేరుకున్నాను. కౌంటరు దగ్గరకు వెళ్లి పార్వతీపురం స్టేషనుకు టిక్కెట్ తీసుకోవడంతో నా దగ్గర మిగిలిన చిల్లర నోట్లన్నీ అయిపోయాయి. కేవలం ఐదు వందల నోట్లే ఉన్నాయి. విశాఖపట్నం-రాయఘడ పాసింజరు రైలు అప్పటికే 7వ నెంబరు ప్లాట్‌ఫామ్‌పై మరో పావుగంటలో బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. ప్రయాణ ప్రకటన మూడు భాషలలో అదే పనిగా వినపడుతోంది.



బోగీల్లోపలా, బయటా నిండిన జనంతో ఆరో నెంబర్ ప్లాట్‌పామ్ జన సందోహంతో నిండిన జాతరను తలపిస్తోంది. నేనోసీటుని వెతుక్కుని కూర్చున్నాను. కిటికీ పక్కసీటు. బయల్దేరడానికి సమయం ఉండటంతో కాఫీ తాగాలనిపించింది. పక్కనున్న ఆసామికి నా సీటును చూడమని చెప్పి దానిపై రుమాలు వేసి కిందకు దిగాను. ప్లాట్‌ఫామ్ పైనున్న ఓ షాపు దగ్గరికి వెళ్లాను. "వాటర్ బాటిల్ ఒకటి కాఫీ ఒకటి ఇవ్వండి." పర్సులోంచి ఐదువందల రూపాయల నోటుని తీసి షాపతనికి అందిస్తూ అన్నాను. "చిల్లర లేద్సార్" అన్నాడతను చేతిలోని నోటుని చూస్తూ.

"పోని బిస్కెట్ పేకెట్ కూడా ఇవ్వండి" అన్నాను. దానికి కూడా అతను లేదని చెప్పడంతో ఏం చెయ్యాలో తోచలేదు. వెనుదిరిగాను. నాకైతే కాఫీ సేవనం కన్నా జలస్వీకరణం అవసరమనిపించడంతో ఎవరైనా పరిచితులు కనిపిస్తారేమోనని అటూ ఇటూ రెండేసి బోగీలు దాటి చూసాను. అంతంత పరిచయం మాత్రమే ఉన్న మా పక్క ఊరు కొండలరావు కనిపించాడు. ఐదువందల నోటుకి చిల్లర కావాలని అడిగాను. లేదని చెప్పాడతను.

"పోనీ.. ఒక్క ఏభై రూపాయలైనా అప్పు ఇవ్వండి." అడిగాను సిగ్గు విడిచి "నా దగ్గర ఏభైలు లేవండి" నా వైపు అదోలా చూస్తూ అన్నాడు. అతని మాటలోని భావం అర్థమై వెనక్కి వచ్చి సీట్లో కూలబడ్డాను.

బోగిలోని ఒకరిద్దరి దగ్గర ఐదువందల నోటుకి చిల్లరడిగాను. ఎవరి దగ్గరా ఉందని సమాధానం రాలేదు. నెలకి నలభై వేల జీతం పుచ్చుకునే ఓ ప్రభుత్వ ఉద్యోగినైన నాకిది చిన్నతనంగా అనిపించింది. అసహనంగా మళ్లీ కిందకు దిగాను కనీసం ప్లాట్‌ఫాం పైనున్న కుళాయి నీళ్లయినా సరే తాగి దాహం తీర్చుకుందామని నిర్ణయించుకుని అటువైపు రెండడుగులు ఇలా వేశానో.. లేదో బండి పెద్దపెట్టున కూత వేసింది. బండి నెమ్మదిగా ముందుకు కదులుతోంది. ఒక్కసారి పరుగు లంకించుకుని బోగి ఎక్కి సీట్లో కూలబడ్డాను.

రమారమి నూట ఏభై కిలోమీటర్లు దూరంలో ఉన్న పార్వతీపురానికి ఇక్కడి నుంచి సుమారు మూడు గంటలు ప్రయాణం. బండి వేగంగా పోతోంది. ప్రయాణీకులంతా ఎవరి లోకంలోకి వాళ్లు నెమ్మదిగా జారుకుంటున్నారు. కొంతమంది లోకాభిరామాయణం ముచ్చటించుకుంటూ మరికొంతమంది నిద్రలోకి జారుకుంటూ! నోట్లో ఊరుతోన్న తడిని కొద్దికొద్దిగా దిగమింగుతూ దప్పికను దూరం చేసుకుంటున్నాను. ఎదురుగా ఉన్న వ్యక్తి దగ్గర నీళ్లసీసా ఒకటి అతని పక్కనే కనిపించసాగింది.

ఎలాగైనా అతన్ని అభ్యర్థించి నీళ్లు తాగుదామని తీర్మానించుకున్నాను. నేను నోరు విప్పి అడిగేంతలో అతను సీసా మూత విప్పి పెదాలకు తగిలించుకుని మరీ నీళ్లు తాగడం పూర్తి చేశాడు. మరిక అడగలేకపోయాను.

'ఇంతవరకు సరే.. ఒక వేళ హఠాత్తుగా ఎక్కిళ్లు వస్తే ఏంటి పరిస్థితి?' ఆ ఆలోచన రాగానే నాలో కొంత కంగారు మొదలైంది. ఇలాంటి ప్రయాణాలలో సాధారణంగా ఇంటి దగ్గర్నుంచి నీళ్ల సీసా తెచ్చుకునే నేను ఈసారి తెచ్చుకోనందుకు తొలిసారిగా నన్ను నేను నిందించుకున్నాను. 'తర్వాత వచ్చే స్టేషను విజయనగరం. అక్కడెలాగూ పది నిముషాలు ఆపుతాడు. అప్పుడు కిందకు దిగి ఏదో ఒక విధంగా అవసరం తీర్చుకోవచ్చులే.." నా మనసు నేను సర్ది చెప్పుకున్నాను. ఇంతలో ఛాయ్, సమోసావాలాలు బండి లోపలకు రావడమూ, వాళ్ల దగ్గరా చిల్లర అడిగి భంగపడటమూ వరుసగా జరిగిపోయాయి.


'మనం సంపాదించిన నోట్లకట్లెన్ని ఉన్నా అవి ఒక్కోసారి మన పాట్లుని తీర్చలేవు సరికదా మనల్ని ఆపదల నుంచి కూడా గట్టెక్కించలేవు నాయనా.. అప్పుడు మనల్ని కాపాడేది మనం సంపాదించిన మంచితనమే. మనిషిలోని మానవత్వమే అందుకే మంచిని మించిన సదాచారం గాని మానవతను మించిన సన్మార్గం గాని లేవన్నారు పెద్దలు.. ఎక్కడో.. ఎప్పుడో. ఎవరో పెద్దాయన సభలో అన్నమాటలు గుర్తొచ్చి విరక్తిగా నవ్వాను. గంటయ్యింది. నా దాహస్థితి ఇంకా నా అదుపులోనే ఉంది. విజయనగరం స్టేషను వచ్చింది. బండి నెమ్మదిగా ఫ్లాట్‌ఫామ్‌ను అనుసరిస్తూ పోతోంది. బండి ఎక్కేందుకు సిద్ధమవుతున్న ప్రయాణీకులు బయటా, దిగేందుకు సమాయత్తమవుతోన్న ప్రయాణీకులతో లోపలా అంతా గోలగోలగా, గందరగోళంగా ఉంది. బండాగింది. పోలోమని జనం బోగి తలుపు దగ్గర గుమిగూడేరు "సార్.. సీటుంచండి సార్" బయట నిలబడ్డ ఎవరో పొట్టి వ్యక్తి కిటికీలోంచి నాకు

## కవిత

# స్త్రీ

- ఎస్. ముర్తుజా
9985543523

త్యాగం తొలిమి తెగువ
తన సొంతం
సహనం సౌజన్యం సౌందర్యం
సహజాభరణం.
ఐనవారిని వొదిలి
ముక్కూ మొగం తెలియని వాడైనా కదిలి
మెట్టినిల్లే పుట్టినిల్లై మిగిలి
ప్రాణాలకైనా తెగించి
పెనిమిటి శ్రేయస్సుకై అహరహం తపించి
బడలక
ఎడయక



ఒడలొంచి శ్రమించి
కడలి వంటి సంసారంలో
సారమున్నంత మేర సారం నింపి
వంశోద్ధరణకు
జగదోద్ధరణకు
జీవన రణం సలుపుతున్న
స్త్రీ మూర్తికి
స్నేహైక దీప్తికి
ఏమిచ్చి రుణం తీర్చుకోగలం?
ఎలా తనను సేవించుకోగలం?

హాలా హలం మ్రింగుతూ
అమృతాన్ని పంచే అతిలోక శక్తి స్త్రీ
అనంత కీర్తి స్త్రీ
నిగ్రహానుగ్రహ ధరిత్రి
నిర్మలానంద చరిత్రి స్త్రీ
మంగళ గాత్రి మహాస్ఫూర్తి
దయామయ నేత్ర స్త్రీ
నిత్య సంవర్తి సమవర్తి స్త్రీ
అందుకే నేనంటాను
తనకు తానే సాటి
ఏ లోకంలోను లేదు తనకు పోటీ
తనకన్న మేటి ❋

---

రుమాల్ని అందిస్తూ బతిమాలేడు. అతన్ని చూశాక చప్పున నాకో ఆలోచన తట్టింది. అతని రుమాల్ని అందుకున్నాను.

"సరేనయ్యా.. సీటుంచుతాను. కానీ నాకో వాటర్‌బాటిల్ కొని తేగలవా.. ప్లీజ్" అన్నాను. అనడమే తరువాయి ఆ పొట్టి వ్యక్తి అక్కడ్నుంచి సరేనని వెనుదిరగడం అతని రుమాలును నా పక్కనున్న ఖాళీ సీటుపై వేయడం జరిగిపోయాయి బోగిలోపలకు వస్తోన్న జనం సీట్లకోసం అటూ, ఇటూ ఆదరాబాదరగా తిరుగుతున్నారు.

"సార్.. సీటుందా?" ఎవరిదో తెలిసిన గొంతులా అనిపించడంతో తలెత్తి చూశాను. ఎదురుగా బ్యాంకు ఆఫీసరు. నా వ్యక్తిగత రుణం కోసం గత పదిరోజులు నుంచి నన్ను బ్యాంకు చుట్టూ తిప్పిస్తూ రకరకాల కొర్రీలతో విసిగిస్తోన్న అధికారి. నా పంట పండింది. అతన్ని ప్రసన్నం చేసుకోవడానికిదే సరైన సమయం వదులుకోకూడదు.

"రండి సార్ కూర్చోండి.." అంతవరకు సీటుపై నేనుంచిన రుమాల్ని ఎదురు సీట్లోకి విసిరేసి.. నవ్వుతూ అధికారిని ఆహ్వానించాను. అక్కడప్పటికే రుమాలొకటి కనిపించినా కనపడనట్టే ఊరుకున్నాను. "థ్యాంక్స్ సార్" అధికారి నవ్వుతూ కూర్చున్నాడు. అతన్ని మెల్లగా మాటల్లోకి దించాను.


"ఇదిగోండి సార్.. వాటర్ బాటిల్.. నా సీటేది?" ఎట్నుంచి వచ్చాడోగాని ఇందాకటి పొట్టి వ్యక్తి నా ముందుకు వచ్చి అడిగాడు. "అదిగోండి సార్.. ఎదురు సీట్లో మీ రుమాలు వేశాను. వెళ్లి కూర్చోండి." అన్నాను. అతనందించిన నీళ్లసీసాను ఆత్రంగా అందుకుని మూతతీసి గటగటా నీళ్లు త్రాగేశాను. సంతృప్తిగా 'బ్రేవ్'మని తేల్చి 'హమ్మయ్య' అని స్వగతంలో అనుకున్నాను. ఇంచుమించుగా ఖాళీ అయిన సీసాను నా పక్కనే పెట్టి చూసేసరికి ఎదురుసీటు కోసం 'నాదంటే.. నాది' అంటూ ఇద్దరు వ్యక్తులు వాదించుకోవడం కనిపించింది. అందులో ఒకతను నాకు నీళ్ళ సీసాను తెచ్చిచ్చిన పొట్టి వ్యక్తి. అయినా సరే.. నా కదేది సంబంధం లేదన్నట్టుగా అధికారితో సంభాషణను కొనసాగించడంలో నిమగ్నమైపోయాను.

"ఏంటి సార్ ఇది? రుమాల్ని ఖాళీ సీట్లో వేశారా?.. రుమాలు ఉన్న సీట్లో వేశారా ముందు చెప్పండి.." నా వైపు తీక్షణంగా చూస్తూ అడిగాడు పొట్టి వ్యక్తి.

"ఏమోనండి.. అవేవి తెలీదు. మీరు వేయమన్నారు వేశాను అంతే." చిరాగ్గా జవాబివ్వడంతో అతను మరేం మాట్లాడలేదు. వాదన ముగిసింది. పొట్టి వ్యక్తి వెనక్కి తగ్గాడు. మౌనంగా నిలబడి ఉండిపోయాడు. నా కెందుకో నా వ్యవహారశైలి తప్పనిపించింది. నాలో అపరాధభావం మొలకెత్తింది. వెంటనే అధికారినడిగి అతని దగ్గర ఇరవై రూపాయలు అప్పుతీసుకున్నాను. సీట్లోంచి లేచి నిలబడి ఆ పొట్టి వ్యక్తి దగ్గరికి వెళ్లాను.

"చాలా థాంక్సండి. కూర్చోండి సార్ నా సీట్లో.. ఏం పర్వాలేదు." ఇరవై రూపాయల్ని అతనికిస్తూ స్థిరంగా అన్నాను. అతను వెళ్లి నేను ఖాళీ చేసిన సీట్లో కూర్చున్న తర్వాత గాని నా మనసు కుదుట పడలేదు.

❋




# అభివృద్ధి పేరుతో కల్లోలం

**- వాడ్రేవు వీరలక్ష్మీదేవి.**

*కడలిని నమ్ముకున్న బడుగు జీవితాల కల్లోలం. అభివృద్ధి పేరుతో వారు తమ ఉనికినే కోల్పోయేలాంటి కల్లోలం. ఆ కల్లోలాన్ని పలు కోణాల్లో ప్రత్యక్షంగా చూసి నవలారూపంలోకి అనువదించిన కార్యకర్త, సాహిత్యాభిమాని, సాహిత్య ప్రచారకుడు 'గనారా'గా ప్రసిద్ధుడయిన గదుల నాగేశ్వరావు. తూర్పుగోదావరి జిల్లాలోని ఒక మత్స్యకార గ్రామంలోని యధార్థ కథే ఇందులో ప్రత్యక్షమవుతుంది.*

కడలి కల్లోలం కడలిని నమ్ముకున్న బడుగు జీవితాల కల్లోలం. అభివృద్ధి పేరుతో వారు తమ ఉనికినే కోల్పోయేలాంటి కల్లోలం. ఆ కల్లోలాన్ని పలు కోణాల్లో ప్రత్యక్షంగా చూసి నవలారూపంలోకి అనువదించిన కార్యకర్త, సాహిత్యాభిమాని, సాహిత్య ప్రచారకుడు 'గనారా'గా ప్రసిద్ధుడయిన గదుల నాగేశ్వరావు. తూర్పుగోదావరి జిల్లాలోని ఒక మత్స్యకార గ్రామంలోని యధార్థ కథే ఇందులో ప్రత్యక్షమవుతుంది.

సి.పి.ఐ (ఎం) పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నిర్వహించిన నవలల పోటీలో పాల్గొన్న 31 నవలలో ఈ నవల మూడో స్థానం లో నిలిచింది. కానీ ప్రథమ స్థానంలో నిలవగలడానికి ఏమీ తీసిపోదు.

భైరవ లంక అనే మత్స్యకార గ్రామన్ని నమ్ముకుని ఎన్నో మత్స్యకార కుటుంబాలున్నాయి. వారు ప్రధానంగా చేపలు పట్టి అమ్ముకునే జీవిస్తారు. ఆ ప్రాంతంలో సముద్రంలో ఆయిల్ నిక్షేపాలుండడంతో విదేశీ కంపెనీ కన్ను వాటి మీద పడింది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండదండలు మామూలుగానే పుష్కలంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో భైరవ లంక చుట్టు పక్కల ఎన్నో ఎకరాల భూమి ఇందుకోసం అవసరమయింది. జమీందార్ల పేరుతో ఉన్నది, దానిని చేర్చి ఉన్నది కలిపి మొత్తం 500 ఎకరాలకు జగన్నాథం అనే లోకల్ ఎంఎల్ఏ పేరుతో పట్టా పుట్టించి కోట్ల రూపాయలకు విదేశీ కంపెనీకి అమ్మేరు. ఇదికాక ప్రజలు నుంచి రకరకాలుగా భూసేకరణ మొదలయింది. ఇది మొదటి దశ.

ఈ దశలో రొయ్యల చెరువులు నడవక ఆగిపోయి చేదు పట్టిన భూముల వాళ్లు, వాళ్లతోబాటు మరికొందరు ఇష్టంగానూ, విధి లేకా తమ కాసిన్ని పొలాలూ అమ్మేసుకుని ఆ వచ్చిన పెద్దమొత్తాలు దాచుకోవడం చేతకాక వస్తుమహాసముద్రం లో పారేసుకుని బికారులయ్యారు. ఇది రెండవదశ. జగన్నాథం అటు ప్రభుత్వ అధికార్లను మెప్పిస్తూ ఇటు అష్టపూజ లాంటి లౌక్యుడైన దళారీని పట్టుకుని వ్యవహారం నడిపాడు.

ఊళ్లో మార్పు మొదలయింది. చేపలు పట్టడానికి సముద్రంలో ఒక హద్దు దాటకూడదు. ఆ హద్దులోపల డ్రిల్లింగ్ తాలూకు కెమికల్స్ వల్ల చేపలు చచ్చిపోయాయి. ఊర్లోకి రోడ్లు వాటి వెంట భారీ వాహనాలు రావడం మొదలయింది. ఈ మార్పు మొదట పసిగట్టింది ఆ ఊళ్ళో కూరగాయల వ్యాపారం చేసుకునే గంగ – ఆమె భర్త సింహాద్రి.

గంగ, పక్క నున్న టౌన్ కు వెళ్లి కూరగాయలు కొని తెచ్చి తమ ఊళ్లో అమ్ముతుంది. ఆ సమయంలో కూరగాయలు కొనే చోట ఒక పేద రైతుమీద కొట్లో పనిచేసే కూలీ



గనారా

అన్యాయంగా చెయ్యి చేసుకోవడం చూసి ఎదిరించి గొడవచేస్తోంది. పెట్టుబడిదార్ల దగ్గర పనిచేసే పేదవాళ్లే తిరిగి పేదవాళ్లమీద చెయ్యిచేసుకునే విధానం మీద గంగ చేసిన మొదటి పోరాటం అది.

సముద్రంలో హద్దు దాటి వేటకు వెళ్లిన సింహాద్రిని అరెస్ట్ చేసారు. అప్పుడు గంగ ఊరందరినీ తీసుకుని పోలీస్‌స్టేషన్ ముట్టడించి సింహాద్రి విడుదల కోసం పోరాడింది. అది రెండవ పోరాటం. ఈ విధంగా ఆ ఊరి వాళ్లకు పోరాట స్ఫూర్తి వచ్చింది.

కంపెనీ తీసుకున్న భూములకు డబ్బు చెల్లించే విధానంలో పాస్‌బుక్స్ కావాలని బ్యాంక్‌లో అవి ఓపెన్ చేస్తేనే డబ్బు చెల్లిస్తామని పేచీ పెట్టడంతో మూడవపోరాటం నడిచింది. ఈ పోరాటాలకు గంగకు ఉద్యమాలలో పనిచేసే రాంబాబు, చక్రధరరావులే స్ఫూర్తి.

భైరవలంక ఊరి రూపురేఖలు మారిపోయాయి. ప్రజలు ప్రమాదాల బారిన పడ్డవాళ్లూ, అడుక్కుంటున్నవాళ్లు, ఊరు వదిలి పెట్టేవాళ్లు ఇలాంటి వాళ్లతో మరింత బీదగా మారిపోయింది. గంగ ఆ ఊరి నెలాగయినా బాగుచెయ్యాలని, ఊళ్లో లైబ్రరీని పునరుద్ధరిచడం, మూఢనమ్మకాలను ఎదిరించడం లాంటి పనులు మొదలుపెడుతుంది. తాను చదువు కున్న కాస్త చదువునూ అభివృద్ధి చేసుకుంటుంది.

అరెస్టులు, పోలీసు కేసులు మధ్య కంపెనీ పనులు నడుస్తాయి. సముద్రాన్ని త్రవ్వేయడం, ఇళ్లు, భూములు ఆక్రమించుకుని, చెట్లు కొట్టెయ్యడం, పైపుల లైనులకోసం దురాక్రమణ, జవాబుదారీ లేకపోవడం ఇదంతా అభద్రత కలిగిస్తూ ఆందోళనకు కారణమైంది.

గంగ ఈ పరిస్థితులలో నాయకురాలిగా ఎదిగింది. ఆమెకు అమలాపురంలో పనిచేసే రైతుకూలీ సంఘం నాయకుడు శివరావు ప్రోత్సాహం దొరికింది. పోరాటం అంటూ మొదలుపెడితే ఎక్కడెక్కడి కార్యకర్తలూ ఎలా కలిసి ఒకటయి బలం పుంజుకుని సమూహశక్తిగా మారుతారో గనారా కార్యాకర్త తాలూకు అనుభవంతో బాగా రాసారు.

చివరకు భైరవలంక ఊరు ఖాళీ చెయ్యమనడం, ప్రభుత్వ బలవంతంగా పునరావాసంలోకి వెళ్లమనడం. తమ ఊరిని తమ అస్తిత్వాన్ని వదులుకోలేక దానికోసం కలక్టరేటు ముట్టడి అరెస్టులు లాఠీచార్జీలతో కథ పూర్తవుతోంది.

ఈ నవల తాలూకు ప్రత్యేకతలు చెప్పుకోవాలి. నవలలో కథ పెద్ద సునామీ తో ఆరంభమయింది. ఆ సునామీ దెబ్బకి భైరవలంక సమూలంగా కొట్టుకుపోయింది. ప్రతీ ఇంటినుంచీ ఇద్దరు ముగ్గురయినా ఆ సునామీలో కొట్టుకుపోయారు. తిరిగి శవాలయి తేలారు. కానీ మిగిలినవారు ఎవ్వరూ ఆ ఊరు వదలలేరు. సునామీలు వచ్చినా వారు ఆ ఊరు వదిలి పెట్టకుండా అక్కడే ఉండిపోయినప్పుడు ప్రభుత్వం పునరావాసం ఏర్పాటు చేసి బలవంతంగా ఊరు ఖాళీ చెయ్యమంటే ఎలా చేస్తారు? ఇలా కథ మొదలుపెట్టి నవల పూర్తి చెయ్యడంలో మంచి విజ్ఞత ఉంది.

ప్రజా ఉద్యమాలను, పోరాటాలను మళ్లించడానికి గానీ, అణచడానికి గాని ప్రభుత్వం ఎన్ని పన్నుగడలు పన్నుతుందో అన్నీ ఒక్కటి కూడా వదలకుండా ఇందులో రాసారు. ఆఖరికి ఆయా ప్రాంతాలలో ప్రభుత్వం అట్టహాసంగా చేసే సాంస్కృతిక కార్యక్రమాలతో సహా.


నవలలో వర్ణనలు కూడా చాలా అవసరంగా కథ సందర్భాలలోకి ఒదిగి ఉన్నాయి. నవల అంతా చిక్కదనంతో పాటు ఔచిత్యం కూడా గమనించాల్సిన అంశం.

ప్రకృతి శక్తుల్ని నమ్ముకున్న వాళ్ల బలమూ, సాహసమూ ఎలా ఉంటాయో ఈ నవల చెప్తుంది. సముద్రాన్ని నమ్ముకున్న వాళ్ల సాహసం ఏమిటో ఈ కథలో ఉంది.

కథకి ఒక జాలరి స్త్రీని నాయకురాలిని చేసి ఆమెవేపు నుంచి కథ నడపడంలో ఆధునికత ఉంది. గంగ క్రమక్రమంగా ఉద్యమం కారణంగా ఒక సమర్ధవంతమయిన నాయకురాలిగా ఎదిగిన వైనమంతా ఈ నవలలో ఉంది. అరెస్టయి దెబ్బలు తిన్న గంగ హాస్పిటల్‌లో కళ్లు తెరిచింది. ఆమె కళ్లు తెరిచే భవిష్యత్తును కలలు కంటోందని నవలను పూర్తి చేసారు.

స్థానిక దోపిడుల మీద ప్రాంతీయ ప్రజా ఉద్యమాల పోరాటాల అవసరాన్ని ఈ నవల చాలా బాగా గుర్తించింది. గనారా గారు రాసిన మొదటి నవల అయినా ఇందులో ఎంతో పరిణతి కనిపించడం విశేషం. అది కార్యకర్తగా ఆయన సాధించిన పరిణతిని, ఆయన తాలూకు సాహిత్య పఠనానికి నిదర్శనంగా భావించవచ్చు. ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన ఈ పుస్తకం అందుబాటులో ఉంది.

కథ



# మాతంగుడి శపథం


డా॥ ఎ.రవీంద్రబాబు
9394489263


"సరే నాన్న! నీవు చెప్పినట్లే నేను యజ్ఞానికి సంబంధించిన కార్యక్రమాలు చూడడానికి మాత్రమే పొరుగూరు వెళ్తాను" అని తండ్రి చెప్పిన ప్రకారం మాతంగుడు మరో ఊరికి బయల్దేరాడు.

మాతంగుడి తండ్రి ఉత్తమోత్తముడైన బ్రాహ్మణుడు. వేదాలను కంఠతాపట్టి, వాటి ప్రకారం నియమబద్ధంగా జీవిస్తున్న పండితుడు. అలాంటి తండ్రి మాటకు కొడుకు ఎదురు చెప్పకుండా నడుచుకోవడమే మాతంగుడి బాధ్యత.

మాతంగుడు తండ్రి ఆజ్ఞ ప్రకారం పొరుగూరికి వెళ్తుంటే దారి మధ్యలో ఓ గాడిద పిల్ల కనిపించింది. అది అతన్ని ఎలాంటి ఇబ్బంది పెట్టలేదు. కానీ మాతంగుడు కుర్రచేష్టలతో గాడిద పిల్లని ఓ కర్రపుల్లతో కొట్టాడు. వెంటనే గాడిద పిల్ల తన తల్లి అయిన పెద్ద గాడిద దగ్గరకు వెళ్లింది. తనను కర్రతో హింసించిన అతని గురించి

"అమ్మా.. ఆ బ్రాహ్మణుడు నన్ను కర్రతో కొట్టాడు. నాకు చాలా బాధ కలిగింది" అని బాధతో చెప్పింది.

ఆ పిల్లను ఓదార్చుతూ తల్లి గాడిద "అతను బ్రాహ్మణుడు కాదు. ఛండాలుడు. అందుకే నిన్ను అలా కర్రతో కొట్టి హింసించాడు." అంది.

అదే దారిన వెళ్తున్న మాతంగుడు గాడిద చెప్తున్న మాటలు విని ఆశ్చర్యపోయాడు. తను బ్రాహ్మణుడు కాదా..!? ఎందుకని..? నా తండ్రి బ్రాహ్మణుడు, నా తల్లి బ్రాహ్మణ స్త్రీ. మరి నేనెందుకు బ్రాహ్మణుడ్ని కాను అని అనుకున్నాడు.

గాడిదతో "నేను నీ పిల్లను కొట్టాను. ఆ కోపంతో నీవు అబద్ధం చెప్తున్నావు. నేను ఎందుకు బ్రాహ్మణుడ్ని కాను? నిజం చెప్పు? అని నిలదీశాడు.

గాడిద "నీకు నీ పుట్టుక గురించి తెలియదు. నీ తండ్రి బ్రాహ్మణుడు కాదు. నీ తల్లి ఓ క్షురకుడి వల్ల నిన్ను కన్నది. నీ తండ్రి క్షురకుడు. నీ తల్లి బ్రాహ్మణ స్త్రీ. అలాంటప్పుడు నీవు బ్రాహ్మణుడివి ఎలా అవుతావు. నే చెప్పేది నిజం. కావాలంటే వెళ్లి, నీ తండ్రినే అడుగు" అని చెప్పింది.

మాతంగుడు కోపంతో తండ్రి కాని తండ్రి బ్రాహ్మణుడి దగ్గరకు వెళ్లి "నీవు నా తండ్రివి కాదా, మా అమ్మకు క్షురకుడి వల్ల పుట్టానా..? అయితే నా తండ్రి క్షురకుడా!?" అని అడిగాడు.

ఆ బ్రాహ్మణుడు ఏమీ మాట్లాడలేదు. మాతంగుడికి నిజం అర్థమైంది. తను క్షురకుడికీ, బ్రాహ్మణస్త్రీకి పుట్టానని బోధపడింది. వెంటనే పెంచిన ఆ బ్రాహ్మణ తండ్రితో

‘‘నేను బ్రహ్మణత్వాన్ని పొందుతాను. పుట్టుకతో కాకపోయినా తపస్సు చేసి బ్రాహ్మణుడ్ని అవుతాను” అని తపస్సుకు వెళ్లిపోయాడు.

ఘోరమైన అరణ్యంలోకి వెళ్లి బ్రాహ్మణత్వం పొందాలనే కోరికతో ఇంద్రుడి గురించి తపస్సు ప్రారంభించాడు. అతనికి గడ్డాలు మీసాలు పెరిగాయి. చుట్టూ పుట్టలు వచ్చేశాయి. అతని తపస్సుకు మెచ్చి ఇంద్రుడు ప్రత్యక్షమయ్యాడు.



“మాతంగా..! నీ తపస్సుకు మెచ్చాను. నీకు ఏ వరం కావాలో కోరుకో ఇస్తాను” అన్నాడు.

మాతంగుడు ‘‘స్వామీ..! నేను నా పుట్టుకకు సంబంధించిన రహస్యం తెలుసుకున్నాను. నా తల్లి బ్రాహ్మణ స్త్రీ, కానీ ఓ క్షురుకుడి ద్వారా నన్ను కన్నది. నేను బ్రాహ్మణత్వాన్ని పొందాలనుకుంటున్నాను. స్వామి నాకు బ్రాహ్మణత్వాన్ని ప్రసాదించు” అని వేడుకున్నాడు.

“మాతంగా.. నీవు కోరుకున్న వరం సాధ్యం కాదు. నీకు బ్రాహ్మణత్వం రాదు. కాబట్టి, నీవు తపస్సు చాలించి వెళ్లిపో.” అని చెప్పి అంతర్ధానమై పోయాడు.

కానీ మాతంగుడు మాత్రం వెనుతిరగలేదు. తన కోరికను తీర్చుకోవాలని పట్టుబట్టాడు. బ్రాహ్మణుడిగా మారందే తిరిగి వెళ్లకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

మళ్లీ తపస్సు మొదలు పెట్టాడు. ఈ సారి తపస్సును ముందటికంటే కఠినంగా చేస్తున్నాడు. అడవిలో ఉంటే పులి, సింహం లాంటి జంతువులు కూడా అతని తపస్సుకు భయపడుతున్నాయి. వర్షాకాలం, శీతాకాలం, ఎండాకాలం అనే తేడా లేదు. భూమ్మీద ఎలాంటి ప్రళయాలు జరిగినా అతని నిష్ఠ మాత్రం భంగం కలగలేదు. అప్పటికీ ఇంద్రుడు ప్రత్యక్షం కాలేదు. చివరకు ఒంటికాలిమీద తపస్సు మొదలుపెట్టాడు. శరీరం మొత్తం శుష్కించింది. నరాలు కూడా కనపడకుండా పోతున్నాయి. అలా మాతంగుడు వంద సంవత్సరాలు తపస్సు చేశాడు. అతని తపశ్శక్తికి జగత్తు మొత్తం అతలాకుతలం అవుతోంది.

ఇక తప్పదని ఇంద్రుడు ప్రత్యక్షమయ్యాడు.

“మాతంగా.. నీకు నేను ఏమని చెప్పాను. తపస్సు మానేసి వెళ్లమని చెప్పాను. కానీ నువ్వు తపస్సును ఇంకా కఠినంగా చేస్తున్నావు. మంచిది కాదు” అని చెప్పాడు.

“స్వామీ.. నా కోరిక తీరందే నేను వెళ్లను. బ్రాహ్మణత్వాన్ని పొందాలి. నా కోరిక తీరాలి. అప్పటి వరకు ఈ తపస్సును ఆపను” అని మాతంగుడు గట్టిగా చెప్పాడు.

“మాతంగా.. అసలు బ్రాహ్మణత్వం రావడం అంటే సాధ్యమయ్యే పనికాదు. నీవు ఈ జన్మలోనే కాదు, మరో జన్మనెత్తినా బ్రాహ్మణుడివి కాలేవు. నీవు చండాలుడివి. మర్చిపోయి ఈ తపస్సు చేస్తున్నావు. బ్రాహ్మణుడిగా మారాలన్న నీ కోరిక తీరదు. ఇప్పటికైనా తపస్సు చాలించి వెళ్లు” అని ఇంద్రుడు మాతంగుడికి నచ్చ జెప్పాడు.

కానీ మాతంగుడు వినలేదు.

“నేను బ్రాహ్మణత్వాన్ని పొందనిదే తపస్సు ఆపను” అని నిక్కచ్చిగా చెప్పాడు.

అప్పుడు ఇంద్రుడు “చండాలుడు బ్రాహ్మణత్వం పొందడం సామాన్యమైన విషయం కాదు. అసాధ్యం. చెప్తా విను” అని చెప్పడం మొదలు పెట్టాడు.

“మాతంగా..!

నీవు ఇప్పుడు చేసిన తపస్సుకు పది రెట్లు చేస్తే శూద్రుడివి కాగలవు

వందరెట్లు చేస్తే వైశ్యుడివి కాగలవు

వెయ్యి రెట్లు చేస్తే దుర్బ్రహ్మణుడివి అవుతావు

లక్షరెట్లు చేస్తే బ్రాహ్మణుడివి అవుతావు

అది నీలాంటి అల్పులైన చండాలురకు సాధ్యం కాదు. ఈ ప్రయత్నం మానుకొని వెళ్లిపో” అని చెప్పాడు.

ఇవన్నీ విన్న తర్వాత కూడా మాతంగుడిలో మార్పు రాలేదు.

“నాకు బ్రాహ్మణత్వం కావాలి” అని పట్టుబట్టాడు.

మాతంగుడికి ఏ విధంగానైనా నచ్చచెప్పకపోతే అతను మళ్లీ తపస్సుకు పూనుకుంటే ముల్లోకాలకు ప్రమాదం వస్తుంది.

సూర్యచంద్రులు గతులు తప్పుతారు. చివరకు తనకే చేటుకాలం దాపరిస్తుంది. పైగా త్రిమూర్తుల దగ్గర మాటపడాల్సి వస్తుంది. ఇలా అనేక రకాలుగా ఆలోచించిన ఇంద్రుడు మాతంగుడికి ఓ వరం ఇచ్చి మాయ చెయ్యడానికి సిద్ధమయ్యాడు.



"మాతంగా..! నీ తపస్సు చూస్తుంటే.. ఇంద్రుడినైన నాకే ముచ్చటేస్తుంది. నీకు వరాలివ్వాలనిపిస్తుంది. అందుకే నీ మొఖాన్ని కాంక్షించి, నీకు సర్వభోగాలను, సంపదలను, సుఖించడానికి కావాల్సిన ప్రియురాళ్ళను ఇస్తున్నాను" అని చెప్పాడు.

కానీ మాతంగుడిలో ఏమాత్రం మార్పు రాలేదు. ఇంద్రునికి అతని ముఖంలో ఇచ్చిన వరాల పట్ల కొద్దిగా కూడా తృప్తి కనిపించలేదు.

మళ్లీ ఇంద్రుడే చెప్పాడు.

"మాతంగా నీకు రాజ గౌరవం అందేలా చేస్తాను. కామ రూపాన్ని ఇస్తాను. దాంతో నీవు ఏ రూపం కావాలంటే ఆ రూపాన్ని పొందవచ్చు. ఇంకా పక్షిగా తిరిగే శక్తిని ఇస్తున్నాను. దాంతో శారీరక సుఖాన్ని ఎక్కువగా, ఎప్పుడైనా, ఎక్కడైనా పొందగలవు". అని మాతంగుడి మనస్సు మార్చడానికి శతవిధాలా ప్రయత్నం చేశాడు.

దేవతలందరూ ఆకాశం నుంచి ఏం జరగనుంది..!? ఇంద్రుడు మాతంగుడి తపస్సును ఎలా ఆపేస్తాడు? బ్రాహ్మణులకు, బ్రాహ్మణత్వానికి ఎలాంటి చెడు జరగదు కదా..! ఒక క్షురకుడికి పుట్టిన వ్యక్తి బ్రాహ్మణుడిగా మారితే ఎలా..! అని ఉత్కంఠంగా చూస్తున్నారు.

మాతంగుడు ఎదురుగా ఉన్న ఇంద్రుడ్ని, ఆకాశంలో ఏం జరుగుతుందో అని.. ఆశ్చర్యంతో, భయంతో, ఉక్కిరిబిక్కిరి అవుతూ చూస్తున్న దేవతలను ఒకసారి పరికించి చూశాడు.

ఒక్కసారిగా తనలోకి తనే నిగూఢంగా తర్కించి చూసుకొని, అప్పటి వరకు తను చూసిన భౌతిక ప్రపంచాన్ని సమాజ స్వభావాన్ని, అనుభవించిన బ్రాహ్మణ జీవితాన్ని, మంగలి వ్యక్తి పట్ల ఆకర్షితురాలైన తన తల్లిని, తన పుట్టుకకు కారణమైన క్షురకుడైన తండ్రిని గుర్తు చేసుకొని బిగ్గరగా, నిక్కచ్చిగా చెప్పడం మొదలు పెట్టాడు.

''ఇంద్రా.. నాకు జ్ఞానోదయం అయింది. నా తప్పు తెలుసుకున్నాను. నాకు అసలు బ్రాహ్మణత్వమే వద్దు. దేవతలు, నీవు వర్ణవ్యవస్థ కాపాడడానికి ఎంత తపిస్తున్నారో అర్థమయింది. ఎలాంటి శ్రమచేయకుండా రాజులు ఇచ్చే బంగారం, గోవులు, స్త్రీలకోసం నేను వాళ్లను కీర్తించను. ఊరికనే వచ్చే వాటికోసం ప్రాకులాడను. యజ్ఞాలు, యాగాలు చేసి వ్యవసాయానికి ఆధారమైన పశువులను అగ్నికి ఆహుతి చేయను. నా తండ్రి వృత్తి చేసుకుటూ సుఖంగా జీవిస్తాను. ఆ వృత్తి ప్రాధాన్యత ఎంత గొప్పదో మీ అందరికీ తెలియజేస్తాను. మీరు మీమీ వర్ణాధిఖ్యత స్వభావాన్ని వీడి, సమాజాన్ని మీరనుకుంటున్న కింది వర్ణాల దృష్టితో చూడండి. ఆ శ్రమ సౌందర్యం ఎంత గొప్పదో అర్థమవుతుంది. అవి ఎంత గొప్ప జీవితాలో తెలుస్తాయి. మీరే ఇష్టంతో మా వర్ణానికి మారతారు." అని కఠవుగా చెప్పాడు.

మాతంగుడి మాటలు విన్న ఇంద్రుడు, దేవతలు "ఈ మాతంగుని వాక్కులు అప్రతిహతమగుగాక.." అని చెవులు మూసుకున్నారు.

మాతంగుడు తన తండ్రి ఆచూకి తెలుసుకోడానికి తల్లి దగ్గరకు బయల్దేరాడు.

ఇంద్రుడు, దేవతలు కలియుగంలో వర్ణసంకరం, కులసంకరం జరగకుండా ఉండాలంటే ఏమి చేయాలనే ఆలోచనలో పడ్డారు.

(**ఆధారం :** మంగలి కుల ప్రస్తావన ఉన్న ఈ కథ తెలుగు కవిత్రయ మహాభారతంలోని అనుశాసనిక పర్వంలోనిది. భీష్ముడు అంపశయ్యపై పడుకొని ధర్మరాజు ప్రశ్నలకు సమాధానాలు చెప్పే సందర్భంలో ఇంద్ర మాతంగుల సంవాదన పేరుతో కనిపిస్తుంది. మూలంలో మాతంగుడు చివరకు ఇంద్రుడు ఇచ్చే వరాలతో తృప్తి పడతాడు. ముగింపు మార్చడం జరిగింది.)

❋

## కవిత

# వాళ్ళని అలానే వదిలేద్దాం!!

- చిత్రాడ కిషోర్ కుమార్
9866912906



రాజులు రాజ్యాలు ఏలుతున్నారు
నాయకులు నియాన్ కార్లలో తిరుగుతున్నారు
కానీ మనందరి ధనదాహాలు తీర్చే వాళ్ళు మాత్రం
ఎప్పటికప్పుడు పొట్టను తడిమిచూసుకుంటూనే ఉన్నారుగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!
సాగు సమస్యల వలలపై కదులుతూ, మెదులుతూ
సానుభూతి పవనాల సుడిగుండంలో నలిగిపోతూ, మాడి మసైపోతూ
కరువు.. ప్రాంతాలవారీగా మారుతున్నా
నిరంతరం శ్రమిస్తూ అన్యాయాల్ని చవిచూస్తున్నారుగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!
మనందరి నిత్యావసరాల కోసం అప్పులు చేస్తూ
శ్రమనే కాదు, వారి చెమటనీ రక్తాన్నీ, పంటపొలాల్నీ
రేపటితరం కోసం ధారదత్తం చేస్తున్నారుగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!
తాజ్ మహల్ నిర్మాణానికి రాల్లెత్తిన కూలీలను పట్టించుకోనట్లే
దేశానికి సమస్తభోగభాగ్యాలని ప్రసాదించే వెన్నెముక లాంటి
వాళ్ళని వీధులెంటతిరిగే కూలీలుగా మారేట్టు చేస్తున్నాంగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!
పాలకులెందరు మారినా వాళ్ళ తలరాతలు మాత్రం
పంటపొలాల్లో వరిచేను కట్టల్లాగ విసిరివేయబడుతూ
చెట్టుకొకరు, పుట్టకొకరై ఆత్మహత్యలు చేసుకుంటున్నారుగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!
నిత్యం మన ఐదు - మునివేళ్ళు నోటిని ముద్దాడడానికి
వాళ్ళు హలం పట్టి, పొలం దున్ని, పంచభక్షపరమన్నాల్ని సిద్ధం చేస్తుంటే
'అన్నదాత సుఖీభవ' అనకుండా 'అయ్యోరాత' అంటున్నాముగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!
పట్టణాలలోనే కాదు పల్లెటూళ్లలో కూడా ఎకరాలెకరాలు
అపార్ట్‌మెంట్స్ అంటూ మెగా ప్రోజెక్ట్స్ అంటూ కట్టుకుంటూ పోతే
పచ్చనిపచ్చదనం ఎక్కడుంటుంది? రైతనే వాడెక్కడుంటాడు??
రాబోయే యుగంలో అన్నీ 'టాబ్లెట్స్' రూపంలో 'ఇన్-స్టంట్'గా రావాలిగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!


రైతులు గురించి పంటపొలాలు గురించి
మన మనుమళ్ళకు, మనుమరాళ్ళకు కథలు కథలుగా చెప్పుకోవాలి
పాఠ్యాంశాల బొమ్మల్లో చూపించి మురిసిపోవాలిగా
వాళ్ళని అలానే వదిలేద్దాం!!
ఇప్పుడు వాళ్ళ ఆరాటం క్షేత్రబంధం గురించి కాదు
ఇప్పుడు వాళ్ళ పోరాటం జీవన్ముక్తి కోసం
ఇప్పుడు వాళ్ళ ఆత్మహత్యల్ని మరణం అనుకోవడం లేదు
మహదానంద నిష్క్రమణం అంటున్నారు.. అనుకుంటున్నారు
వాళ్ళని అలానే వదిలేద్దాం!!

✵

## నచ్చిన రచన

# వినూత్నమైన జుగల్‌బందీ 'ధూళి చెట్టు'

- ఎం.వి.ఎస్. శర్మ




**కొ**న్ని సంవత్సరాలుగా, బహుశా మూడు దశాబ్దాలుగా వాహెద్ సృజించిన కవిత్వం 'ధూళిచెట్టు' సంకలనంగా మన ముందుకొచ్చింది.

సున్నితమైన భావుకత, మానవత్వం, బలమైన ఆశావాదం, దానితో కొద్దిగా మేళవించిన నిరాశ, తిరుగుబాటు – ఇవన్నీ కలబోస్తే అది 'ధూళిచెట్టు' సంకలనం అయింది. " ఇది నా దేశం; ఈ మట్టి నాది; ఈ మనుషులు నా వాళ్లు" అని బలంగా విశ్వసించే మనిషి తాను మైనారిటీ మతస్తుడైనందుకే పరాయివాడుగా పరిగణింప బడుతున్నందుకు అనుభవించే వేదన కూడా ఇందులో కనపడుతుంది.

'' ఏరోయ్, ఎప్పుడొచ్చావేంటి? అంతా కులాసాయేనా?" అని పలకరించిన చిన్ననాటి ఆప్తమిత్రుడే" ఏంటి... నన్ను రమ్మంటావా.. పాత బస్తీకా, ఏరోయ్.. క్షేమంగా పంపుతావా?" అని అన్నప్పుడు అది స్వచ్ఛమైన వేళాకోళమే అయినా వేళ్లను బలవంతంగా పెకలించిన భావన కవిలో కలిగింది. అదే సమయంలో " నన్ను నా నుంచి వేరు చేయాలనుకునే మిత్ర భేదం – అయస్కాంత ధృవాలను విడగొట్టలేదు" అన్న శక్తివంతమైన లౌకిక ప్రతిస్పందన కవి చూపించాడు. హిందూ, ముస్లిం సంబంధాలను అయస్కాంత ధృవాలతో పోల్చడం చాలా బాగుంది.

పార్సీ, హిందీ భాషల సంగమం నుంచి అద్భుతమైన భారతీయ భాష ఉర్దూ వచ్చింది. ఉర్దూ – తెలుగు కవితా రీతుల జుగల్ బందీ ' ధూళిచెట్టు' పుస్తకం.

టైటిల్‌తో మొదలు బెట్టి కొన్ని అద్భుతమైన వ్యక్తీకరణలు మనం చూస్తాం. " కాలం నదిలో చేప పిల్లల్లా కొన్ని క్షణాలు అప్పుడప్పుడూ మెరుస్తుంటాయి. అలాంటి వాటిని ఒడిసిపట్టుకోవాలనే బతుకుతున్నాను." "అరుపులపై మౌనం సంధిస్తున్నాను– నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నాను" – ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే.

మట్టి, సూర్యోదయం, కిరణాలు, పొగమంచు, నక్షత్రాలు, మబ్బులు, పిట్టలు, నీలాకాశం, కన్నీళ్లు, చెట్లు, వెన్నెల – ఈ కవితా వస్తువులు 'ధూళి చెట్టు' నిండా పరుచుకొని ఉన్నాయి. అయితే వాహెద్ భావుకత ప్రకృతితో మమేకమవడంతో సరిపెట్టుకోలేదు. అతడిది అసలు సిసలైన మట్టిమనిషి భావుకత.

ఒక సంభాషణలో ఒక అమ్మాయి, సెలయేరు, ఒక చెట్టు మాట్లాడుకుంటారు. సెలయేటి నీటిలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ చెట్టు వేళ్లు తెగి కూలిపోతుంది. ఆ చెట్టు పడిపోకుండా, వేళ్లు తెగిపోకుండా ఆపలేదెందుకని? అని అమ్మాయియి ఏటి ఒడ్డును అడుగుతుంది. " నీకు ఇదంతా ఆటలా ఉంది కదా? తమాషా చూస్తున్నావు'' అని సెలయేరునడుగుతుంది. చివర్లో చెట్టు నోరు విప్పి అమ్మాయితో ఇలా అంటుంది : " నాలా నా ఆలోచనలు ముందుకు కదలలేదు. కాని నువ్వేమిటి? నువ్వు కదలగలవు కదా; నీ ఆలోచనలు కదల గలవు కదా ! నువ్వు కూడా కూలుతున్నావు – పన్నీటిలో... తర్వాత కన్నీటిలో..." దానితో " నా వేళ్లకు బలాన్నిచ్చే మట్టిగా నేనే మారతానంటూ'' అమ్మాయి కదులుతుంది. ప్రకృతిని ఉద్యమ స్ఫూర్తి రగిల్చే వస్తువుగా చిత్రీకరించాడు వాహెద్. ఇది గొప్ప ప్రయోగం.

గాలిలో తేలిపోయేది కాదు వాహెద్ ప్రేమ. " ఉడికిన అన్నం మెతుకు వాసన లాంటిది ఈ ప్రేమ. కడుపులో

ఆకలినిధి దాచుకున్నవారికే దీని విలువ తెలుసు" అంటాడు. కడుపు నిండిన ఖరీదైన వ్యక్తుల చౌకబారు ప్రేమ గాథల చెత్త కుప్పల మధ్య ఇరుక్కుపోతున్న వాళ్లకి వాహెద్ ప్రేమ మనోహరమైన పరిమళంగా సోకుతుంది.


వాహెద్

" ఫిరంగి గొట్టంలో చిన్నారి ఊరపిచ్చుక చక్కటి గూడు కట్టుకుంది." " అరుపుల తాళ్లతో పెడ రెక్కలు విరిచికట్టబడ్డ నా శరీరం ప్రతిధ్వనించడానికి సిద్ధపడితే – ఎడారి ఒడ్డున ఎర్రెర్రని అరుపు ఒకటి – నేనూ కట్టుకుంటాను. ఇసుక నా సమాధి తవ్వుతూ చెమట నదిగా మారుతుంది."

"పద నువ్వూనేనూ కలిసి – మరో పది మందిని కూడగట్టుకుని మన జేబుల్లో దాచుకున్న వెలుగు రాళ్లతో – నాలుగక్షరాల చితుకుల్లో మంటపుట్టిద్దాం"– ఈ పంక్తులు వాహెద్ లోని బలమైన ఆశావాదాన్ని వ్యక్తం చేస్తున్నాయి. తాను ఎంతగా అణగదొక్కబడతాడో అంతగాను ఎదురు తిరుగుతాడు విప్లవకారుడు. తన దృఢ విశ్వాసాన్ని అంత బలంగానూ చెప్తాడు.

" నా సమాధిని తవ్వి త్రిశంకు స్వర్గమేదో కట్టాలనుకుంటున్నావు కానీ ఈ మట్టి రేణువుల పిలుపుకు – సప్తాకాశాలే నేలకు వాలుతాయని నీకు తెలియదు"

" నెత్తురు మౌనంగా ఉండదు – గోల చేస్తుంది, అరుస్తుంది, పెనుగులాడుతుంది. నేల రొమ్మును చీల్చి మరీ అరుస్తుంది. హంతకుల గుండెల్లో దిగబడి అరుస్తుంది. కాగితాలపై అక్షరాల బాణాలుగా అరుస్తుంది. బండ రాళ్లను అది కరిగించలేకపోవచ్చు. కాని ఆ అరుపుల ధాటికి అవి పగలక తప్పదు."శక్తివంతమైన వ్యక్తీకరణ ఇది.

ఎవరైనా తారసపడి మీదే కులం? అని ప్రశ్నించినప్పుడు " ప్రతిజ్ఞాపకం మెడకు ముంత ; మొలకు తాటాకు" అని వాహెద్ అంటాడు. టీవీల్లో జరిగే చర్చల ప్రహసనాన్ని " ప్రాణం కడుపులో ఉన్న వాడితో మెదడున్న చర్చలు టీవీల్లో సాధ్యమా?" అంటూ ఎండగడతాడు వాహెద్.

మన భావనా ప్రపంచంలో ఆశ ఒక్కటే ఒంటరిగా ఉండదు. నిరాశ వెంటే ఉంటుంది. అలాగే అనందం – బాధ, నిస్సహాయత – కోపం, లాంటి పరస్పర విరుద్ధ స్పందనలూ వెంటవెంటనే ఉంటాయి. వీటన్నింటి సంగమం వాహెద్ కవిత్వంలో మనకు గోచరిస్తుంది.

" దీపం పురుగులు"తో నేటి యువతను పోల్చాడు వాహెద్. ప్రపంచీకరణ దీపం వైపు బలంగా ఆకర్షించబడి మాడిపోయే శలభాలు వాళ్లు. ఆ " దీపం పురుగులే మిణుగురులైతే దీపాల అవసరమే ఉండదు" అని చమత్కారంగా కర్తవ్యబోధ చేశాడు వాహెద్.

" నువ్వు కాస్త చిరునవ్వు ముక్కలు ఇటు విసిరెయ్ వాటి నీడల్ని దోసిట పట్టి గొంతు తడుపుకుంటాను" అనగలిగిన వాహెద్ కవిత్వాన్ని ప్రేమించకుండా ఉండడం చాలా చాలా కష్టం.

✵

---

## గమనిక

**సాహిత్య ప్రస్థానం చిరునామా మారింది.**

**రచనలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు**
**ఈ దిగువ చిరునామాకు పంపగలరు**


**సాహిత్య ప్రస్థానం**
**27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు**
**ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002**
**ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**
ఇ-మెయిల్ : **ssprasthanam@gmail.com**
**www.prasthanam.com**




## సాహిత్య ప్రస్థానం పత్రికకు చందా కట్టారా?

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి!**
**తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!**

**1 సంవత్సర చందా రూ. 120/-**
**5 సంవత్సరాల చందా రూ.500 /-**
**10 సంవత్సరాల చందా రూ. 1000/-**

**చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.**

## నచ్చిన రచన




# దాగిన చరిత్రకు ప్రతిబింబం చరితార్థులు


- షేక్ ఇబ్రహీం
9533336227


***దేశ స్వాతంత్ర్య సమర పోరాటంలో ముస్లింల శ్రమను దాచి, ముస్లింలపై విష ప్రచారం కక్కుతున్న ఊసరవెల్లి మూకల ఆగడాలకు ఆయుధమే ఈ చరితార్థులు (THE IMMORTALS) గ్రంథం. 133 మంది ప్రజా పోరాట యోధుల, రాజుల చరిత్రతో పాటు, 12మంది మాతృమూర్తుల పోరాట ప్రతిమను (మొత్తం 155 మంది) 352 పుటలలో వాస్తవమైన చరిత్రను ఆధారాలతో సహా ఈ చరితార్థులు గ్రంథంలో పొందుపరిచారు.***

సయ్యద్ నశీర్ అహమ్మద్ పదిహేను సంవత్సరాల శ్రమ, కృషి, పోరాటం, ఆవేదన, గుండె గొంతులో దాగిన మౌనదుఃఖమే 'చరితార్థులు' గ్రంథం.

***"మిమ్మల్ని వ్యతిరేకించి నట్టయితే / నేను నా స్వర్గాన్నీ, నా జీవితాన్నీ / నా సంతోషాన్ని కోల్పోవచ్చు / ప్రజల సంతోషంలోనే నా సంతోషం / నా ప్రజల సంక్షేమంలోనే / నా సంక్షేమం ఇమిడి ఉంది / నా కిష్టమైందల్లా మంచిదని నేను భావించను / నా ప్రజలకు ఏది ఇష్టమో దానిని నా అభీష్టంగా భావిస్తాను / నా ప్రజలకు ఎవరు శత్రువులో వారు నాకూ శత్రువులు / వారు నాతో యుద్ధం ప్రకటించినట్టే"***


**– టిప్పుసుల్తాన్ (మైసూరుపులి)**

పూర్వం నుంచి నేటి స్వాతంత్రోద్యమ పోరాటం వరకూ దేశాన్ని పరిపాలించిన భారతీయ ముస్లిం పరిపాలకుల్లో అధిక సంఖ్యాకులు ప్రజల సంక్షేమాన్ని అనుసరించి, హిందూ–ముస్లిం అని భేదం లేకుండా దేశ అభ్యున్నతిని కాంక్షించి పరిపాలన చేసినవారే. కొందరి స్వార్థపరుల పాలనను మినహాయిస్తే, ఎక్కువ మంది రాజుల పరిపాలనలో, రాజ్యంలో అందరికీ సమ ప్రాధాన్యతను ఇచ్చిన సంగతి చరిత్రకారులకు, సాహిత్యకారులకు తెలియంది కాదు.

వాస్తవమైన చరిత్రను వెలికి తీసి ఆ చరిత్ర సమసమాజ నిర్మాణానికి దోహదపడాలని, పరిశోధనకు పదునుపెడుతున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ సాహిత్య చరిత్రవరుసలో ముందుగా చెప్పుకోదగ్గ వ్యక్తి. నశీర్ గారి చరితార్థులు ఆల్బమ్ గురించి "చీకటి మబ్బుల్ని చీల్చుకుని ముస్లిం వ్యతిరేక శక్తులు ఇన్నాళ్ళు దాచేసిన ముస్లిం వీరుల త్యాగాలను దాచేస్తే దాగదు సత్యం అన్నట్టుగా వెలుగు సమాజం ముందుంచింది. తమ చరిత్ర తమకే తెలియని దీనస్థితిలో ఉన్న ముస్లిం సమాజానికి కొండంత ఆత్మవిశ్వాసాన్ని అందించింది" అని షేక్ కరీముల్లాగారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు. చరితార్థులు గ్రంథం ద్వారా ముస్లిమేతరుల పోరాట ప్రతిమను తక్కువ చేయడం కాదు. చరిత్రలో ముస్లింల వాస్తవ జీవితాన్ని తెలియజేయడం ఈ చరితార్థులు గ్రంథ ప్రధాన ఉద్దేశ్యం. దేశ స్వాతంత్ర్య సమర పోరాటంలో ముస్లింల శ్రమను దాచి, ముస్లింలపై విష ప్రచారం కక్కుతున్న ఊసరవెల్లి మూకల ఆగడాలకు ఆయుధమే ఈ చరితార్థులు (THE IMMORTALS) గ్రంథం. 133 మంది ప్రజా పోరాట యోధుల, రాజుల చరిత్రతో పాటు, 12మంది మాతృమూర్తుల పోరాట ప్రతిమను (మొత్తం 155 మంది) 352 పుటలలో వాస్తవమైన చరిత్రను ఆధారాలతో సహా ఈ చరితార్థులు గ్రంథంలో పొందుపరిచారు.

చరితార్థులు గ్రంథం బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా (మొదటి వ్యక్తి) దగ్గర నుంచి షేక్.ఖాదర్ మోహియుద్దీన్ (చివరివ్యక్తి) వరకు వారి పోరాట ప్రతిమను చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన చారిత్రక వాస్తవరీతుల్ని తెలియజేస్తుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు భారత దేశంలో సామ్రాజ్య విస్తరణ కాంక్ష కోసం పన్నుతున్న పన్నాగాలను ముందే గ్రహించి కంపెనీ పాలకుల ఆగడాలకు మొదట్లోనే కళ్ళెం వేసి ఎదురొడ్డిన పరిపాలకుడు, యోధుడు టిప్పుసుల్తాన్. "పాలక వర్గ తిరుగుబాటుదార్లను మొదట తీసుకుంటే బ్రిటిష్‌వాళ్ళు టిప్పుసుల్తాన్‌కు భయపడినంతగా వేరే ఎవరికీ భయపడలేదు. భయం అంటే కేవలం సైనిక భయం కాదు. టిప్పుది హేతుబద్ధమైన ఆలోచనరీతి" అని చెప్పిన

మానవ హక్కుల నేత కె.బాలగోపాల్ మాటలు నిబద్ధమైనవి. భగత్ సింగ్‌కు మరోరూపం అష్ఫాఖుల్లాఖాన్ పోరాటం. "నా మాతృభూమి సర్వదా భోగభాగ్యాలలో విలసిల్లాలి.... నాదేముంది నేను ఉండొచ్చు, ఉండకపోవచ్చు'' అనే సిద్ధాంతానికి కట్టుబడిన విప్లవకారుడు. దేశ ప్రగతికోసం 27 సంవత్సరాల అతి చిన్న వయస్సులోనే బ్రిటిష్ పాలకుల దాడికి ఎదురొడ్డి ఉరికంబం ఎక్కిన విప్లవకారుడు.



సయ్యద్ నశీర్ అహమద్

భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో "గాంధీయుగం" అనేది ఒకటి ఉందంటే దానికి ప్రధాన కారణమైన వ్యక్తి బతఖ్‌మియా అన్సారి. ఆనాడు 1917 సంవత్సరంలో బ్రిటిషు అధికారులు తమ చేతులకి మట్టి అంటకుండా చిరుద్యోగైనా బతఖ్‌మియా అన్సారిని కలిసి విషం పెట్టిన అన్నమిచ్చి గాంధీజికి పెట్టి చంపమని చెప్పి, నువ్వు అలా చేస్తే ఉన్నతోద్యోగం ఇస్తామని చెప్పిన మాటలు లెక్కచేయక వాస్తవాన్ని గాంధీగారికి తెలియజేసిన మానవతామూర్తి బతఖ్‌మియా అన్సారి. బతఖ్ మియానే లేకపోతే గాంధీయుగమే ఉండేది కాదు. బ్రిటిష్ ప్రభుత్వ అవినీతిని, అహంకారాన్ని బట్టబయట చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పత్రికలు అల్ హిలాల్, అల్ బలాగ్. ఈ పత్రికలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని ముచ్చెటమలు పట్టిస్తున్న తరుణంలో బ్రిటిష్ అధికారులు అల్‌హిలాల్, అల్ బలాగ్ పత్రికలను నిషేధించారు. అంతేకాదు జాతీయోద్యమంలో హిందూ-ముస్లిం సమిష్టికోసం తీవ్రంగా కృషి చేసిన వారిలో ఆజాద్ ఒకరు. జాతీయోద్యంలో భాగంగా పదేండ్ల ఏడు మాసాల పాటు జైలు జీవితాన్ని గడిపిన దేశభక్తులు మౌలానా అబుల్ కలాం ఆజాద్.

"**HERO OF JALLIANWALA BHAGH**"గా పేరొందిన సైపుద్దీన్‌కిచ్లూ ఉపన్యాసాలు జాతీయోద్యమ కాలంలో అతి ప్రధానమైనవి. 1919 మార్చి 30న జలియన్ వాలా బాగ్ బహిరంగ సభలో సైఫుద్దీన్‌కిచ్లూ మాటలు ప్రజలలో ఉత్తేజాన్ని నింపటమేగాక, బ్రిటిష్ పరిపాలకులపై వ్యతిరేకత భావాన్ని కల్గించి ప్రజలందరి మధ్య సమానత్వం ఐక్యత భావాన్ని కల్గించిన సంఘటన బ్రిటిష్ పాలకుల వెన్నులో చలి పుట్టించింది. బ్రిటిష్ ప్రభుత్వం చాలా చాకచక్యంగా సైపుద్దీన్ కిచ్లును చర్చకు పిలిచినట్టే పిలిచి అరెస్టు చేశారు. విడుదలైన తర్వాత పూర్తి జీవితాన్ని జాతీయోద్యమ పోరాటానికే అంకిత మిచ్చిన వ్యక్తి సైపుద్దీన్ కిచ్లూ. రాయలసీమ ప్రాంతానికి చెందిన సయ్యద్‌షా ఖాద్రి బియాబాని "అంగ్రేజోంకి గులాంగిరి నహీకరుంగా" అంటూ తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి డిప్యూటి కలెక్టర్ లాంటి ఉన్నత పదవులను సైతం తిరస్కరించిన వ్యక్తి. సయ్యద్‌షా ఒకానొక సందర్భంలో అన్న మాటలు ప్రతి భారతీయ మనస్సును తట్టి లేపుతాయి. "నేను ముస్లింను, నేను నా మతాన్నీ, నా అల్లాహ్‌ను అమితంగా గౌరవిస్తాను. కానీ నేను ముందుగా భారతీయుడనని చెప్పుకోవడంలోనే ఆనందిస్తా.. గర్విస్తా." ఈ మాటలు నాటి ముస్లింల భారతీయతకు నిలువెత్తు తార్కాణంగా చెప్పవచ్చు. ముఖ్దుం మొహియుద్దీన్, జాకీర్ హుస్సేన్, 'గుజరాతీ వజ్రం'గా పేరుగాంచిన జస్టిస్ అబ్బాస్ తయబ్‌జీ, అల్లాబక్ష్ సుంద్రో మొదలగు వారి జీవిత చరిత్రలు సయ్యద్ నశీర్ అహమ్మద్ గారు పొందుపరిచిన తీరు ముస్లింల త్యాగాలను, పోరాటాలను చారిత్రక, పరిణామ క్రమంలో మన ముందు ఉంచుతుంది.

బ్రిటిష్ వలసపాలకులకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో పురుషులతో ధీటుగా ముస్లిం వనితల పోరాట స్ఫూర్తి కూడా లెక్కకు మించి ఉంది. ఝాన్సీరాణి లక్ష్మీబాయ్ ధైర్య సాహసాలు ఏ విధంగా కీర్తి కెరటాలతో దేశమంతా వ్యాపించాయో ఆ విధంగా అవధ్ రాణి బేగం హజరత్ మహల్ సాహసాలు కూడా కొనియాడదగినవే. ప్రొఫెసర్ షంసుల్ ఇస్లాం గారి "ప్రజా చరిత్ర కారుని విశిష్ట రచన" పరిచయ వాక్యం. ఆచార్య వకుళాభరణం రామకృష్ణగారి "చరిత్రకారులకు ఆదర్శంగా నిలిచారు" ఆప్తవాక్యం "చరితార్థులు" గ్రంథానికి మరింత అదనపు బలాన్ని పెంచి, చరిత్ర పరిధిని విస్తృతం చేశాయి.

నశీర్ అహమ్మద్ కలం నుంచి భారత దేశ స్వాతంత్రోద్యమంలో ముస్లింల భాగస్వామ్యాన్ని వివరిస్తూ జాలువారిన మరొక 10 చారిత్రక గ్రంథాలు వెలుగులోకి వచ్చిన విషయం అందరికీ సుపరిచితమే. ఆయన రచనల మీద విశ్వ విద్యాలయ స్థాయిలో విస్తృతమైన పరిశోధనలు జరగవల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానవత్వ శాస్త్ర విభాగాలు ఇటువంటి గ్రంథాల్ని గుర్తించి పరిశోధనలు చేయించాల్సిన బాధ్యతను కలిగి ఉండాలి. సయ్యద్ నశీర్ అహమ్మద్ ఇంతలోతైన పరిశోధన చేసి చరితార్థులు గ్రంథాన్ని రూపొందించడమనేది ఒక గొప్ప ప్రయత్నం, సాహసం. ❋

# స్వీకారం

## పెట్టుడు రెక్కలు కథాసంపుటి




**జంధ్యాల రఘుబాబు**

వెల : 100/- పేజీలు: 88

ప్రతులకు : 9849753298

**తీ**సుకున్న కథాంశాలతో పాటు కథలోకి తీసుకువెళ్ళడానికి కూడా ఒకోచోట ఒక శైలిని అనుసరించాడు. మాట్లాడుతున్నట్టు, పక్కనే వుండి చెబుతున్నట్టు భావన కలిగించి కథావరణం మధ్యలో వదిలేస్తాడు. ఇదొక శైలీ విశేషం. ఈ కథల్లో పాత్రలు వాటి నేపథ్యాన్ని బట్టి మాట్లాడతాయి తప్ప ఎక్కడా రచయిత చొరబడిపోయి హద్దుమీరిన సుద్దులు చెప్పించకపోవడం మంచి విషయం.

**– తెలకపల్లి రవి**

## దోసిలిలో నది కవిత్వం




**దాట్ల దేవదానం రాజు**

వెల : 60/- పేజీలు: 84

ప్రతులకు : 9440105987

**ఇ**ందులో తీరైన ఆలోచనలు మెరుగైన వూహలు, భావావేశాన్ని ప్రకటించాలనే తపనతో పాటు రూపవిన్యాసం, తాత్వికతలను జోడించడం లాంటివి ఉన్నాయి. పదాల అన్వేషణ దశను ఆయన కవిత కవితకూ దాటుతున్నారు. ఎంత లేదన్నా మన మీద వస్తు ప్రభావమే అధికం.

**– డా॥ సీతారాం**

## మన్యభారతం చెర్లకోట చరిత్ర

**సహస్రాధిక పద్యకావ్యం**




**మాల్యశ్రీ**

వెల : 300/- పేజీలు: 320

ప్రతులకు : 9290070043

**నే**ను దీనిలోని ముఖ్యపాత్ర అయిన ముత్యం నాయకునికి స్వయానా మునిమనుమణ్ణి. మా నాయన చింతూరి బుచ్చిరామయ్య స్వయంగా తమ పూర్వులందించిన చర్లకోట సమాచారాన్ని నాకు మక్కువగా అందించారు. ఇంకా మా వంశం వారు అందించిన సమాచారంతో పోల్చుకొని ఈ ఇతివృత్తాన్ని ఇంకా పరిపుష్టం గావించాను.

**– మాల్యశ్రీ**

## బొడ్రాయి కథలు




**మేరెడ్డి యాదగిరి రెడ్డి**

వెల : 100/- పేజీలు: 131

ప్రతులకు : 9949415796

**క**థా రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డి నైపుణ్యమేమంటే తాను అనుకున్న గమ్యానికి ఒక్కో కథను ఒక్కో దశ నుండి ఒక్కో దిశ నుండి తీసుకువస్తారు. దయనీయమైన రైతు దుర్భర జీవితాన్ని కేంద్రకంగా చేసుకుని రాసిన ఈ కథలు చదివి జీవి అంగలారున్తుంది! పాఠకుడి వేదన తపతపకొట్టుకుంటుంది!! 'చిటాన చినుకు'– లాంటి మాటలు, 'హైదరాబాదు ఇంతలా బలిసిపోలేదు' లాంటి వ్యక్తీకరణలు అక్కడక్కడా పాఠకులకు మందహాసం తెప్పిస్తాయి.

**– డాక్టర్ దేవరాజు మహారాజు**

## తెలంగాణ గజల్ కావ్యం




**బైరి ఇందిర**


వెల : 100/- పేజీలు: 68

ప్రతులకు : 97396303552

**దీ**నిలో నలభై గజల్స్ ఉన్నాయి. దేనికదే ఒక రసవత్ కృతిగా భాసిస్తుంది. తెలంగాణా రాష్ట్రం సహజ సంపదకు మాత్రమే గని కాదు. చరిత్ర, సాహిత్య, మేధో సాంస్కృతిక రంగాల్లో కూడా అమూల్యమైన సంపదలున్న గని అని ఈ కావ్యం చెబుతుంది. తెలంగాణా నిరంతరం చైతన్యవంతంగా ఉండడానికి కారణం చారిత్రక పోరాట వారసత్వం కలిగి ఉండడమనే ధ్వనిని ఈ కావ్యం తెలుపుతుంది.

**– ప్రొ॥ బన్న ఐలయ్య**

## పామర సంస్కృతం




**(పాలమూరు మాండలికం)**

**డా॥ కపిలవాయి లింగమూర్తి**

వెల : 300/- పేజీలు: 304

**పా**లమూరు మాండలీకానికి కొంత ప్రత్యేకత ఉంది. కావ్యాలలో కనిపించే శబ్దాల రూపాంతరీకరణాలు ఇందులో ఉండడం గోచరిస్తుంది. వీటన్నింటిని సేకరించి వ్యాకరించి అర్ధవివరణ చేసి అందించిన డా॥ కపిలవాయి లింగమూర్తి గారి కృషి శ్లాఘనీయం.

**– డా॥ ఎల్లూరి శివారెడ్డి**

# స్వీకారం

## జయమ్(?)




**మహాభారతమ్' మూలకథకు నవలారూపం**

**నాయుని కృష్ణమూర్తి**

**వెల : 250/- పేజీలు: 425**

**ప్రతులకు : 09440804072**

**కు**రువంశం అంతరించకుండా ఆదుకొన్న వ్యాసుడు తనకళ్ళముందే బిడ్డల బిడ్డలు యుద్ధానికి తలపడడం చూసి సహించలేకపోయాడు. జరిగిన చరిత్రకు కావ్యరూపం కల్పించాడు. ఫలితంగా పుట్టిన కావ్యం 'జయేతిహాసమ్' కాలక్రమంలో 'జయమ్' 24వేల శ్లోకాల 'భారతమ్' అయింది. లక్ష శ్లోకాలకు మించిన 'మహాభారతమ్' అయింది. మూలకథ 'జయమ్'లో ఏం జరిగి ఉంటుంది? ఇలా జరిగి ఉండొచ్చనే ఊహలతో మలచిన నవల 'జయమ్'.

**- నాయుని కృష్ణమూర్తి**

## మొగ్గపూసలు కవిత్వం




**తప్పెట ఓదయ్య**


**వెల : 80/- పేజీలు: 108**

**ప్రతులకు : 9440210662**

**మొ**దటి కవితా సంపుటిలోనే జాతి ప్రజల గోనను రూపు కట్టించి, మానవీయ విలువల కోసం కవితాగానం చేస్తున్న ఈ కవి భవిష్యత్ కవితా రంగానికి ఒక ఆశావహ స్ఫూర్తి, విస్తృత అధ్యయనం, సాధన, పరిశీలన కవిని మరింత శక్తిమంతున్ని చేస్తుంది. స్వార్థాలకు సమయమిచ్చే కాలంలో సమాజం కోసం, మార్పు కోసం స్పందించే ఏ ప్రయత్నమైనా సమాజాన్ని మరింత మానవీయం చేస్తుంది.

**- బూర్ల వెంకటేశ్వర్లు**

## ఉట్నూరు సాహితీ సంచిక




**కవితలు - పాటలు - వ్యాసాలు**

**వెల : 60/- పేజీలు: 56**

**ప్రతులకు : 9440979882**

**ఈ** ప్రాంత ప్రజల సుఖదుఃఖాలకు స్పందిస్తూ రాస్తున్న గేయాలు, కవితలు చాలా ఆకట్టుకుంటున్నాయి. ఉట్నూరు కవిత 2014 అందుకు నిదర్శనం. ప్రతినెల ఉసావే కార్యక్రమాలు జరుగుతూ సామాజిక చైతన్యాన్ని తీసుకురావటంలో ముందుంటున్నారు. ఈ సంవత్సరం కూడా 'ఉట్నూరు సాహితీ సంచిక' పేరుతో వెలవరిస్తున్న సంకలనం, ఈ ప్రాంత సాహితీ సృజనకు అద్దం పడుతున్నది.

**- రాథోడ్ భీంరావు**

## నిర్ణయం కథల సంపుటి




**బొందల నాగేశ్వరరావు**

**వెల : 100/- పేజీలు: 120**

**ప్రతులకు : 09500020101**

**ఈ** పుస్తకంలో కథలన్నీ మానవ జీవితంలోని ఏదో ఒక పార్శ్వాన్ని చిత్రిస్తూ సాగాయి.... ఈ కథకునికి కథాశిల్పం మీద మంచి పట్టుందని ఈ కథలు రుజువు చేస్తున్నాయి. ఈ కథలన్నింటిలోనూ మంచి పఠనీయతా గుణం ఉంది. భవిష్యత్తులో ఈ కథకుడు ఇంకెన్నో మంచి కథలు రాస్తాడని, రాయాలని ఆకాంక్షిస్తూ, బొందల నాగేశ్వరరావును అభినందిస్తున్నాను.

**- అంపశయ్య నవీన్**

## సాత్త్విక భావాల సౌందర్య శిల్పి దాట్ల దేవదానం రాజు




**సౌభాగ్య**

**వెల : 60/- పేజీలు: 70**

**ప్రతులకు : 9440105987**

**నే**ను ఎవరు రాయమన్నా ఎప్పుడూ రాయలేదు. నాకు నచ్చితే ఎవరు వద్దన్నా రాయడం మానలేదు. దాట్ల వారి కవిత్వాన్ని చదివి పులకించి, ఆనందించి ఈ పుస్తకం రాశాను. ఇందులోని దాట్ల వారి అంతరంగం నేను ఆవిష్కరించింది సాహిత్యకారులకు ఆహ్లాదం కలిగిస్తుందని నమ్ముతున్నాను. .

**- సౌభాగ్య**

## విధివంచితుడు కథలు




**గూడూరు గోపాలకృష్ణమూర్తి**

**వెల : 100/- పేజీలు: 194**

**ప్రతులకు : 7382445284**

**నే**ను చేస్తున్న ఈ చిన్న సాహిత్య సేవలో నేను సామాజిక సమస్యలకి ప్రాధాన్యం ఇచ్చాను. ఆ సమస్యలకి పరిష్కారం చూపలేకపోయినా ఆవేదనగా నిట్టూర్పు విడిచాను. ఆ సమస్యలకి పరిష్కారం ఏదో ఒకరోజున లభిస్తుందని ఆశాజీవిగా ఆశిస్తూ నేను ఈ కథానికలు, కథలు వ్రాసాను.

**- రచయిత**

## డైరీ



కర్నూలులో కేంద్ర గ్రంథాలయంలో ఆగస్టు 7న సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన భాషావేత్త, చరిత్రకారుడు హీరాలాల్ సంస్మరణ సభ. చిత్రంలో న్యాయవాది యండివై రామ్మూర్తి, చంద్రశేఖర కల్కూర, గన్నమరాజు సాయిబాబా, ఎస్‌డివి అజీజ్, ఇనయ్‌తుల్లా, జంధ్యాల రఘుబాబు, కెంగార మోహన్ తదితరులు.




నిజామాబాద్‌లో గీతాభవన్ హాలులో జూలై 22న జరిగిన 'సాహిత్య ప్రసూన దాశరథి' విశిష్ట సంచిక ఆవిష్కరణ సభ. చిత్రంలో దేవులపల్లి ప్రభాకరరావు, ఎల్. దేవేందర్‌గుప్తా, ఎ.ఎస్. పోశెట్టి, మేకా రామస్వామి, ఆపారి సూర్యప్రకాశ్, డా॥ నాళేశ్వరం శంకరం, మేడిచర్ల ప్రభాకరరావు, పొత్తూరి సుబ్బారావు, ఆయాచితం నటేశ్వర శర్మ.



కడప నగరంలో హరిత (టూరిజం) హోటల్ ఫంక్షన్‌హాల్‌లో జూలై24న జరిగిన 'మల్లెమాల సాహిత్య పురస్కార ప్రదాన సభ. పాలగిరి విశ్వప్రసాద్‌కు పురస్కారం అందిస్తున్న డా॥ మల్లెమాల వేణుగోపాల రెడ్డి, డా॥ వరలక్ష్మి దంపతులు. చిత్రంలో డా॥ కేతు విశ్వనాథ రెడ్డి, ప్రతిమ, పొత్తూరి సుబ్బారావు తదితరులు.





అనంతపురంలో సాహితీస్రవంతి, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 21న నిర్వహించిన 'బెళ్ళూరి శ్రీనివాసమూర్తి' సాహితీసమాలోచనలో ప్రసంగిస్తున్న ఏలూరి వెంగన్న. చిత్రంలో సాహితీస్రవంతి నగర కమిటీ సభ్యులు రసూల్‌ఖాన్, భారతి ఉన్నారు.



విశాఖపట్నంలో పౌరగ్రంథాలయంలో జూలై 23న జరిగిన 'విశాఖ కథా తరంగాలు(2వ భాగం)' కథా సంకలనం ఆవిష్కరణ సభ. చిత్రంలో శిరేల సన్యాసిరావు, అంగర కృష్ణారావు, మేడా మస్తాన్ రెడ్డి, డా॥ తుర్లపాటి రాజేశ్వరి, అడపా రామకృష్ణ, ప్రసాదవర్మ, సర్వేశ్వరశాస్త్రి.



కడప నగరంలో హరిత (టూరిజం) హోటల్ ఫంక్షన్‌హాల్‌లో జూలై24న జరిగిన 'మల్లెమాల సాహిత్య పురస్కార ప్రదాన సభ. చిత్రంలో పురస్కారం స్వీకరించిన ప్రముఖ విమర్శకురాలు డా॥ కాత్యాయనీ విద్మహే, డా॥ మల్లెమాల వేణుగోపాల రెడ్డి, డా॥ వరలక్ష్మి తదితరులు



విశాఖపట్నంలో పౌరగ్రంథాలయంలో ఆగస్టు 13న జరిగిన విశాఖ సంస్కృతి మాసపత్రిక నాల్గవ వార్షికోత్సవ సభ. చిత్రంలో అడపా రామకృష్ణ, ఆకెళ్ళ రవిప్రకాష్, శిరేల సన్యాసిరావు, చింతకింద శ్రీనివాసరావు, చంద్రశేఖర్ ఆజాద్.

## తెలుగు భాషకు నిరాదరణ




*నంద్యాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషపై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న సాహితీస్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి. చిత్రంలో మాదాల శ్రీనివాస్, డా॥ రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, జంధ్యాల రఘుబాబు*

నంద్యాలలో సెప్టెంబర్ 27న రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో 70 ఏళ్ళ స్వాతంత్ర్య భారతంలో తెలుగు భాషా పరిస్థితి అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ ప్రజల భాష అయిన తెలుగును అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని అన్నారు. తెలుగు సంప్రదాయ భాష కాదని, ఆధునిక భాష అన్నారు. తెలుగు ప్రాచీన హోదాపై వివాదాలు వస్తున్నా ప్రభుత్వం ఇంకా కళ్ళు తెరవకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు మరిన్ని నిధులు అందజేయాలని కోరారు. సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ తెలుగును ప్రాథమిక స్థాయి నుంచే అభివృది చేయాలని అన్నారు. నంద్యాల సాహితీస్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తెలుగు భాష అనేది ప్రాచీన భాష అని దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల ప్రిన్సిపల్ డా. రామకృష్ణారెడ్డి, సాహితీస్రవంతి బాధ్యులు శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, శోభన్‌కుమార్, శేషఫణి, సాహిత్యాభిమానులు డా. రవీంద్రనాథ్; కరీముద్దీన్, రఘువీర్, దస్తగిరి, రవీంద్ర, హుస్సేన్, లక్ష్మణ్, మహబూబ్‌బాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ సమస్యలపై కవితా సంకలనం

రాయలసీమ సమస్యలు, వెనుకబాటుతనంపై కవితలను ఆహ్వానిస్తున్నట్లు సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీస్రవంతి రాయలసీమ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో వెలువడుతున్న ఈ సంకలనానికి ఇరవై అయిదు పంక్తులకు మించకుండా కవితలు పంపవలసిందిగా కోరారు. కవితలు సెప్టెంబరు 25వ తేదీలోగా ఎ. మస్తాన్‌వలి, సాహితీస్రవంతి, 2/693, నాగరాజ్‌పేట్, కడప – 516 001 చిరునామాకు, ఇమెయిల్: sahityamsamajamkosam@gmail.com కు పంపించ వలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 9490099284 ద్వారా సంప్రదించవచ్చును.

## అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్

కొత్తగా నవలలు రాసే రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో నవలాకారులు రచించిన మొదటి నవలలకు ప్రథమ బహుమతిగా పదివేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా ఐదు వేల రూపాయలను బహుమతిగా ఇవ్వనున్నట్లు ట్రస్టు కార్యదర్శి డి. స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు తమ తొలినవలను డి. స్వప్న, కార్యదర్శి, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్, 2–7–71, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్ – 506 001, చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఆ నవల 2013–2015 సంవత్సరాల మధ్యకాలంలో రచించినదై ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 0870–2456458 ద్వారా సంప్రదించవచ్చును.

## విమలాశాంతి సాహిత్య పురస్కారానికి రచనలు ఆహ్వానం

'2015 శాంతి రజనీకాంత్ స్మారక కవితా పురస్కారం' పేరుతో ఇచ్చే విమలాశాంతి సాహిత్య పురస్కారం కోసం ఉత్తమ కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఈ పురస్కారాన్ని కవితా ప్రక్రియకు ఇవ్వనున్నట్లు తెలిపారు. 2012 నుండి 2015 మధ్య కాలంలో ప్రచురించిన సంపుటాలను సెప్టెంబర్ 9వ తేదీలోగా వి. వెంకటేశులు, కథా రచయిత (రిటైర్డ్ ఫారెస్ట్ రేంజర్), డి. నెం. 3–328, ఎస్.ఎస్.ఎస్? సూపర్ మార్కెట్ దగ్గర, తపోవనం, అనంతపురం చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఎంపికయిన కవితా సంపుటి రచయితకు 2016 నవంబర్‌లో జరిగే పురస్కారోత్సవ సభలో అవార్డును ఇవ్వనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9704229692 సంప్రదించవచ్చును.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# గుర్రం జాషువా

**28.09.1895 - 24.07.1971**



ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గసరి బుసకొట్టు నాతని గాలిసోఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు

- గుర్రం జాషువా

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/16-18
Date of Posting : 02.09.2016 ▪ Date of Publication: 28.08.2016




ప్రజాశక్తి బుక్‌హౌస్, డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి, గవర్నరుపేట, రాఘవయ్య పార్కు వద్ద, విజయవాడ - 520 002, ఫోన్ : 9490099202

If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059